


www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 25-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 350 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా.2:41 తదుపరి దశమి, నక్షత్రం: రోహిణి మ.1:39 తదుపరి మృగశిర, వర్జ్యం: శేషం ఉ.7:38, రా.6:54-8:24, దుర్ముహూర్తం: మ.12:05-12:51, అమృతఘడియలు: ఉ.10:38-12:08, తె.3:55-5:25, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:39, సూర్యాస్తమయం: 6:16 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru







స్పోర్ట్స్

లంకకు చావోరేవో

నేడు కివీస్‌తో మ్యాచ్ ● రాత్రి 7.గం నుంచి

కొలంబో: టీ20 వరల్డ్‌కప్ సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకునేందుకు ఆతిథ్య శ్రీలంక జట్టు కీలక మ్యాచ్‌కు సిద్ధమైంది. సూపర్ 8లో భాగంగా బుధవారం న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో లంక గెలవడం తప్పనిసరి. ఇప్పటికే తమ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో 147 రన్స్‌తో చిత్తుగా ఓటమిపాలైంది. ఇక నేటి మ్యాచ్‌లో ఓపెనర్ నిస్సాంక రాణింపు కీలకం కానుంది. పిచ్ స్పిన్‌కు అనుకూలించనుండగా వెల్లలగెపై జట్టు ఆధారపడనుంది. అటు కివీస్ జట్టు పాక్‌తో ఆడిన తొలి మ్యాచ్ వర్షార్పణం కావడంతో ఒక పాయింట్ లభించింది. లీగ్ దశలో చూపిన జోరును ఓపెనర్లు ఆలెన్, సైఫర్ట్ కొనసాగించాలనుకుంటున్నారు. గ్రూప్ 2 నుంచి ఇప్పటికే ఇంగ్లండ్ సెమీస్ చేరడంతో.. మిగిలిన ఏకైక బెర్త్ కోసం న్యూజిలాండ్, పాక్‌లతో శ్రీలంక పోటీపడుతోంది.

శతకంతో 'శుభా'రంభం

జమ్మూ కశ్మీర్ 284/2 ● కర్ణాటకతో రంజీ ఫైనల్



శుభమ్ (117 నాటౌట్)

హుబ్బళ్లి (కర్ణాటక): తొలి రంజీ టైటిల్ కోసం బరిలోకి దిగిన జమ్మూ కశ్మీర్ ఫైనల్‌పోరులో శుభారంభాన్ని అందుకుంది. మంగళవారం కర్ణాటకతో మొదలైన ఈ మ్యాచ్‌లో శుభమ్ పందిర్ (117 నాటౌట్) అజేయ సెంచరీతో విజృంభించాడు. దీంతో మొదటి రోజు ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూకశ్మీర్ 2 వికెట్లకు 284 పరుగులు సాధించింది. శుభమ్ శతకానికి తోడు ఓపెనర్ యావర్ హసన్ (88), అబ్దుల్ సమద్ (52 నాటౌట్) అర్ధ సెంచరీలతో సత్తాచాటారు. కెప్టెన్ పరాస్ డోగ్రా (9) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు పడగొట్టాడు. శుభమ్‌కు తోడుగా సమద్ క్రీజులో ఉన్నాడు.

వైభవ్‌కు కారు బహుమానం

పట్నా: యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి టాటా మోటార్స్ సంస్థ కారును బహుమానంగా అందించింది. గతేడాది ఐపీఎల్‌లో 'సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్'గా నిలిచినందుకు టాటా కంపెనీ తమ లేటెస్ట్ వెర్షన్ కర్వ్ (సుమారు రూ. 22 లక్షలు) కారును అందించింది. అయితే వచ్చేనెలతో 14 ఏళ్లు పూర్తిచేసుకోనున్న వైభవ్ ఆ కారును నడపాలంటే మరో నాలుగేళ్లు ఆగాల్సిందే.



హీరో.. హ్యారీ

కెప్టెన్ హ్యారీ బ్రూక్ సూపర్ సెంచరీ

51 బంతుల్లో 100

సెమీస్‌లో ఇంగ్లండ్

పాకిస్థాన్ ధమాల్ | టీ20 వరల్డ్‌కప్ సూపర్-8

పల్లెకెలె: క్లిష్ట పరిస్థితుల్లో హ్యారీ బ్రూక్ (51 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 100) హీరోచిత శతకంతో.. ఇంగ్లండ్ టీ20 వరల్డ్‌కప్ సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. సూపర్-8లో భాగంగా మంగళవారం గ్రూప్-2లో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 2 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. తొలుత పాక్ 20 ఓవర్లలో 164/9 స్కోరు చేసింది. సాహిబ్జాదా ఫర్హాన్ (63) అర్ధ శతకం వృథా అయింది. డాసన్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఇంగ్లండ్ 19.1 ఓవర్లలో 166/8 స్కోరు చేసి గెలిచింది. విల్ జాక్స్ (28) రాణించాడు. షహీన్ షా అఫ్రీది 4 వికెట్లు దక్కించుకొన్నాడు. బ్రూక్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఆరంభంలోనే తడబడినా..: ఛేదనలో ఆరంభంలోనే పేసర్ అఫ్రీది భయపెట్టినా.. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన కెప్టెన్ బ్రూక్ ధాటిగా ఆడుతూ ఒంటరి పోరాటం చేశాడు. ఓపెనర్లు సాల్ట్ (0), బట్లర్ (2)తోపాటు బెథెల్ (8)ను తన వరుస ఓవర్లలో అవుట్‌చేసిన అఫ్రీది.. 35/3తో ఇంగ్లండ్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. కానీ, బ్రూక్.. మిగతా బౌలర్లే లక్ష్యంగా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. ఆరో ఓవర్‌లో నవాజ్ బౌలింగ్‌లో బ్రూక్ 4,4,6తో 17 పరుగులు రాబట్టడంతో.. ఇంగ్లండ్ 53/3తో పవర్‌ప్లేను ముగించింది. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లోనే బాంటన్ (2)ను తారిక్ వెనక్కిపంపాడు. ఈ దశలో కర్రాన్ (16)తో కలసి స్కోరు బోర్డును నడిపించిన బ్రూక్.. 10వ ఓవర్‌లో సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. అయితే, కర్రాన్‌ను తారిక్ అవుట్ చేయడంతో.. ఐదో వికెట్‌కు 45 పరుగులతో ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీకి బ్రేక్ పడింది. అయితే, జాక్స్‌తో కలసి బ్రూక్ 52 పరుగుల భాగస్వామ్యంతో జట్టును విజయానికి చేరువ చేశాడు. చివరి 4 ఓవర్లలో విజయానికి 27 పరుగులు కావాల్సి ఉండగా.. 17వ ఓవర్‌లో అఫ్రీది బౌలింగ్‌లో 4,6,4తో సెంచరీ పూర్తి చేసుకొన్న బ్రూక్.. చివరి బంతికి బౌల్డ్ అయ్యాడు. ఆఖరి 12 బంతుల్లో 5 పరుగులు అవసరమైన దశలో జాక్స్, ఓవర్టన్ (0)ను నవాజ్ అవుట్ చేయడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ తరుణంలో జోఫ్రా ఆర్చర్ (5 నాటౌట్) బౌండ్రీ బాదడంతో ఇంగ్లండ్ సంబరాల్లో మునిగిపోయింది.

నిలిచిన ఫర్హాన్: అంతకుముందు ఫర్హాన్ విలువైన భాగస్వామ్యాలతో ఆదుకోవడంతో పాక్ పోరాడగలిగే స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న పాక్.. ఓపెనర్ సయిమ్ అయూబ్ (7), కెప్టెన్ సల్మాన్ ఆఘా (5) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో బాబర్ (25)తో కలసి మూడో వికెట్‌కు 46 రన్స్ జోడించిన ఫర్హాన్ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేశాడు. బాబర్‌ను ఓవర్టన్ బౌల్డ్ చేసినా.. ఆ తర్వాత వచ్చిన ఫఖర్ జమాన్ (25), ఫర్హాన్ నాలుగో వికెట్‌కు 49 రన్స్ జతచేశారు. ఆఖర్లో షాదాబ్ (23) దూకుడుగా ఆడి జట్టు స్కోరును 160 దాటించాడు.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 164/9 (ఫర్హాన్ 63, బాబర్ 25; డాసన్ 3/24, ఓవర్టన్ 2/26).
ఇంగ్లండ్: 19.1 ఓవర్లలో 166/8 (బ్రూక్ 100, జాక్స్ 28; అఫ్రీది 4/30, నవాజ్ 2/26).

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
ఇంగ్లండ్	2	2	0	0	4	1.491
న్యూజిలాండ్	1	0	0	1	1	0.000
పాకిస్థాన్	2	0	1	1	1	-0.461
శ్రీలంక	1	0	1	0	0	-2.550

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; ర: రద్దు; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్

అరుంధతి, శ్రీచరణి ముందంజ

టీ20 ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో తెలుగమ్మాయిలు అరుంధతి రెడ్డి, శ్రీచరణి ముందంజ వేశారు. బౌలర్ల జాబితాలో అరుంధతి ఐదుస్థానాలు మెరుగై 11వ ర్యాంక్‌తో కెరీర్ బెస్ట్‌గా నిలిచింది. శ్రీచరణి ఏకంగా 11 స్థానాలు ముందుకెళ్లి 26వ స్థానం దక్కించుకుంది.

సచిన్‌ను అవుటిచ్చి..తప్పు చేశా!

మాజీ అంపైర్ స్టీవ్ బక్నర్




కింగ్‌స్టన్: అంపైర్ స్టీవ్ బక్నర్.. పాతతరం క్రికెట్ ప్రేమికులకు పరిచయం అక్కర్లేని పేరు. 2003లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో సచిన్‌ను ఎల్బీగా అవుట్ చేసిన నిర్ణయం బక్నర్‌ను తీవ్ర విమర్శల పాలు చేసింది. అయితే 22 ఏళ్ల తర్వాత అప్పటి నిర్ణయంపై తను పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు. 'సచిన్ ఎల్బీ విషయంలో నేను తీసుకున్న నిర్ణయం తప్పు. జీవితంలో తప్పులు చేస్తుంటాం. సరిదిద్దుకుని ముందుకుసాగాల్సిందే' అని ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. బ్రిస్బేన్‌లో జరిగిన ఆ టెస్టులో గిలెస్పీ వేసిన బంతి సచిన్ ప్యాడ్లను తాకింది. వెంటనే బక్నర్ ఎల్బీగా ప్రకటించాడు. నిజానికి ఆ బంతి స్టంప్స్‌పైన వెళ్తున్నట్టుగా రీప్లేలో స్పష్టంగా తేలింది. అప్పట్లో బక్నర్ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

తండ్రి పరిస్థితి విషమం



హుటాహుటిన ఇంటికి రింకూ

చెన్నై: టీమిండియా క్రికెటర్ రింకూ సింగ్ టీ20 ప్రపంచకప్ మధ్యలోనే ఇంటికి వచ్చేశాడు. రింకూ తండ్రి ఖాన్‌చంద్ సింగ్ తీవ్ర అనారోగ్యంతో నోయిడాలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొన్నాళ్లుగా లివర్ క్యాన్సర్ (నాలుగో దశ)తో బాధపడుతున్న ఖాన్‌చంద్ పరిస్థితి విషమంగా ఉందని, అతనికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం జింబాబ్వేతో మ్యాచ్‌కు రింకూ దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. కాగా రింకూ అంతర్జాతీయ క్రికెటర్ అయిన తర్వాత కూడా తండ్రి ఖాన్‌చంద్ గ్యాస్ సిలిండర్ల డెలివరీ ఉద్యోగంలో కొనసాగడం గమనార్హం. ఆయన స్వస్థలం యూపీలోని అలీగఢ్.



జూన్ 14న భారత్ X పాక్ పోరు

● మహిళల టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్
● తొలిసారిగా బరిలోకి 12 జట్లు

ఇంగ్లండ్ వేదికగా మెగా ఈవెంట్

దుబాయ్: క్రికెట్ అభిమానులను అలరించేందుకు మరో మెగా ఈవెంట్ రాబోతోంది. ఇంగ్లండ్ వేదికగా ఈ ఏడాది జూన్ 12 నుంచి జూలై 5 వరకు మహిళల టీ20 వరల్డ్‌కప్ జరుగనుంది. ఈ మేరకు మంగళవారం ఐసీసీ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. టోర్నీ చరిత్రలో తొలిసారిగా 12 జట్లు టైటిల్ కోసం తలపడనుండగా, వీటిని రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ గ్రూప్‌లో టాప్-2గా నిలిచిన జట్లు సెమీస్‌కు వెళ్తాయి. గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, గ్రూప్ 'బి'లో న్యూజిలాండ్, వెస్టిండీస్, ఇంగ్లండ్, స్కాట్లాండ్, శ్రీలంక, ఐర్లాండ్ లీగ్ దశలో పోటీపడనున్నాయి. వీటిలో బంగ్లా, ఐర్లాండ్, స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్వాలిఫయర్స్ ద్వారా అర్హత సాధించాయి. అలాగే నెదర్లాండ్స్‌కిదే తొలి టీ20 వరల్డ్‌కప్ కావడం విశేషం. ఇక టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు శ్రీలంకతో ఆడనుంది. అలాగే భారత్ విషయానికి వస్తే.. తమ తొలి మ్యాచ్‌లోనే దాయాది పాకిస్థాన్‌ను ఎదుర్కొనబోతోంది. జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్‌లో ఈ పోరు జరుగనుంది. మరోవైపు గ్రూప్ 'ఎ'లో పటిష్ఠ జట్లు ఉండడంతో హర్మన్‌ప్రీత్ సేనకు గట్టి సవాల్ ఎదురుకానుంది. మొత్తంగా ఏడు వేదికల్లో 33 మ్యాచ్‌లను నిర్వహించనుండగా, ఫైనల్‌కు ప్రఖ్యాత లార్డ్స్ మైదానం ఆతిథ్యం ఇవ్వనుంది.

భారత్ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	వేదిక
జూన్ 14	పాకిస్థాన్‌తో	ఎడ్జ్‌బాస్టన్
జూన్ 17	నెదర్లాండ్స్‌తో	హెడింగ్లీ
జూన్ 21	దక్షిణాఫ్రికాతో	ఓల్డ్ ట్రాఫోర్డ్
జూన్ 25	బంగ్లాదేశ్‌తో	ఓల్డ్ ట్రాఫోర్డ్
జూన్ 28	ఆస్ట్రేలియాతో	లార్డ్స్



బెత్ మూనీ (76)

అమ్మాయిల ఫ్లాప్ షో

● మంధాన, హర్మన్ అర్ధ శతకాలు వృథా
● తొలి వన్డేలో ఓడిన భారత్
● అలవోకగా నెగ్గిన ఆసీస్

రాణించిన మూనీ, హీలీ

బ్రిస్బేన్: బ్యాటర్ల వైఫల్యంతో.. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను భారత మహిళల జట్టు ఓటమితో ఆరంభించింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో వరల్డ్ చాంప్ భారత్ 6 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో చిత్తయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న భారత్ 48.3 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. స్మృతి మంధాన (58), హర్మన్‌ప్రీత్ (53) అర్ధ శతకాలు చేశారు. గార్డ్‌నర్ మూడు, మేగన్ షట్ రెండు వికెట్లు పడగొట్టారు. ఓపెనర్ ప్రతీక రావల్ (0) డకౌట్ కాగా.. షఫాలీ వర్మ (4), జెమీమా రోడ్రిగ్స్ (8) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. ఆఖర్లో తెగించి ఆడిన గౌతమ్ టీమ్‌కు గౌరవప్రద స్కోరు అందించింది. ఛేదనలో ఆసీస్ 38.2 ఓవర్లలో 217/4 స్కోరు చేసి గెలిచింది. బెత్ మూనీ (76), అలిస్సా హీలీ (50), అనబెల్ సదర్లాండ్ (48 నాటౌట్) రాణించారు. శ్రీచరణి రెండు వికెట్లు పడగొట్టింది.

హర్మన్‌కు గాయం: కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మోకాలికి గాయమైంది. బ్యాటింగ్ చేస్తున్న సమయంలో 38వ ఓవర్‌లో మేగన్ బౌలింగ్‌లో హర్మన్ ఎడమ కాలికి దెబ్బ తగిలింది. అయినా, నొప్పితోనే ఆమె బ్యాటింగ్ కొనసాగించింది. ఆసీస్ బ్యాటింగ్ సమయంలో హర్మన్ ఫీల్డింగ్‌కు రాలేదు.

బిజినెస్

రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

నష్టాల్లోకి మార్కెట్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. అమ్మకాలహోరుతో సెన్సెక్స్ 1,068.74 పాయింట్ల నష్టంతో 82,225.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్ల నష్టంతో 25,424.65 వద్ద క్లోజయింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లు తుడిచి పెట్టుకుపోయింది.

వెంటాడిన ఏఐ భయాలు: ఐటీ కంపెనీల షేర్లను కృత్రిమ మేధ (ఏఐ) భయం మంగళవారం సైతం వెంటాడింది. ఐటీ కంపెనీల షేర్లు మరింతగా నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ సూచీ ఆరు శాతం నష్టపోయింది. ఈ నెల ఇప్పటి వరకు ఈ సూచీ 21 శాతం నష్టపోయింది. 2008 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం తర్వాత నిఫ్టీ ఐటీ సూచీ ఒక నెలలో ఇంత భారీగా నష్టపోవడం ఇదే మొదటిసారి. టెక్ మహీంద్ర కంపెనీ షేర్లయితే అత్యధికంగా 6.6% నష్ట పోయాయి.

కెనరాబ్యాంక్ రూ.5,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ టయర్ 2 బాండ్ల జారీ ద్వారా రూ.5,000 కోట్లు సమీకరించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఈ ఇష్యూ గురువారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజిలోని ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ప్లాట్‌ఫారంపై ప్రారంభమవుతుందని తెలిపింది. బేస్ ఇష్యూ పరిమాణం రూ.2,000 కోట్లు కాగా రూ.3,000 కోట్లు అదనంగా సమీకరించే స్వేచ్ఛ బ్యాంకు తన చేతిలో ఉంచుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	500
వరంగల్	472	గోదావరి	480
చిత్తూరు	533	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	125
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	121
కర్నూలు	125	నెల్లూరు	126
విశాఖపట్నం	125	అనంతపురం	126
గోదావరి	125		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,61,780	1,48,300	2,90,000
విజయవాడ	1,63,000	1,51,000	2,75,000
విశాఖపట్నం	1,63,385	1,48,300	2,90,000
రాజమండ్రి	1,61,780	1,48,300	2,65,000
ప్రొద్దుటూరు	1,57,600	1,44,990	2,73,200
ముంబై	1,58,220	1,44,930	2,64,075

అన్‌లిస్టెడ్ కంపెనీల లాభాల్లో జెరోధా టాప్

ఐదో స్థానంలో బయోలాజికల్-ఇ ● జేఎం ఫైనాన్షియల్, హురున్ ఇండియా నివేదిక



ముంబై: ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ జెరోధా లాభాల్లో దూసుకుపోతోంది. దేశంలోని అన్‌లిస్టెడ్ కంపెనీల్లో అత్యధిక లాభ శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. జేఎం ఫైనాన్సియల్ హురున్ ఇండియా విడుదల చేసిన 'అన్‌లిస్టెడ్ జెమ్స్, 2026' జాబితాలో జెరోధా 48% నికర లాభ శాతంతో అగ్రస్థానం సంపాదించింది. బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఈ ఫిన్‌టెక్ కంపెనీ గత ఆర్థిక సంవత్సరం రూ.4,235 కోట్ల లాభాలు నమోదు చేసింది. జెరోధా తర్వాత పుణె కేంద్రంగా పనిచేసే సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ 38 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. అదానీ ప్రాపర్టీస్ (34%), అరిస్టో ఫార్మా (32%) లాభాలతో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే వ్యాక్సిన్ల తయారీ కంపెనీ బయోలాజికల్-ఇ 30% లాభాలతో ఐదో స్థానం సంపాదించింది. ముంబైకి చెందిన యూఎస్‌వీ (29%), ఓరియంటల్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ (26%), గుజరాత్‌కు చెందిన మధు సిలికా (26%), మెరిల్ లైఫ్ సైన్సెస్ (25%), చెన్నై కేంద్రంగా పనిచేసే సన్మార్ షిప్పింగ్ (21%) వరుసగా తరువాతి స్థానాల్లో నిలిచాయి.

ఆదాయంలో రిలయన్స్ రిటైల్ టాప్ :

ఆదాయపరంగా చూస్తే దేశంలోని అన్‌లిస్టెడ్ కంపెనీల్లో రిలయన్స్ రిటైల్ రూ.2.7 లక్షల కోట్ల ఆదాయంతో అగ్రస్థానంలో ఉంది. ఫ్లిప్‌కార్ట్ (రూ.83,000 కోట్లు), మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ (రూ.66,000 కోట్లు) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఏటా కనీసం రూ.1,000 కోట్ల వార్షికాదాయం ప్రాతిపదికగా తీసుకుని జేఎం ఫైనాన్సియల్ హురున్ ఇండియా 100 అన్‌లిస్టెడ్ కంపెనీలతో ఈ జాబితా విడుదల చేసింది. ఈ కంపెనీల వార్షికాదాయం గత ఏడాది రూ.8.9 లక్షల కోట్ల వరకు ఉంది.

జాబితాలోని తెలుగు కంపెనీలివే..

- బయోలాజికల్-ఇ
- శిరిడి సాయి ఎలక్ట్రికల్స్
- మేధా సర్వో డ్రైవ్స్
- గ్రీన్‌కో గ్రూప్
- కేఎంవీ ప్రాజెక్ట్స్
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్
- నోవోపోర్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్
- దేవీ సీ ఫుడ్స్
- సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్
- సోనోవిజన్ ఎలక్ట్రానిక్స్

నాట్కో ఫార్మాతో ఐరిస్ లైఫ్‌సైన్సెస్ జట్టు

న్యూఢిల్లీ మధుమేహం, ఊబకాయ నియంత్రణలో విస్తృతంగా ఉపయోగించే సెమాగ్లుటైడ్ ఔషధాన్ని వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసేందుకు ఐరిస్ లైఫ్‌సైన్సెస్, నాట్కో ఫార్మా చేతులు కలిపాయి. వచ్చే నెలలో పేటెంట్ హక్కులు ముగిసే ఈ ఔషధాన్ని ప్రస్తుతం నోవో నార్డిస్క్, ఇలి లిల్లీ కంపెనీలు వెగోవి, మోంజారో పేరుతో భారత్‌లో మార్కెట్ చేస్తున్నాయి. వీటికి జనరిక్ వెర్షన్లు తీసుకొచ్చేందుకు నాట్కో, డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ సహా అనేక ఫార్మా కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగానే నాట్కో ఫార్మా-ఐరిస్ లైఫ్‌సైన్సెస్ కంపెనీలు చేతులు కలిపాయని భావిస్తున్నాయి.

పెట్టుబడులపై పవర్‌గ్రిడ్‌కు మరింత స్వేచ్ఛ

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థ ఈక్విటీ పెట్టుబడులపై కేంద్ర ప్రభుత్వం పవర్‌గ్రిడ్‌కు మరింత స్వేచ్ఛ ఇచ్చింది. ఇప్పటి వరకు ఈ సంస్థల ఈక్విటీలో పవర్‌గ్రిడ్ పెట్టుబడులపై ఉన్న పరిమితి రూ.5,000 కోట్లను రూ.7,500 కోట్లకు పెంచింది. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేంద్ర కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ఈక్విటీ పెట్టుబడులు పవర్‌గ్రిడ్ నికర ఆస్తుల విలువలో 15% మించకూడదని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో విద్యుత్ సరఫరా ప్రాజెక్టుల కోసం పవర్‌గ్రిడ్ మరింత సమర్థవంతంగా పోటీపడగలదని భావిస్తున్నారు.

ప్రతికూలతల్లోనూ టెక్ కంపెనీల హవా

● 6% వృద్ధితో రూ. 28.65 లక్షల కోట్లకు ఆదాయం
● మరో 1.35 లక్షల ఉద్యోగాలు ● నాస్కామ్ అంచనా

ముంబై: అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, కృత్రిమ మేధ (ఏఐ) విధ్వంసం నేపథ్యంలోనూ దేశీయ టెక్నాలజీ రంగ ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) 6.1% వృద్ధితో 31,500 కోట్ల డాలర్లకు (సుమారు రూ.28.65 లక్షల కోట్లు) చేరుకోనుందని నాస్కామ్ అంటోంది. నాస్కామ్ మంగళవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2025-26లో టెక్ రంగంలో ఉద్యోగుల సంఖ్య నికరంగా మరో 1.35 లక్షలు పెరిగి 59.5 లక్షలకు చేరుకోనుంది. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలోని ఐటీ ఉద్యోగుల మొత్తం సంఖ్య 58.15 లక్షలుగా ఉంది. 2024-25లో ఇండస్ట్రీ నికరంగా 1.33 లక్షల మందిని నియమించుకుంది. ఈ సారి ఉద్యోగాల వృద్ధి 2.3%, ఆదాయ వృద్ధి 6.1% మధ్య స్పష్టమైన భేదం కనిపించినప్పటికీ ఇండస్ట్రీ పనితీరు సంతృప్తికరంగానే ఉందని నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ అన్నారు.

మరిన్ని ముఖ్యాంశాలు..

- టెక్నాలజీ రంగంలో గణనీయ మార్పులు వస్తున్నప్పటికీ, ఐటీ రంగంలో ఉద్యోగుల పెరుగుదల భవిష్యత్తులో కూడా కొనసాగుతుంది. ప్రస్తుత 59.5 లక్షల మంది ఉద్యోగుల్లో ఇప్పటికే 20 లక్షల మందికి పైగా ఏఐలో శిక్షణ తీసుకున్నారు. అందులో 3 లక్షల మంది అడ్వాన్స్‌డ్ ఏఐ నైపుణ్యాలు కలిగి ఉన్నారు.
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఐటీ కంపెనీల ఏఐ ఆదాయం 1,000-1,200 కోట్ల డాలర్ల (రూ.90,950-1,09,140 కోట్లు) స్థాయిలో ఉండవచ్చని అంచనా.
- 2024-25 ఆర్థిక సంవత్సరం ఐటీ పరిశ్రమ ఆదాయాన్ని గత ఫిబ్రవరిలో అంచనా వేసిన 28,260 కోట్ల డాలర్ల నుంచి 29,700 కోట్ల డాలర్లకు పెంచింది.
- గతంలో ఐటీ రంగ ఆదాయంలో అమెరికా మార్కెట్ అధిక వృద్ధి కలిగి ఉండేది. కానీ, ఈ సారి ఆసియా పసిఫిక్, పశ్చిమాసియా మార్కెట్లు అద్భుతమైన వృద్ధి నమోదు చేశాయి. దేశీయ మార్కెట్ ఆదాయ వృద్ధి 7.9 శాతంగా నమోదయ్యే అవకాశం ఉంది. ప్రపంచ సగటు కంటే ఇది అధికం.
- రంగాలవారీగా చూస్తే, హెల్త్‌కేర్, ట్రావెల్, రవాణా రంగాలు వేగవంతమైన వృద్ధి కనబరిచాయి.

హైదరాబాద్‌లో నసుని ఆర్ అండ్ డీ కేంద్రం

హైదరాబాద్: ఫైల్ డేటా ఫౌండేషన్ సేవలందించే కంపెనీ నసుని హైదరాబాద్‌లో ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ప్రారంభించింది. యూనిఫైడ్ ఫైల్ డేటా నిర్వహణ, రక్షణ, యాక్టివేషన్ విభాగాల్లో ఇన్నోవేషన్ వేగం పెంచడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. కంపెనీ సీఈఓ శాం కింగ్ సమక్షంలో తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.

కోవెసెంట్ టెక్నాలజీస్‌కు ఐఎస్‌ఓ అక్రెడిషన్ సర్టిఫికేషన్

హైదరాబాద్ : సాస్ (సర్వీస్‌గా సాఫ్ట్‌వేర్) సేవలందించే ప్రముఖ కంపెనీ కోవెసెంట్ టెక్నాలజీస్‌కు ఐఎస్ఓ/ఐఈసీ 42001:2023 అక్రెడిటెడ్ సర్టిఫికేట్ లభించింది. బాధ్యతాయుత ఏఐ నిర్వహణపై తమ కట్టుబాటుకు గుర్తింపుగా ఈ సర్టిఫికేషన్ సాధించింది. ఈ సర్టిఫికేషన్‌తో కోవెసెంట్ ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన ఐబీఎం, మైక్రోసాఫ్ట్, ఏడబ్ల్యూఎస్, స్నోఫ్లేక్ వంటి టెక్నాలజీ లీడర్ల సరసన స్థానం సంపాదించినట్టు కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీవీ సుబ్రమణ్యం అన్నారు.

నోయల్ టాటా కొర్రీలు.. చంద్ర పునర్నియామకం వాయిదా

టాటా సన్స్ బోర్డులో మరో ముసలం



ముంబై: టాటా గ్రూప్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈమధ్య టాటా ట్రస్ట్ బోర్డులో సభ్యుల పునర్నియాకాల విషయంలో విబేధాలు పొడచూపగా.. తాజాగా టాటా సన్స్ బోర్డులోనూ అభిప్రాయ బేధాలు వెలుగు చూశాయి. టాటా సన్స్‌కు మూడోసారి ఛైర్మన్‌గా నటరాజన్ చంద్రశేఖరన్ పునర్నియామకంపై నిర్ణయాన్ని బోర్డు వాయిదా వేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ పదవీకాలం 2027 ఫిబ్రవరితో ముగియనుంది. ఆ తర్వాత కూడా ఆయన్ని సారథ్య బాధ్యతల్లో కొనసాగించే విషయంపై చర్చించేందుకు మంగళవారం జరిగిన కంపెనీ బోర్డు భేటీ ఏ నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. ఈ విషయాన్ని బోర్డు అధికారికంగా వెల్లడించకపోయినప్పటికీ, నోయల్ టాటా కొర్రీలే ఇందుకు కారణమని తెలిసింది. టాటా సన్స్‌లో 66% వాటా కలిగిన టాటా ట్రస్ట్‌ల చైర్మన్ అయిన నోయల్ టాటా.. గ్రూప్‌లోని కొన్ని కంపెనీల నష్టాలపై ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. బోర్డులోని ఇతర సభ్యులు చంద్రశేఖర్ పునర్నియామకానికి మద్దతు పలికారని.. నష్టాలు చవిచూస్తున్నవి కొత్త తరం కంపెనీలని, వాటి వ్యాపారం పరిణతి చెంది లాభాల బాట పట్టేందుకు సమయం పడుతుందని వారు అభిప్రాయపడ్డారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఓటింగ్ ద్వారా పునర్నియామకంపై నిర్ణయం తీసుకుందామని కొందరు సభ్యులు ప్రతిపాదించినప్పటికీ.. చంద్రశేఖరన్ స్వయంగా ఈ నిర్ణయాన్ని వాయిదా వేయాలని కోరినట్లు తెలిసింది.

నోయల్ నాలుగు షరతులు

ప్రస్తుతం టాటా సన్స్ బోర్డులో నోయల్ టాటాతోపాటు టీవీఎస్‌కు చెందిన వేణు శ్రీనివాసన్ టాటా ట్రస్ట్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. చంద్ర పునర్నియామకాన్ని ఆమోదించేందుకు నోయల్ టాటా నాలుగు షరతులను బోర్డు ముందుంచారట.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కేరళ.. ఇక కేరళం



రాష్ట్ర పేరు మార్పుకు కేంద్రం ఆమోదం

సేవా తీర్థ్‌లో తొలిసారి క్యాబినెట్ భేటీ

4 రాష్ట్రాల్లో రూ.9,072 కోట్ల రైల్వే ప్రాజెక్టులకు మంత్రివర్గం పచ్చజెండా

9

బుధవారం | 25-2-2026 | Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

దేవుడు క్షమించడు

తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు ముందస్తు కుట్ర: సీఎం



- కల్తీ నెయ్యి.. వ్యవస్థీకృత సిండికేట్ నేరమే
- చుక్కపాలు సేకరించని సంస్థలకు నెయ్యి టెండర్లు
- రసాయనాలు, ఇతర పదార్థాలతో తయారీ
- జంతు కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ నివేదిక
- దాని ఆధారంగానే నేను, పవన్ మాట్లాడాం
- 2022లోనే కల్తీ వెలుగులోకి
- సీఎఫ్‌టీఆర్ఐ నివేదికను తొక్కిపెట్టిన సుబ్బారెడ్డి
- వైఎస్ నాటి నుంచే తిరుమలలో అపచారాలు
- శ్రీవారికి ఉన్నది రెండు కొండలేనంటూ 2005 సెప్టెంబరు 16న జీవో 338 జారీ
- నాడు నేను రద్దుచేయాలన్నది 338నే
- కానీ జగన్ అబద్ధాలు చెబుతున్నారు
- ఆయన హయాంలో ప్రణాళిక ప్రకారమే ఆలయాలపై దాడి, విగ్రహాల ధ్వంసం
- పాపాలు దాచేందుకే హెరిటేజ్‌పై దుష్ప్రచారం
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ధ్వజం

> కల్తీ జరిగిందని టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన వారే (వైవీ సుబ్బారెడ్డి) అంగీకరించారు. కానీ జగన్ ఆయన్ను వెనకేసుకురావడం ఏమిటి? ఏమీ జరగలేదంటూ.. రివర్స్‌లో మేమే క్షమాపణ చెప్పాలంటారా?
> - సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దేవదేవుడైన తిరుమల శ్రీవేంకటేశ్వరుడి పవిత్రతను, సనాతన ధర్మాన్ని దెబ్బతీసేందుకు ముందస్తు కుట్ర జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ దిశగా ఓ వ్యవస్థీకృత సిండికేట్ దారుణ నేరాలకు పాల్పడిందని, ఇందులో లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం ఒకటని చెప్పారు. ఒకవైపు కల్తీనెయ్యి సరఫరా.. మరోవైపు అన్యమతప్రచారం.. ఇంకోవైపు హిందూమతంపై దాడిచేయడం ద్వారా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన వ్యక్తులను దేవదేవుడు క్షమించడన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణలో అనేక దారుణాలు వెలుగులోకి వచ్చినా.. తప్పుడు పనులు చేసిన వ్యక్తులు ఇంకా బుకాయించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు హెరిటేజ్‌పై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. మంగళవారం

మిగతా 11వ పేజీలో...

> తిరుమలకు వెళ్లే అన్యమతస్థులు శ్రీవారిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వాలి. కానీ జగన్ తిరుమలకు వెళ్లినప్పుడు డిక్లరేషన్‌పై ఎందుకు సంతకం చేయలేదు? డిక్లరేషన్‌పై క్యాన్సిల్ అని నమోదుచేసి దౌర్జన్యంగా వెళ్లారు. అధికారం ఉందన్న అహంభావంతో ప్రవర్తించారు.
> - సీఎం చంద్రబాబు



శిక్ష పడాల్సిందే!

- పాలు లేకుండా నెయ్యి చేసిన ఘనత వైసీపీదే 11
- కెమికల్ నెయ్యి పాపం గత టీటీడీ పాలక మండలిదే
- వారిని వెనుకేసుకొస్తున్న నాటి 'ముఖ్య నేత' కూడా బాధ్యుడే
- 'నివేదిక' కొవ్వు కలిసిందంటే, 'సిట్' పాలే లేవంది
- ఇస్లాం, క్రైస్తవ మతాల్లో ఇలా జరిగితే దేశం గగ్గోలు పెట్టేది
- దేవుడి డబ్బు దోచుకునేవారు, వారి తరాలూ లేచిపోతాయి
- దోషులను కూటమి ప్రభుత్వం శిక్షిస్తుంది: డిప్యూటీ సీఎం పవన్



మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు అనిత, నాదెండ్ల, అచ్చెన్న, లోకేశ్, కొల్లు

విపక్షంగా వైసీపీ విఫలం!

నిర్మాణాత్మకంగా ఉండకుండా రాజకీయాలకే పరిమితం

- అందుకే మనమే విపక్ష పాత్రా పోషించాలి
- మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలను ఏఐ ద్వారా విశ్లేషిస్తా
- అసెంబ్లీ జరిగినన్ని రోజులూ ఒక అంశంపై లఘు చర్చ
- సందర్భాన్ని బట్టి నేను, పవన్ చర్చలో పాల్గొంటాం
- క్యాబినెట్ భేటీ తర్వాత మంత్రులతో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'మనం అసెంబ్లీలో మాట్లాడే ప్రతి మాటకూ ఎంతో విలువ ఉంటుంది. అసెంబ్లీలో మాట్లాడితే రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ వెళ్లి మాట్లాడినట్లే! ఏడాదిపాటు ఊర్లలో తిరిగి మనం చేసే కార్యక్రమాల ద్వారా ఎలాంటి ప్రయోజనం పొందుతామో.. ఒక రోజు అసెంబ్లీలో మాట్లాడడం ద్వారా అంతకంటే ఎక్కువ ప్రయోజనం లభిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. మంగళవారం రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ముగిసిన తర్వాత.. తాజా రాజకీయ పరిణామాలపై సహచర మంత్రులతో ఆయన చర్చించారు. అసెంబ్లీ సమయం ఎంతో విలువైందని.. సభలో ప్రతిపక్షం పాత్ర కీలకమని, కానీ వైసీపీ నిర్మాణాత్మక పాత్ర పోషించకుండా.. మండలిలోనూ

మిగతా 10వ పేజీలో...

'ఉన్నత విద్య'లో ప్రక్షాళన

- కొత్తగా ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి కమిషనరేట్లు
- ఉన్నత విద్య కమిషనరేట్ పరిధిలోకి అన్ని కాలేజీలు
- 'సాంకేతిక విద్య' రద్దు.. ఉన్నత విద్యలోకి పాలిటెక్నిక్‌లు
- అకడమిక్ అంశాలకే ఉన్నత విద్యామండలి పరిమితం

రూ.2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ

- 40%, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికీ ఫ్రీ బస్సు
- నీరు-చెట్టు పనుల కేసులు ఎత్తివేతకు నిర్ణయం
- క్యాబినెట్ సమావేశంలో 57 అంశాలకు ఆమోదం



లోకేశ్.. భేష్!

- సమస్యలపై మంత్రి తక్షణమే స్పందిస్తున్నారు
- ఎ.కొండూరు కేజీబీవీలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనలో ఆదేశాలిచ్చారు
- కలెక్టర్, జేసీ, యంత్రాంగమంతా తరలివెళ్లింది
- కేజీబీవీల్లో శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీపై కేంద్రంతో మాట్లాడుతున్నట్లు అసెంబ్లీలో చెప్పారు
- హైకోర్టు కితాబు.. మంత్రి ఇలా పనిచేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంతో చెడ్డపేరు తెస్తున్నారేం?
- సర్వశిక్ష పీడీ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఫైర్

10

మీ తీరు కోర్టు ధిక్కరణే!

- 2018 గ్రూపు-1 అభ్యర్థులను అప్రాధాన్య పోస్టులకు మార్చడంపై నివేదిక ఎందుకు ఇవ్వలేదు?
- సీఎస్ విజయానంద్‌పై హైకోర్టు ధర్మాసనం ఆగ్రహం
- ఆయన వైఖరి కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది
- సుమోటో ధిక్కరణ కేసు ఎందుకు నమోదు చేయకూడదో నేడు కోర్టుకు హాజరై వివరణ ఇవ్వండి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

10



నీటి కేటాయింపులపై ట్రైబ్యునల్ పాత్ర నామమాత్రమే!

- ప్రాజెక్టులవారీగా కేటాయించే అధికారం లేదు: ఏపీ
- తెలంగాణ వాదనలు అపరిపక్వం, అనాలోచితం
- వాటిని పరిగణనలోకి తీసుకోవద్దు
- రాజధాని అమరావతి పరిధి 217 చ.కి.మీ. మాత్రమే
- 8,603 చ.కి.మీ.గా ఉందనడం నిజం కాదు
- హైదరాబాద్ పట్టణీకరణపై తెలంగాణ చేస్తున్న వాదనల్లోనూ వాస్తవం లేదు
- బ్రిజేశ్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ న్యాయవాదుల స్పష్టీకరణ
- తదుపరి విచారణ మార్చి 23, 24 తేదీలకు వాయిదా

7



తెలంగాణ డీజీపీ సమక్షంలో లొంగిపోయిన చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, దేవ్‌జీ, నర్సింహారెడ్డి

విప్లవ పోరుకు ముగింపు

దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతల లొంగుబాటు

మావోయిస్టు పార్టీ సంస్థాగత నిర్మాణం పతనం

- పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది
- వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలి: డీజీపీ
- డీజీపీ సమక్షంలో లొంగిపోయిన తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డి
- అనారోగ్యంతోనే రహస్య జీవితం వదిలాం.. ప్రజా సమస్యలపై ఇకపైనా పోరాటాలు చేస్తాం: దేవ్‌జీ
- నేపాల్‌లో గణపతి.. అదుపులోకి తీసుకున్న పోలీసులు?

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీలో భారీ కుదుపు చోటుచేసుకుంది. పార్టీ కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సహా నలుగురు అగ్రనేతలు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. మంగళవారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో దేవ్‌జీతోపాటు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న లొంగిపోయారు. వరుస ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, సరెండర్ల తర్వాత 40 మంది ఉండే మావోయిస్టు పార్టీ

మిగతా 12వ పేజీలో...

బాధితుల రక్తంలో..

యూరియా, క్రియాటినిన్

అందుకే విషపూరిత ప్రభావం

- అనూరియా బాధితుల కేసుల్లో కల్తీ పాలే ప్రధాన కారణమని నిర్ధారణ
- వైద్య ఆరోగ్య శాఖ ప్రాథమిక నివేదిక
- ఆస్పత్రుల్లో 15 మందికి వైద్యం 12
- వారిలో ఏడుగురి పరిస్థితి విషమం
- చికిత్స పొందుతూ ఆరేళ్ల బాలుడి మృతి

ఆరుకు చేరిన కల్తీ పాల మృతులు

బాలికలకు ఉచితంగా

హెచ్‌పీవీ వ్యాక్సిన్

దేశవ్యాప్తంగా అందించనున్న కేంద్రం

- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు చర్యలు
- 14 ఏళ్ల వయసున్న బాలికలకు సింగిల్ డోస్ గార్డాసిల్

9



ఈ ఏడాది కోతకొచ్చిన కవరు తొడిగిన బంగినపల్లి తోటల వద్ద కాయలను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

కాయ నిగనిగ ధర ధగధగ!

- కవరు తొడిగిన మామిడికి మంచి రేటు.. బంగినపల్లి రకం టన్ను రూ.లక్షా 80 వేలు
- రూ.లక్ష దాటిన తోతాపురి మామిడి.. ఎన్టీఆర్ జిల్లాలో తొలి కోత పండ్లకు డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మధుర ఫలం.. బంగినపల్లి మామిడి ధర అ'ధర'హో అనిపించింది! పురుగు ఆశించకుండా రక్షణగా నిలిచే కవర్లు తొడిగి పండిస్తున్న మామిడి కాయలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో బంగినపల్లి రకం టన్ను రూ.లక్షా80వేల దాకా పలుకుతోంది. కవర్లు లేకుండా పండించిన కాయలు టన్ను రూ.90వేలు కూడా పలకడం లేదు. కవర్లు కట్టిన తోతాపురి రకం మామిడి కూడా టన్ను రూ.లక్షపైనే పలుకుతోంది. సీజన్‌కు ముందే ధర పెరగడంతో మామిడి రైతుల ఆనందానికి అవధుల్లేవు. సాధారణంగా తొలి దశ కోత తర్వాత ధర తగ్గడం సహజం. కానీ ఈ సారి ధర తగ్గే ప్రసక్తే లేదని అధికారులు ధీమాగా చెప్తున్నారు. దీనికి కారణం.. రెండేళ్లుగా ఉద్యానశాఖ రాయితీపై పండ్ల తోటల రైతులకు కవర్లు సరఫరా చేస్తోంది. ఈ కవర్లు కట్టిన పండ్లు కంటికి ఇంపుగా కనిపించడమే కాకుండా, నాణ్యత

మిగతా 12వ పేజీలో...

నేడు వెలిగొండకు సీఎం

- ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన
- అనంతరం మార్కాపురంలో బహిరంగ సభ
- కొత్త జిల్లా ఏర్పాటు తర్వాత.. చంద్రబాబు రావడం ఇదే తొలిసారి

10

ప్రజాప్రతినిధుల 'ఆటవిడుపు'

10



టగ్ ఆఫ్ వార్‌లో హోరాహోరీగా తలపడుతున్న నేతలు

- బిజీ లైఫ్‌కు దూరంగా.. ఆటలతో సరదాగా..
- కబడ్డీ కబడ్డీ అంటూ తలపడిన ఎమ్మెల్యేలు
- టగ్ ఆఫ్ వార్‌లో సత్తా చాటిన నాయకులు
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు మొదలైన క్రీడా పోటీలు

శశికళ కొత్త పార్టీ



అన్నాదురై, ఎంజీఆర్, జయ చూపిన మార్గంలో పయనిస్తాం: శశికళ

9

న్యాయవ్యవస్థలో అవినీతి

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం పుస్తకంలో కొత్త పాఠ్యాంశం

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎడతెగని యుద్ధం

నాలుగురోజుల్లో ఉక్రెయిన్‌ను జయించగలనని పుతిన్ అనుకున్నారు. నాలుగురోజుల్లో రష్యాను దారికి తేగలనని ట్రంప్ భ్రమపడ్డారు. నాలుగేళ్ళు పూర్తిచేసుకున్న యుద్ధం మరో నాలుగేళ్ళకయినా ముగుస్తుందా? అన్నది అనుమానం. ఇప్పటికిప్పుడు యుద్ధం ఆగితే కూడా ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి 588 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందట. రష్యాకు జరిగిన నష్టం అంతకంటే అధికం, లెక్కకు అందనిది. అప్పటివరకూ తనకున్న విస్తృత సహజవాయువు మార్కెట్‌ను ఈ యుద్ధం కారణంగా అది కోల్పోయింది. ఒక్క యూరప్‌ను తీసుకున్నా ఏటా నలభైబిలియన్ డాలర్లు నష్టపోతోంది. విదేశాల్లో 335 బిలియన్ డాలర్ల నిధులు ఇరుక్కుపోవడం రష్యాకు మరో దెబ్బ. అమెరికా అధ్యక్షుడు ఏవో హామీలు ఇస్తున్నారు కానీ, యుద్ధం ఆగినా కూడా అందులో అధికభాగం రష్యాకు దక్కవు. పశ్చిమ దేశాల ఆర్థిక, ఆయుధ అండదండలు దండిగా ఉన్న ఉక్రెయిన్ సరే, రష్యా మాత్రం ఇంకెంతకాలమని యుద్ధం చేయగలదు?

స్పెషల్ మిలటరీ ఆపరేషన్ అని ఓ చిన్న పేరు పెట్టి 2022లో యుద్ధ రంగంలోకి దిగినప్పుడు రష్యాతో పాటు పశ్చిమదేశాలు కూడా ఉక్రెయిన్ దురాక్రమణ కొద్దిరోజుల్లోనే ముగిసిపోతుందని అనుకున్నాయి. కానీ, రెండో ప్రపంచయుద్ధం అనంతరం యూరప్‌లో సాగిన అతిపెద్ద యుద్ధంగా ఈ సైనిక చర్య పరిణమించింది. నాజీ జర్మనీకి వ్యతిరేకంగా సోవియట్ సైన్యం సాగించిన పోరాటం కంటే ఇదే సుదీర్ఘంగా సాగుతోంది. తాను అధికారంలో లేకపోవడంతోపాటు అసమర్థ బైడెన్ అమెరికా అధ్యక్షుడుగా ఉండటం వల్లనే పుతిన్ తలెగరేశారని, తాను తిరిగి అధికారంలోకి వచ్చిన మర్నాడే యుద్ధాన్ని ఆపేస్తానని డోనాల్డ్ ట్రంప్ ఎన్నికల సభల్లో చెప్పుకున్నారు, పుతిన్‌ను లొంగదీయగల సమర్థత తనకు ఉన్నదని బలంగా నమ్మారు. అధ్యక్షుడైన తరువాత ఓవల్ ఆఫీసుకు ఉక్రెయిన్ అధినేతను పిలిచి, తన ఉపాధ్యక్షుడితో కలిసి అవమానించడానికి కూడా ట్రంప్ వెనుకాడలేదు. జెలెన్స్కీ కారణంగానే యుద్ధం వచ్చిందంటూ పుతిన్ పక్షాన, పుతిన్ భాషలో, పుతిన్ వాదనే ట్రంప్ చేశారు. రాజీకి రాకపోతే సహాయం నిలిపివేస్తానని హెచ్చరించి, నెలలపాటు అస్త్రాలు అందకుండా చేశారు. ఆ దెబ్బతో, ఉక్రెయిన్ తనవద్ద ఉన్న అరుదైన ఖనిజాలు తవ్వుకుపోవడానికీ, పునర్నిర్మాణంలో అధిక వాటా ఇవ్వడానికి అమెరికాతో బేరం కుదర్చుకుంది. ఆ తరువాత ట్రంప్ గాలి రష్యామీదకు మళ్ళింది. చమురు కంపెనీలపై నిషేధాలతో, ఎగుమతులపై ఆంక్షలతోనూ, దాని మిత్రదేశాల మీద అదనపు సుంకాలతోనూ ఒత్తిడిపెంచే ప్రయత్నాలు అనేకం జరిగాయి. నిజానికి, యూరప్ సైతం సుదీర్ఘకాలం రష్యా చమురు, సహజ వాయువుల దిగుమతులను నిలిపివేయలేకపోయింది. పాశ్చాత్యదేశాలు హెచ్చరించినప్పుడల్లా భారత్ తన ఏడాది దిగుమతులను వాటి ఒకరోజు దిగుమతితో పోల్చిచూపేది. లూకాయిల్, రోస్నెఫ్ట్ వంటి రష్యన్ చమురు కంపెనీలమీద అమెరికా అధ్యక్షుడు ఆంక్షలు విధించడం, దిగుమతులకు భారత్ దూరం కావడం వంటి పరిణామాలు రష్యాను కొంత దెబ్బతీసినమాట నిజం. అయితే, ఆంక్షలు రష్యాను బలహీనపరిచాయే తప్ప, సాగిలబడేట్టు చేయలేకపోయాయి. ఏడాదిపాటు తీవ్రంగా శ్రమించిన తరువాత, ఉక్రెయిన్, రష్యాలను ట్రంప్ చర్చలకు కూచోబెట్టగలిగారు కానీ, భూభాగాలు, నష్టపరిహారాలు, భద్రత హామీలు ఇత్యాది విషయాల్లో తగవు తీరకపోవడంతో వ్యవహారం ముందుకు సాగడం లేదు.

యుద్ధంలోకి అడుగుపెట్టిన కొత్తల్లో రష్యా మంచి జోరుగా ఉక్రెయిన్ భూభాగాల్లోకి చొరబడగలిగిందని, ఆ తరువాత ఎక్కువ వదులుకొని, కొంత నిలబెట్టుకోగలిగిందని అంటారు. యుద్ధంలో అసత్యాలు అర్థసత్యాలే తప్ప నిజం వెలుగుచూడదు. విజయాలు, మరణాల లెక్కలనూ అనుమానించాల్సిందే. రెండుదేశాలు అపార ఆస్తి, ప్రాణనష్టాలు చవిచూశాయి. గత ఏడాది డిసెంబరు నాటికి మూడులక్షల పాతికవేలమంది రష్యన్ సైనికులు, లక్షా నలభైవేలమంది ఉక్రెయిన్ సైనికులు కన్నుమూశారని ఒక అమెరికన్ సంస్థ అంచనా. తన అధీనంలో ఉన్న ఉక్రెయిన్ భూభాగాలను వదులుకోకపోవడంతో పాటు, వ్యూహాత్మకంగా అవసరమైన ప్రాంతాల నిస్సైనికీకరణను కూడా రష్యా కోరుతున్నదువల్లనే చర్చలు ముందుకు సాగడం లేదని అంటారు. ఉక్రెయిన్‌కు ఇకపై మారణాయుధాలు అందవన్న హామీతో పాటు, ఈ యుద్ధానికి మూలకారణమైన నాటో విస్తరణ విషయంలోనూ నిర్దిష్టమైన హామీ పాశ్చాత్యదేశాల నుంచి దక్కేవరకూ రష్యా వెనక్కుతగ్గదు. 2030లో కూడా మీడియా ఇదే యుద్ధాన్ని, అవే సమస్యలను, ఇవే అంశాలను చర్చించుకోవాల్సి ఉందని ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్య అతిశయోక్తి కాకపోవచ్చు.

> కృత్రిమ మేధపై ఇప్పటివరకు బ్రిటన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్‌లు మాత్రమే అంతర్జాతీయ సదస్సులు నిర్వహించాయి. ఆ మూడు దేశాల్లో సదస్సుల కంటే భారత్ నిర్వహించిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026' బాగా విజయవంతమయింది. రానున్న కాలంలో కృత్రిమ మేధస్సు రంగానికి దిశానిర్దేశం చేసే స్థాయిలో న్యూఢిల్లీ సదస్సు జరిగిందనడంలో అతిశయోక్తి లేదు.

'మేధా' శిఖరాలపై భారత్

గల్ఫ్ లేఖ

ఐటీ రంగంలో భారతీయ ప్రతిభ సాధిస్తోన్న పురోగతి అద్భుతమైనది. భారత్‌కు ఉన్న 'విశ్వగురు' అన్న ప్రఖ్యాతిని అది సార్థకం చేస్తోంది. ఆ సాంకేతికత అధునాతన వికాసంలో యువ భారతీయుల విజయాల ఆలంబనతో దేశ ప్రతిష్ఠను మరింతగా ఇనుమడింపచేసేందుకు భారతీయ దౌత్యవేత్తలు అపూర్వ కృషి చేస్తున్నారు. నవ నవీన సాంకేతికత కృత్రిమ మేధ (ఏఐ) బహుముఖీన ప్రభావంపై ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన అయిదు రోజుల అంతర్జాతీయ సదస్సు ఆ కృషిలో భాగమే. అమెరికా, యూరోపియన్ దేశాలను ఎంతగా ఆకర్షించిందో, అరబ్ దేశాలను, లాటిన్ అమెరికాను, ఆఫ్రికా దేశాలనూ అంతగా ఆకర్షించిన విశిష్ట సదస్సు అది. కొన్ని కారణాలతో మనతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కెనడాతో పాటు, ఐటీ, ఏఐలలో చాలా ముందంజలో ఉన్న దేశాలు కూడా భారత్ ఆహ్వానాన్ని మన్నించి న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్నాయి. అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో భారత సామర్థ్యంపై ప్రపంచ దేశాలకు పరిపూర్ణ విశ్వాసం ఉన్నదనడానికి 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026' ఒక తిరుగులేని తార్కాణం. ఇటువంటి సదస్సులలో గల్ఫ్ దేశాల రాచకుటుంబీకులు పాల్గొనడం చాలా అరుదు. గల్ఫ్‌లో అత్యధిక డేటా సెంటర్లు నిర్వహిస్తూ, వాటి సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించడానికి ప్రయత్నిస్తోన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పక్షాన అబుదాబి యువరాజు షేక్ ఖాలీద్ ఈ న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్నారు. సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ యూఏఈ యువరాజుకు స్వాగతం పలుకగా, ప్రధాని మోదీ ఆయన గౌరవార్థం విందు ఇచ్చారు. సౌదీ అరేబియా ఉన్నతాధికార వర్గాలు కూడా ఈ సదస్సులో పాల్గొన్నాయి. ఈ ఏఐ సదస్సును విజయవంతం చేసేందుకు భారత విదేశాంగ శాఖ అధికారులు రేయింబవళ్ళు కష్టపడ్డారు. కొన్ని విషయాలకు సంబంధించి, ఆహ్వానితులు అడిగిన సమాచారం ఇవ్వడానికి నిజాయితీగా శ్రమించారు. ఆ సందర్భంలో తెలుగు రాష్ట్రాల అధికార వర్గాలను కూడా భారత దౌత్యవేత్తలు సంప్రదించిన విషయం కొందరికి మాత్రమే తెలుసు. అగ్ర రాజ్యాలు, యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకులతో పాటు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ మొదలైన టెక్ దిగ్గజాలు పాల్గొన్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌తో భారత్ యశోచంద్రికలు మరింతగా విరాజిల్లాయి.

బ్రిటన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్‌లు మాత్రమే ఇప్పటివరకు అంతర్జాతీయ ఏఐ సదస్సులు నిర్వహించాయి. ఆ మూడు దేశాల్లో సదస్సుల కంటే న్యూఢిల్లీ సదస్సే బాగా విజయవంతమయింది. రానున్న కాలంలో కృత్రిమ మేధస్సు రంగానికి దిశానిర్దేశం చేసే స్థాయిలో ఈ సదస్సు జరిగిందనడంలో అతిశయోక్తి లేదు. పారిస్ సదస్సులో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అమెరికా, బ్రిటన్‌లు పారిస్ డిక్లరేషన్‌లో భాగస్వాములు అయ్యేందుకు నిరాకరించాయి. అయితే న్యూఢిల్లీ డిక్లరేషన్‌పై ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఆ రెండు దేశాలు సైతం సంతకం చేశాయి. సదస్సులో భాగంగా జరిగిన 500 గోష్ఠులలో అమెరికా, ఫ్రాన్స్, చైనా, బ్రిటన్ సహా 88 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కీలక భూమిక వహించనున్న కృత్రిమ మేధస్సు రంగం కేవలం కొందరి చేతులలో కేంద్రీకృతం కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని, తప్పుడు సమాచార వ్యాప్తి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని న్యూఢిల్లీ డిక్లరేషన్ కోరింది. ఈ నవీన సాంకేతికతను ప్రపంచ దేశాల ఆర్థికాభివృద్ధికి ఒక చోదక శక్తిగా మార్చాలని భారత్ పిలుపునిచ్చింది. తద్వారా భారత్ తన నాయకత్వపు దార్శనికతను స్ఫూర్తిదాయకంగా వెల్లడించింది. బహు భాషలు విలసిల్లుతోన్న భారత్‌లో ప్రతి భారతీయుడూ ఏఐని తన మాతృభాషలో వినియోగించుకునేందుకు వీలుగా 'సర్వం' పేర ఆవిష్కృతమైన భారతీయ భాషల విధానం (ఎల్.ఎల్.ఎం, ఎస్.ఎల్.ఎం) ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలిచింది.



'కృత్రిమ మేధస్సు రూపకల్పన, అభివృద్ధి భారత్‌లో జరిగినా వాటి ఫలాలు, ప్రయోజనాలు సమస్త దేశాలకు చెందుతాయని' ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఆయన గంభీరవాణి ఇంట కంటే బయటే ఎక్కువగా ప్రతిధ్వనించింది. కనుకనే దేశంలోకి భారీ పెట్టుబడులు వెల్లువెత్తాయి అనేది ఇక్కడ గమనార్హం. కృత్రిమ మేధస్సు పనితీరు, దాని విధి విధానాలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా బాలారిష్టాల దశలో ఉన్నాయి. ఇందుకు భారత్ మినహాయింపు కాదు. కృత్రిమ మేధస్సు, డేటా సెంటర్లకు అవసరమైన నీటి లభ్యత, స్థల సేకరణ, ఇతర మౌలిక ఆవశ్యకతలపై ఆశాజనక చర్చ జరగలేదు. అదే విధంగా ఏఐతో కొత్త ఉద్యోగాల సృష్టి, ఉన్న ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే అవకాశాలను కూడా సదస్సు విస్మరించింది.

కృత్రిమ మేధస్సును ప్రోత్సహించడంలో భాగంగా పలు ప్రైవేటు సంస్థలు కూడా న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్నాయి. వాటిలో ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయం కూడా ఉన్నది. చైనాలో రూపొందిన ఒక మర కుక్కను తమ స్వంత ఆవిష్కరణగా ఆ ప్రైవేట్ విశ్వవిద్యాలయం ప్రకటించుకుని అభాసుపాలైంది. సదరు ప్రైవేటు విశ్వవిద్యాలయ మహిళా ప్రతినిధి తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు చేసిన వాదనలతో అసలు వంచన రచ్చకెక్కింది. ఇది ముమ్మాటికీ దగా అనడంలో సందేహమేమీ లేదు. విషయం తెలిసిన వెంటనే అధికారులు ఆ మర కుక్కను ప్రాంగణం నుంచి తొలగించి తమ బాధ్యతను నిర్వర్తించారు, అయితే అప్పటికే దానిపై ఎంతో రభస జరిగిపోయింది. ప్రాంగణం వద్ద కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన భారత్ పేరు ప్రతిష్ఠలకు మచ్చగా మిగిలిపోయింది. ఏదేమైనా, అంతర్జాతీయంగా భారత్ కీర్తిని ఇనుమడింపజేసిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026'ను దేశీయంగా రచ్చకీడ్చడం జాతి ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందుతున్న విదేశాంగ విధానానికి విఘాతం కలిగించడమే.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

భారత్‌కు భాగవత్ దిశా నిర్దేశమేమిటి?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'మనం ప్రతి ఒక్కరినీ ఎలాంటి ప్రతిఘటన లేకుండా అంగీకరించాలి' (సర్వేషాం అవిరోధేనా) అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ ఒక సందర్భంలో చెప్పారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100వ సంవత్సరంలో ప్రవేశించిన సందర్భంగా ఆయన దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ పలు సభల్లో ప్రసంగిస్తున్నారు. అనేక వర్గాల వారితో సమావేశమై సంభాషణలు జరుపుతున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే ఒకప్పుడు ఆర్ఎస్ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించినవారు, ఆ సంస్థపై ఏ అభిప్రాయం లేని తటస్థులతో పాటు రకరకాల వర్గాల్లో దూరి తమ ఉనికిని చాటుకునే మహానుభావులు సైతం మోహన్ భాగవత్ సమావేశాల్లో పాల్గొంటున్నారు. విద్యావేత్తలు, డాక్టర్లు, న్యాయవాదులు, వణిక్ ప్రముఖులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, నటులు, మీడియా ప్రతినిధులు, న్యాయవాదులు, మాజీ న్యాయమూర్తులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారు ముంబైలో అక్షయ్‌కుమార్, రణబీర్‌కపూర్, సల్మాన్ ఖాన్ తదితర తారాగణం భాగవత్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. మంచి సందేశాలు వ్యాప్తి చేసే సినిమాల్లో నటించినందుకు సల్మాన్ ఖాన్‌ను భాగవత్ ప్రశంసించారు. హైదరాబాద్‌లో వామపక్షీయులు కూడా భాగవత్ ప్రసంగానికి హాజరుకావడం గమనార్హం. ఇంత విస్తృత స్థాయిలో వివిధ వర్గాల వారిని ఒక సంస్థ ఆకర్షించడం సాధారణ విషయం కాదు.

దేశం ఇప్పుడు ఒక సైద్ధాంతిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సిద్ధాంతాల ప్రాతిపదికన జరిగిన అనేక ఉద్యమాలు పరీక్షలకు, సమీక్షలకు, వైఫల్యాలకు లోనై కొట్టుకుపోయాయి. సైద్ధాంతిక దారిద్ర్యం అంతటా తాండవిస్తోంది. సమాజం పట్ల, అణగారిన వర్గాల పట్ల సానుకూల దృక్పథంతో ఆలోచించేవారు ఒక మూసలో ఇమడలేకపోతున్నారు. ఇప్పుడే కాదు, గతంలో కూడా తత్వవేత్తలు ఇలాంటి సామాజిక పరిస్థితులను ఎదుర్కొని విశ్లేషించిన సందర్భాలున్నాయి. మరి మోహన్ భాగవత్ ప్రస్తుత అయోమయ పరిస్థితులలో ఏమి మాట్లాడతారా అన్న ఆసక్తితోనే అనేక మంది ఆయన సభలకు హాజరు అవుతున్నారని అర్థం చేసుకోవల్సి వున్నది. రకరకాల భావజాలాల అనుయాయులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఆర్ఎస్ఎస్ విస్తరిస్తుండడం, దాని అనుబంధ రాజకీయ సంస్థ అయిన భారతీయ జనతా పార్టీ తిరుగులేని జాతీయ రాజకీయ శక్తిగా ప్రభావ ప్రాబల్యాలను సంతరించుకోవడం ఒక రకంగా సంఘ్ పరివార్ శక్తులకు సదవకాశం.

అయితే 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఆర్ఎస్ఎస్ కూడా ఒక నిర్దుష్టమైన స్పష్టతతో ఉన్నదా? ఈ విషయాన్ని తరచి చూడవలసిన అవసరం ఉన్నది. హెగ్డేవార్ స్థాపించిన ఆర్ఎస్ఎస్ కూడా ఇప్పటి ఆర్ఎస్ఎస్‌కూ ఎంతో తేడా ఉన్నది. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికి, గత పది సంవత్సరాలకు పైగా నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా కొనసాగడానికి కారణమైన ఆర్ఎస్ఎస్ ఇవాళ ఒక సంధి దశలో ఉన్నది. కేంద్రంలో మోదీ ఇవాళ ఏమి చేసినా జనం ఆర్ఎస్ఎస్ వైపు చూస్తున్నారు. మోదీ చేసిన మంచి పనులకు ఆర్ఎస్ఎస్‌కు ఎంత ఘనత లభిస్తుందో, ఆయన తీసుకున్న అన్ని నిర్ణయాలకూ ఆర్ఎస్ఎస్ జవాబుదారీ అవుతుందని చాలా మంది భ్రమిస్తున్నారు. అయోధ్యలో బాల శ్రీరాముడి ప్రతిష్ఠాపన సమయంలో నరేంద్రమోదీ వెనుక మోహన్ భాగవత్ ఉన్న దృశ్యాలను చూసినవారు మోదీకి అన్ని విషయాల్లోనూ మోహన్ భాగవత్ అండగా ఉంటారనుకోవడంలో ఆశ్చర్యం లేదు. విచిత్రమేమంటే జాతీయవాదులు అని తమను తాము చెప్పుకుంటున్నవారు కూడా మోదీ చేసిన అన్ని పనులను పిడివాదంతో సమర్థించడం, ప్రత్యర్థులపై తీవ్ర పరిభాషలో విరుచుకుపడడం ప్రస్తుత సైద్ధాంతిక అయోమయాన్ని మరింతగా తీవ్రతరం చేస్తోంది.

ఆర్ఎస్ఎస్‌కూ బీజేపీకి మధ్య ఉన్న తేడాను స్పష్టంగా చెప్పేందుకు మోహన్ భాగవత్ అనేక సమావేశాల్లో ప్రయత్నించారు. ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి రాజకీయ అధికార ఆకాంక్ష లేదని, మొత్తం హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం, పౌరుల వ్యక్తిత్వాన్ని నిర్మించడం తమ ఏకైక లక్ష్యమని ఆయన ఇటీవల డెహ్రాడూన్‌లో మాజీ సైనికాధికారుల సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. ఆర్ఎస్ఎస్‌ను బీజేపీతో పోల్చి చూడకూడదని, బీజేపీ కళ్లతో ఆర్ఎస్ఎస్‌ను చూడడం అతి పెద్ద తప్పిదమని ఆయన గత ఏడాది కోల్‌కతాలో చెప్పారు.

కాని చాలా మంది తటస్థ వాదులకు ఆర్ఎస్ఎస్ అంటే బీజేపీయే. దాదాపు 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో లేకపోతే, ఆర్ఎస్ఎస్‌కు ఇవాళ ఇంత ప్రాధాన్యం లభించేది కాదని వారు వాదిస్తున్నారు. అధికారం అనేది ఒక అయస్కాంతం లాంటిది. ఆ అయస్కాంతానికి ఆకర్షితులైన వారందరూ నేడు ఆర్ఎస్ఎస్‌కు కూడా ఆకర్షితులవుతున్నారు. మోహన్ భాగవత్ సమావేశాలకు వచ్చిన వారందరూ ఆర్ఎస్ఎస్ భావజాలం నచ్చి వచ్చి ఉంటారని అనుకోవడానికి వీల్లేదు. భాగవత్, ఆర్ఎస్ఎస్ పెద్దల దృష్టిలో పడడం వల్ల, ఆ సమావేశాలకు హాజరయ్యామని చెప్పుకోవచ్చు; ఆ పెద్దలతో ఫోటోలు దిగి ప్రచారం చేసుకోవచ్చు; తద్వారా తమకేదో మేలు జరుగుతుందనే అభిప్రాయం అటువంటివారిలో నెలకొని ఉన్నదని స్పష్టమవుతోంది. 'బీజేపీ అధికారంలో లేకపోతే ఆర్ఎస్ఎస్‌ను ఎవరు పట్టించుకుంటారు?' అని ఆ సమావేశానికి వెళ్లి వచ్చిన ఒక మేధావి వ్యాఖ్యానించారు. బహుశా తమలో బలంగా లేని ఒక భావజాలం తమకు నచ్చిందని పైకి ప్రకటించడం వల్ల కొందరు ప్రయోజనాలు, పదవులు, పురస్కారాలు పొంది ఉండవచ్చు. ఈ స్వార్థపరత్వం మరి కొందర్ని ఆకర్షిస్తోంది. బీజేపీలో మంత్రులుగా ఉన్న వారందరికీ సంఘ్ భావజాలం గురించి అంత బలమైన అవగాహన ఉన్నదని చెప్పేందుకు ఆస్కారం లేదు. ఈ బూటకత్వాన్ని సంఘ్ పరివార్‌లో కొందరు గమనించే ఉంటారు. 'ముందు వచ్చిన చెవులకంటే వెనుక వచ్చిన కొమ్ములే వాడి' అని వాపోయేవారు లేకపోలేదు.

సమాజంలో ఇలాంటి పరిణామాలు సహజమైననప్పటికీ ఇవాళ ఆర్ఎస్ఎస్ అనేది బీజేపీకంటే ఎంతో భిన్నమైన, బలమైన, విస్తృతమైన సంస్థ. బీజేపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ఆర్ఎస్ఎస్ ప్రాధాన్యం తగ్గే అవకాశాలు ఏ మాత్రం లేవు. నిజానికి ఆర్ఎస్ఎస్ ఒక రాజకీయ పార్టీకి కట్టుబడి ఉన్న సంస్థ కానే కాదు. ఒకప్పటి ఆర్ఎస్ఎస్‌కూ ఇప్పటి ఆర్ఎస్ఎస్‌కూ మధ్య చాలా వ్యత్యాసమున్నది. 1925లో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించిన డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవార్ 1937 వరకూ కాంగ్రెస్‌లో ఉన్నారని ఎంత మందికి తెలుసు? ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించేందుకు ఒక సామాజిక భూమిక లేకపోలేదు. కాంగ్రెస్‌లో మితవాద, అతివాద ఘర్షణల పర్యవసానంగా గాంధీజీ స్వాతంత్ర్యోద్యమ నాయకత్వం చేపట్టడం, రష్యాలో విప్లవానంతరం దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడడం, అంబేద్కర్ నాయకత్వంలో మహారాష్ట్రలోని మహడ్‌లో అస్పృశ్యులు చెరువు నుంచి నీరు తాగేందుకు ఉద్యమించడం తదితర పరిణామాల సమయంలోనే ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించింది. తిలక్ వారసత్వాన్ని గౌరవించిన హెగ్డేవార్ ఆర్ఎస్ఎస్‌ను కులాలకు అతీతంగా, సమస్త కులాలను కలుపుకుపోయే సంస్థగా రూపొందించాలనుకోవడానికి కూడా సామాజిక నేపథ్యం ఎంతో ఉన్నది. భారత జాతీయ కాంగ్రెస్‌లో నెహ్రూ ఆవిర్భవించి ఆధునిక యూరోపియన్ సమాజాల సెక్యూలరిజం స్ఫూర్తితో కాంగ్రెస్ భావజాలాన్ని ప్రభావితం చేయడం ప్రారంభమై తరువాతే ఆర్ఎస్ఎస్‌కూ కాంగ్రెస్‌కూ మధ్య దూరం మరింత పెరిగిందనేవారున్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంతో స్వాతంత్ర్య సమరంలో ప్రజలను గాంధీ, నెహ్రూ సంఘటితపరుస్తూ దేశాన్ని ఏకతాటిపైకి తెస్తున్న సమయంలో ఆర్ఎస్ఎస్‌తో పాటు కమ్యూనిస్టు నేతలూ ప్రేక్షకులయ్యారు.

1940లో హెగ్డేవార్ మరణం తర్వాత గురూజీ అని సంఘ్ గౌరవంగా పిలుచుకునే గోల్వాల్కర్ సంఘ్ బాధ్యతలు చేపట్టడంతో ఆ సంస్థ స్వరూప స్వభావాలు మారిపోయాయి. దేశ విభజన ఆయన హయాంలోనే జరగడం, విభజన రేకెత్తించిన మత విద్వేషాల వల్ల సంఘ్ సైద్ధాంతిక స్వరూపం తీవ్రంగా మారిపోయింది. 1948లో ఆర్ఎస్ఎస్‌ను నిషేధించిన తర్వాత ఆయనను అరెస్టు చేశారు. గోల్వాల్కర్ మరణం తర్వాత 1973లో మూడవ సర్ సంఘ్ చాలక్ అయిన దేవరస్ గోల్వాల్కర్ కంటే భిన్నంగా ఆలోచించి రాజకీయాల్లో, సామాజిక కార్యచరణలో క్రియాశీలక పాత్ర పోషించేందుకు ఆర్ఎస్ఎస్‌కు వీలు కల్పించారు. దాన్నొక ప్రజా సంస్థగా మార్చేందుకు ప్రయత్నించారు. జనసంఘ్, సోషలిస్టులు, స్వతంత్ర పార్టీ సభ్యులతో కలిసి జేపీ ఉద్యమంలో పాల్గొన్నారు. ఇందిరాగాంధీతో ఆయనకు సత్సంబంధాలుండేవి. పీవీ నరసింహారావుతో కూడా ఆయనకు మంచి సంబంధాలు ఉండేవి. దేవరస్ రాజకీయ మార్గదర్శకత్వం లేకపోతే జనసంఘ్ జనతా పార్టీలో విలీనమయ్యేదే కాదు. ఆ తర్వాత భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించేదే కాదు.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం సర్ సంఘ్ చాలక్‌గా ఉన్న మోహన్ భాగవత్ దేశానికి ఏ దిశానిర్దేశం చేస్తారా అని పలువురు చూడడంలో ఆశ్చర్యం లేదు. ఈ దేశానికి మైనారిటీలను అవాంఛనీయ శక్తులుగా భావిస్తూ గోల్వాల్కర్ రచించిన 'బంచ్ ఆఫ్ థాట్స్'లో కొన్ని వ్యాఖ్యలకు కాలం చెల్లిందని ఆయన 2016లోనే బహిరంగంగానే ప్రకటించారు. ప్రపంచీకరణ అంటే మార్కెటీకరణ, అది ప్రమాదకరం అని ఆయన తాజాగా అన్నారు. ఆయన వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయే కాని 'వన్ లీడర్– వన్ పార్టీ'గా మారిన బీజేపీని అర్థం చేసుకోవడానికి తోడ్పడకపోవచ్చు. ప్రస్తుత మోదీ పాలనలో జరుగుతున్న పరిణామాలు 'సర్వేషాం అవిరోధేనా' అన్న సూత్రానికి అనుకూలమా? భారత అమెరికా వర్తక ఒప్పందాన్ని ఏ కోణంలోంచి చూడాలి? జీడీపీలో ఒక శాతం కంటే తక్కువగా పరిశోధనకు కేటాయిస్తూ చైనా కంటే ఎంతో వెనుకపడి ఉండాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?



> భారతీయ జనతా పార్టీ కంటే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఎంతో భిన్నమైన, బలమైన, విస్తృతమైన సంస్థ. బీజేపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ఆర్ఎస్ఎస్ ప్రాధాన్యం తగ్గే అవకాశాలు ఏ మాత్రం లేవు. నిజానికి ఆర్ఎస్ఎస్ ఒక రాజకీయ పార్టీకి కట్టుబడి ఉన్న సంస్థ కానే కాదు. హెగ్డేవార్ నాటి ఆర్ఎస్ఎస్‌కు మోదీ భారత్‌లోని సంఘ్‌కు మధ్య చాలా వ్యత్యాసమున్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

..ఇక్కడి నుంచి వెనక్కు వెళ్లే ప్రసక్తే లేదు!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిగతా దేశాలతో సాగిస్తున్న సుంకాల (టారిఫ్) యుద్ధానికి అమెరికా సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. ఫెడరల్ ప్రభుత్వపు శాసన నిర్మాణ విభాగమైన అమెరికన్ కాంగ్రెస్‌కు మాత్రమే ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ (IEEPA) ప్రకారం సుంకాలు విధించే అధికారం ఉంటుందని, ప్రెసిడెంట్‌కు అలాంటి విశిష్ట అధికారాలు లేవని స్పష్టం చేసింది. అంతేకాదు, ట్రంప్ విధించిన విస్తృత టారిఫ్‌లను రద్దు చేసింది. దురుసు ప్రవర్తనతో దూసుకుపోతున్న డొనాల్డ్ ట్రంప్‌కు ఇది పెద్ద ఎదురుదెబ్బ.

'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనేది అక్కడ ఓ యాభై ఏళ్ళుగా వినిపిస్తున్న నినాదం. 1980లలో రోనాల్డ్ రీగన్, 1992లో బిల్ క్లింటన్ ఈ నినాదాన్ని ముందుకు తెచ్చారు. 2015 ఎన్నికల ప్రచారంలో ఈ నినాదాన్ని ఎర్రటోపీ మీద ముద్రించి నెత్తిన పెట్టుకున్నారు ట్రంప్. ఆయన రెండోసారి గెలిచాక ఈ నినాదం వాగ్దానంగా మారింది. వాగ్దానం విధానంగా మారింది. సుంకాలను నిలిపివేసిన సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనంలో ట్రంప్ నియమించిన న్యాయమూర్తులు కూడా ఉన్నారు. అది ట్రంప్‌కు మరింత దిగ్భ్రాంతిని కలిగించే విషయం. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో దేశాధినేతలు తమ ప్రయోజనాలను దేశ ప్రయోజనాలుగా చిత్రిస్తుంటారు. ట్రంప్ కూడా ఆ పనే చేశారు. 'దేశ ప్రయోజనాల కోసం న్యాయస్థానాలు తెగువ చూపలేదు' అని విమర్శించారు.

అమెరికా రాజకీయ చరిత్రలో అధ్యక్షులు– న్యాయస్థానాల మధ్య ఘర్షణలు కొత్తవి కావు. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 'కోర్ట్ ప్యాకింగ్ ప్లాన్'ను తెచ్చి న్యాయస్థానాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. రిచర్డ్ నిక్సన్ కూడా వాటర్ గేట్ కేసులో న్యాయస్థానాల మీద ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, అవేవీ పనిచేయలేదు. చివరకు వారు న్యాయస్థానాల తీర్పులను శిరసావహించాల్సి వచ్చింది. ట్రంప్ దుందుడుకు స్వభావం రీత్యా ఆయన సుప్రీంకోర్టు మీద తిరుగుబాటు చేస్తారా? అనే చర్చ కూడా ఒకటి నడుస్తోంది. కోర్టును బహిరంగంగా విమర్శించడం రాజకీయంగా సాధ్యమే. ఆ పని ట్రంప్ చేస్తూనే ఉన్నారు. అయితే, తీర్పును అమలు చేయకుండా తిరుగుబాటు చేయడం రాజ్యాంగ పరిధిలో సాధ్యం కాదు. అందుకే, ఇప్పటివరకూ అత్యంత అరుదుగా వాడిన 122వ సెక్షన్ ఉపయోగించుకుని, మొదటగా ప్రకటించిన పది శాతాన్ని పదిహేను శాతానికి పెంచి మళ్ళీ తన పంతం నెగ్గించుకునే ప్రయత్నంలో పడ్డారు ట్రంప్. తాను ఇతరత్రా మార్గాలను అన్వేషించి, ఆచరణలోకి తెచ్చేవరకూ ఈ విధానం ఉనికిలో ఉంటుందన్నారు ట్రంప్. తీర్పును అడ్డుపెట్టుకొని తనతో గేమ్స్ ఆడవద్దని ఇతర దేశాలను కూడా హెచ్చరించారాయన. సుంకాల మాదిరిగానే, గ్రీన్‌ల్యాండ్ వివాదం కూడా ముగిసినట్టుగా భావించడానికి అవకాశం లేదు. భూగోళంపై గ్రీన్‌ల్యాండ్‌కు ఉన్న వ్యూహాత్మక ప్రాధాన్యం తగ్గిపోదు, అమెరికాకు గ్రీన్‌ల్యాండ్ అవసరం కూడా తగ్గేది కాదు.

డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పంచుకున్న ఏఐ మ్యాప్‌లో గ్రీన్‌ల్యాండ్, కెనడా, వెనెజువెలా తదితర దేశాలను అమెరికా భూభాగంగా చూపించారు. చట్టపరంగా దీనికి ఎటువంటి విలువా లేదు కానీ, రాజకీయాల్లో మ్యాప్‌లు అమాయక బొమ్మలు కావు. అవి ప్రపంచ శక్తుల భవిష్యత్తు ఆకాంక్షలను, నడకల దిశను, దురాక్రమణ ఆలోచనలను సూచించే సంకేతాలు. గతంలోకి పరికించి చూస్తే, ప్రపంచ శక్తులు ముందుగా మ్యాపులతోనే ఆడుకున్నాయి.

> అమెరికా రాజకీయ చరిత్రలో అధ్యక్షులు– న్యాయస్థానాల మధ్య ఘర్షణలు కొత్తవి కావు. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 'కోర్ట్ ప్యాకింగ్ ప్లాన్'ను తెచ్చి న్యాయస్థానాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. రిచర్డ్ నిక్సన్ కూడా వాటర్ గేట్ కేసులో న్యాయస్థానాల మీద ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, అవేవీ పనిచేయలేదు. ట్రంప్ దుందుడుకు స్వభావం రీత్యా ఆయన సుప్రీంకోర్టు మీద తిరుగుబాటు చేస్తారా? అనే చర్చ కూడా నడుస్తోంది.



తరువాత మాటలుగా మార్చాయి. ఆ తరువాత విధానాలను మార్చాయి. ఆపైన యుద్ధాలు సాగించాయి. చివరకు దేశాల సరిహద్దులనే మార్చేశాయి. ప్రపంచ పటంలో అగ్రరాజ్యంగా వెలుగొందాలనుకున్న ఏ దేశమైనా తన ప్రయాణాన్ని ఎప్పుడూ యుద్ధంతో మొదలుపెట్టదు; అది ముందుగా భాషలోకి, బొమ్మల్లోకి, ప్రజల ఊహల్లోకి ప్రవేశిస్తుంది. ఆ మ్యాప్ కింద రాసిన 'ఇక్కడి నుంచి వెనక్కు వెళ్లే ప్రసక్తే లేదు' అనే ట్రంప్ వ్యాఖ్య కూడా కేవలం ఒకానొక రాజకీయ వాక్యం కాదు. చరిత్ర చెబుతున్న సత్యం ఏమిటంటే– ఇలాంటి భాష వినిపించిన ప్రతిసారీ, దాని వెంబడి ఘోర పరిణామాలే జరిగాయి. బ్రిటిష్ చరిత్రకారుడు ఏజేపీ టేలర్ అన్నట్లు, 'యుద్ధాలు అకస్మాత్తుగా జరుగుతాయనుకోవడం మన అజ్ఞానం; నిజానికి అవి చాలాకాలంపాటు మాటలతోనే సిద్ధమవుతాయి'. నేటి ప్రపంచంలో ఆ మాటల స్థానాన్ని బొమ్మలు, మీమ్స్, ఏఐ మ్యాప్‌లు ఆక్రమించాయి. రూపం మారిందిగానీ సారం సేమ్ టు సేమ్!

1930ల నాటి యూరప్‌లో ఇటలీ ఫాసిస్టు నేత బెనిటో ముస్సోలినీ మాటలు కూడా ఇలానే ఉండేవి. ఆఫ్రికా ఆక్రమణను సమర్థించుకోవడానికి ఆయన 'ఇటలీ ప్రజలు ఊపిరి పీల్చుకోవడానికి సువిశాల స్థలం కావాలి' అంటుండేవారు. నాజీ హిట్లర్ కూడా విదేశీ భూభాగాల గురించి ఇలాంటి మాటల్నే తన ఆత్మకథలో రాసుకున్నాడు. జర్మనీలో ఆహార కొరత సమస్య ముందుకు వచ్చినప్పుడల్లా తాను తూర్పు దిక్కుకు చూసేవాడిననీ, అక్కడ తనకు సువిశాల రష్యా భూముల్లో పంటలు పండిస్తున్న యూదు రైతులు కనిపిస్తారని పేర్కొన్నాడు. ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకుంటే జర్మనీ ఆహార సమస్య తీరుతుందనేది అతని ఆలోచన! అయినప్పటికీ స్టాలిన్ రష్యాతో ఒక నిర్యుద్ధ సంధి చేసుకున్నాడు. వీలు చిక్కగానే ఆ సంధిని బాల్టిక్ సముద్రంలో కలిపేసి, రష్యా భూభాగంలోకి 15 వందల కిలోమీటర్లకు పైగా చొచ్చుకుపోయాడు. జపాన్ చక్రవర్తి హిరోహిటో, స్పెయిన్ నియంత ఫ్రాన్సిస్కో ఫ్రాంకో కూడా ఇతర దేశాల భూముల్ని ఆక్రమించుకోవడాన్ని బాహాటంగా సమర్థించుకుంటూ ఇలాంటి సిద్ధాంతాలనే ముందుకు తెచ్చేవారు.

జాతీయ గర్వం, దేశభద్రత, వ్యూహాత్మక అవసరాల సాకులతో సాగిన ఆ వాదనలు చివరకు భూమండలాన్ని రక్తపాతంలో ముంచాయి. ఇది వ్యక్తుల్ని విమర్శించడానికో, డొనాల్డ్ ట్రంప్‌ను ముస్సోలినీతోనో, హిట్లర్‌తోనో పోల్చడానికి కాదు. చరిత్రలో పదే పదే కనిపించే ధోరణుల్ని కొంచెం ముందుగా, లోతుగా అర్థం చేసుకోవడానికి మాత్రమే గతాన్ని తడమాల్సి వస్తున్నది.

కీడుకు ఒక సామాన్య లక్షణం ఉంటుందని అమెరికన్ చరిత్రకారిణి హన్నా ఆరెండ్ అంటారు. దానిని ఆమె 'Banality of Evil'గా నిర్వచించారు. బాధ్యతగల స్థానాల్లో ఉన్నవారు తాము తీసుకునే నిర్ణయాల పర్యవసానాలను బేరీజు వేసుకునే ఇంగిత జ్ఞానాన్ని కోల్పోయిన ప్రతిసారీ, ప్రపంచస్థాయిలో తీవ్రమైన కీడు చోటు చేసుకుందని ఆమె హెచ్చరించారు. సార్వభౌమత్వం అంటే శక్తిమంతుడి ఇష్టాయిష్టాలు కాదు; అది ప్రజల హక్కు. ఈ ఆదర్శాన్ని చిన్నచూపు చూస్తే చిన్న దేశాల భవిష్యత్తే కాక మొత్తం ప్రపంచ శాంతే కనుమరుగైపోతుంది. చరిత్ర మౌనంగా ఉండదు. అది వర్తమాన ప్రపంచాన్ని నిద్ర లేపుతుంటుంది. నిర్వర్తించాల్సిన బాధ్యతల్ని గుర్తుచేస్తుంది. అప్రమత్తంగా ఉన్నవాళ్ళు, సమూహ బాధ్యతలు తెలిసినవాళ్ళు మాత్రమే చరిత్ర విసిరిన సవాలుకు సమాధానం ఇవ్వగలరు.



● డానీ
సమాజ విశ్లేషకులు



గ్రామోత్సవంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి

కనువిందుగా.. గ్రామోత్సవం

శ్రీవారి ప్రధాన వాహన సేవలు ప్రారంభం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి మంగళవారం రాత్రి హనుమంత వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. మంగళవారం నుంచి శ్రీవారి ప్రధాన వాహన సేవలు ఆరంభమయ్యాయి. మంగళగిరికి క్షేత్రపాలకునిగా చెప్పబడుచున్న భక్తాగ్రేశ్వరుడైన హనుమంతునికి స్వామివారి వాహన సేవల్లో తొలి ప్రాధాన్యతను కల్పించారు. హనుమంతుని భుజస్కంధాలపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీలక్ష్మీనృసింహస్వామి గ్రామోత్సవానికి విచ్చేసి భక్తులను అలరించారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం మెయిన్ బజారు మీదగా మిద్దె సెంటరు చేరుకుని తిరిగి అదే మార్గంలో ఆలయానికి విచ్చేసింది. భక్తులు టెంకాయలు సమర్పించి స్వామివారిని శరణు వేడారు. ఈ ఉత్సవానికి పెదపాలెం వాస్తవ్యులు వాసిరెడ్డి మల్లేశ్వరరావు (రాజేష్) కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కే.సునీల్‌కుమార్, అర్చకస్వాములు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళా వేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



గ్రామోత్సవం ముందు మహిళల కోలాట ప్రదర్శన

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలి రోజు 510 మంది విద్యార్థులు గైర్హాజరు

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ అన్సారియా



పరీక్షా కేంద్రాల్లోకి వెళ్తున్న విద్యార్థులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. సీనియర్ ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కాగా తొలిరోజు పరీక్షకు 510 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఓ గర్నేపూడి సునీత తెలిపారు. జిల్లావ్యాప్తంగా 87 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 31,197 మంది విద్యార్థులకు 30,748 మంది, వృత్తి విద్యా కోర్సుల పరీక్షలకు 1090 మందికి 1029 మంది హాజరయ్యారు. కాగా గుంటూరులోని ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాల కేంద్రంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును, తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల సమయంలో అనవసరపు వదంతులకు పాల్పడే వారిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సామాజిక మాధ్యమాలపై నిఘా పెట్టామన్నారు. కంట్రోల్ రూమ్‌ను కూడా తనిఖీ చేశారు.



కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా

సీసీఐ జోరు

పత్తి కొనుగోళ్లు వేగవంతం



- గుంటూరు, పల్నాడులో భారీగా సేకరణ
- 9,862 మంది రైతుల ఖాతాల్లో రూ.518 కోట్లు జమ

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

రైతుల రెక్కల కష్టం ఫలించింది. తెల్లబోయేలా చేసే పత్తి సాగుదారుల ఇంట తెల్లబంగారమై మెరిసింది. రైతులకు సరైన ధర అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు నిచ్చాయి. 2025-26 పత్తి సీజన్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కొనుగోళ్లు వేగంగా సాగడంతో వేలాది మంది రైతులకు ఆర్థికంగా పెద్ద ఊరట లభించింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో భారీగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. మధ్యవర్తుల జోక్యం నివారించి పారదర్శక విధానంలో కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టడంతో రైతులకు ఇతోధికంగా మేలు జరిగింది. 9,862 మంది రైతుల నుంచి 6,66,439 క్వింటాళ్ల పత్తిని సీసీఐ సేకరించగా రూ.518 కోట్లకు పైగా చెల్లింపులు జరిగింది. గుంటూరు జిల్లాలో 14 కొనుగోలు కేంద్రాల ద్వారా 4,484 మంది రైతుల నుంచి 3,06,893 క్వింటాళ్ల పత్తిని సేకరించారు. ఇందుకు సంబంధించిన రూ.237.93 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. పల్నాడు జిల్లాలో రికార్డ్ స్థాయిలో పత్తి కొనుగోలు జరిగింది. జిల్లాలో 5,378 మంది రైతుల నుంచి 3,59,546 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసి రూ.280.20 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ప్రకారం పత్తి కొనుగోళ్లతో రైతులు మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షణ పొందారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారం పారదర్శకంగా తూకం చేసి కొనుగోలు చేయడం, డైరెక్ట్ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ విధానం అమలు రైతులకు లబ్ధిని చేకూర్చింది.

ముగిసిన ప్రక్రియ..

ఈ ఏడాది పత్తి కొనుగోలు ప్రక్రియ దరిదాపుగా ముగిసిందని చెప్పవచ్చు. సీజన్ చివరికి వచ్చే సమయానికి బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువ పలకడంతో రైతు లు నేరుగా వ్యాపారులకు అమ్మేం దుకు ఇష్టపడ్డారు. దీంతో రెండు జిల్లాల పరిధిలోని సీసీఐ కేంద్రాలు దరిదాపుగా ఖాళీ అయ్యాయి.

ప్రతిష్ఠాత్మకంగా కొనుగోళ్లు

పత్తి కొనుగోలు ప్రక్రియను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మొదట్లో చిన్నా, చితక ఇబ్బందులు తలెత్తినా ఆ తర్వాత కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా సాగింది. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెనాయుడు నేరుగా కేంద్రానికి లేఖలు రాయడం ద్వారా రైతులకు మేలు జరిగింది.

- కాకుమాను శ్రీనివాసరావు, డైరెక్టర్, మార్కెటింగ్ శాఖ

ప్రభుత్వ చొరవతో లబ్ధి

ఈ ఏడాది సీజన్ ఆరంభంలో సీసీఐకి, పత్తి మిల్లుల యాజమాన్యాలకు మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ వల్లే ఎక్కువ మొత్తంలో పత్తి కొనుగోలుకు అవకాశం ఏర్ప డింది. విపత్తు సమయంలో రైతులకు మేలు జరి గింది. ప్రభుత్వం స్పందించకుండా ఉంటే పత్తి రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలేది.

- ఇక్కుర్తి శివప్రసాద్, మన్నవ హరినాథ్‌బాబు, ఏపీ కాటన్ టీఎంసీ కన్సార్టియం ప్రతినిధులు

ఏడో సారి ముందగానే పింఛన్

మార్చి 1 ఆదివారంతో శనివారమే పంపిణీ

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో ఒకరోజు ముందుగానే పింఛనుదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పండుగ వస్తోంది. మార్చి ఒక టో తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో ఫిబ్రవరి 28 శనివారం నాడే పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో 2,51,879 మందికి రూ.109.55 కోట్లను ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. కాగా జనవరి నెల పింఛన్‌ను ఒకరోజు ముందుగానే ఇచ్చారు. 20 నెలల కూటమి పాలనలో ఇలా ఒక రోజు ముందుగానే పింఛన్ ఇవ్వడం ఇది ఏడోసారి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2024 సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఆగస్టు 31నే లబ్ధిదారులకు పింఛను అందజేశారు. అదేవిధంగా అదే ఏడాది డిసెంబరు, 2025 జన వరి, జూన్, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి 1 వ తేదీన సెలవు దినం కావడంతో ముందురోజే పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే మార్చి 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా అంటే ఈ నెల 28న శనివారం పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేర కు ముందస్తుగా పింఛన్లను పంపిణీ చే సేందుకు ఏడో సారి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సాయంత్రం 6.17 (బుధవారం)

సహరి : ఉదయం 5.10 (గురువారం)

మొక్కలని మెక్కేశారు

- 937 ఉపాధి పనుల్లో భారీగా అక్రమాలు
- రూ.3.64 కోట్ల పనులపై సామాజిక తనిఖీ
- అక్రమాలను సమర్థించిన పీడీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మొక్కలే లేవు.. కానీ వాటి పేరుతో మెక్కేశారు. ఉపాధి పనుల్లో జరిగిన భారీ అక్రమాలు సామాజిక తనిఖీలో వెలుగు చూశాయి. గుంటూరు రూరల్ మండల పరిధిలోని 11 పంచాయతీల్లో 2024-25 మధ్య రూ.3 కోట్ల 64 లక్షలతో చేసిన 937 ఉపాధి హామీ పనులపై సామాజిక బృందం చేపట్టిన తనిఖీలలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. మస్టర్లలో తేడాలు, కొలతలు, కూలీల వివరాలు సక్రమంగా లేకపోవడం ఒకరి జాబ్ కార్డుపై మరొకరు పనిచేయడం, పని ప్రదేశాలలో వసతుల కల్పన, పనుల గురించి బోర్డుల ప్రదర్శన లేకపోవడం వంటి అక్రమాలను అధికారులు గుర్తించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంపీడీవో ఇతర అధికారులతో డ్వామా పీడీ శంకర్ అధ్యక్షతన డీవీవో హనుమంతురావు, ఏపీడీ శ్యామలాదేవి ఇతర సభ్యులతో కూడిన సామాజిక తనిఖీ బృందం గుంటూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బహిరంగ వేదిక నిర్వహించారు. అయితే ఆయా అక్రమాలు చిన్నవంటూ డ్వామా పీడీ శంకర్ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. రైతులకు అవగాహన లేకపోవడంతో మొక్కలు చనిపోయాయని తేల్చారు. అసలు లేని మొక్కలు..... చనిపోయాయని ఆయన చెప్పడం విమర్శలకు తావిస్తుంది.

- తురకపాలెంలో 164 సీతాఫలాలు మొక్కలు నాటి రూ.34 వేలు డ్రా చేశారు. అయితే కేవలం 34 మొక్కలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు.
- జొన్నలగడ్డ ఉన్నత పాఠశాలలో నాటకుండానే 50 మొక్కలకు బిల్లు డ్రా చేశారు.
- లాలుపురంలో కూలీలకు రూ.307కు రూ.245 మాత్రమే చెల్లించారు. ప్రతి కూలీలో రూ.62 వరకు కమీషన్ పొందినట్లు గుర్తించారు.
- చినపలకలూరు పత్తి మొక్కలకు రూ.6 లక్షలు, రోజ్ మొక్కలు రూ.7 వేలు చొప్పున దుర్వినియోగం చేశారు.
- వెంగళాయపాలెం, చల్లావారిపాలెం, దాసుపాలెం, తోకవారిపాలెం, ఓబులనాయడిపాలెం, గొర్లవారిపాలెం, మల్లవరం జాబ్ కార్డులను అప్‌డేట్ చేయలేదు.



విచారిస్తున్న డ్వామా పీడీ శంకర్, గుంటూరు క్లస్టర్ ఏపీడీ శ్యామలాదేవి తదితరులు

చోరులు చిక్కారు

- ధూళిపాళ్ళ తల్లి నివాసంలో చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్
- నిందితుల్లో వైసీపీ సర్పంచ్
- రూ.69 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం

బాలికపై అత్యాచారం

- నిందితుడికి 20 ఏళ్ల జైలు.. రూ.49 వేల జరిమానా

మార్కెటింగ్ ఆర్‌జేడీగా దివాకరరావు

పల్నాడు జంట హత్యలపై సీఎంకు వినతి

సీఆర్డీఏకు ఇద్దరు ఎస్డీసీలు

4

కల్తీ నెయ్యి వెనుక భారీ కుట్ర : ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భక్తులు అత్యంత పవిత్రంగా భావించి స్వీకరించే ప్రసాదాలలో కల్తీ జరగడం వెనుక భారీ కుట్ర కోణం దాగి ఉందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ శాసనసభలో మంగళవారం ఆరోపించారు. ఇది అనుకోకుండా జరిగింది కాదని ఒక పద్ధతి ప్రకారం సాగిన భారీ కుట్ర అని అన్నారు. టెండర్ నిబంధనల సడలింపుతోనే నెయ్యి కల్తీ మొదలైందని ఆరోపించారు. కఠిన నిబంధనలను తొలగించి తమకు కావలసిన ప్రైవేటు డెయిరీలకు టెండర్లు కట్టబెట్టారని దుయ్యబట్టారు. రూ. 234 కోట్ల విలువైన 60 లక్షల కేజీల కల్తీ నెయ్యి తిరుమలకు సరఫరా అయిందని ఆరోపించారు. వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్, మంగనా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్, ఏఆర్ డెయిరీ వంటి కొద్ది సంస్థలకే భారీగా సరఫరా కేటాయింపులు జరిగాయని ఆరోపించారు. దీర్ఘకాలికంగా నెయ్యి సరఫరా చేస్తున్న కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌ను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టిందని అన్నారు. ఎన్‌డీడీబీ, కాఫ్ ల్యాబ్ నివేదికలు సిట్ రిపోర్టులు, చార్జిషీట్లో కూరగాయల, జంతువుల కొవ్వుతో కల్తీ జరిగినట్టు స్పష్టంగా ఉందని వివరించారు. 2022లో ఇచ్చిన సీఎఫ్‌టీఆర్ఐ రిపోర్టును ఎందుకు దాచి పెట్టారని, ఛైర్మన్‌కు వచ్చిన లేఖపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఢిల్లీ ఎంపీ నివాసంలో టెండర్ బేరసారాలుపై సిట్ రిపోర్టులో పేర్కొన్న అంశాలను ప్రస్తావిస్తూ పై స్థాయి రాజకీయ నాయకుల పాత్ర పై సమగ్ర దర్యాప్తు అవసరమని డిమాండ్ చేశారు.

వడ్డేశ్వరానికి అర్బన్ ఆయుష్ మందిరం తరలింపు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గతంలో గుంటూరు నగరానికి మంజూరు చేసిన అర్బన్ ఆయుష్ ఆరోగ్య మందిరాన్ని వివిధ కారణాలతో మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మండలం వడ్డేశ్వరానికి రాష్ట్ర ప్రభుత్వం తరలించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు అధికారికంగా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడి కుంచనపల్లి యూపీహెచ్‌సీలో అర్బన్ ఆయుష్ ఆరోగ్య మందిరాన్ని మంజూరు చేసింది. కేంద్రప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ స్కీమ్ కింద పట్టణ ప్రాంతాల్లో ఈ అర్బన్ ఆయుష్ ఆరోగ్య మందిరాన్ని మంజూరు చేసింది. వీటిల్లో సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సేవలు అందిస్తారు. అవుట్ పేషెంట్, ఉచిత ఔషధాలు, డయాగ్నస్టిక్స్, యోగ వంటివి అందజేస్తారు. రోగాలను తొలి దశలో గుర్తించడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రతీ సెంటర్‌లో ఒక మెడికల్ అధికారి, నర్సు ఎంపీహెచ్ వర్కర్, స్వీపర్ అందుబాటులో ఉంటారు.

గుంటూరుకు కేంద్ర పంచాయతీరాజ్ అదనపు కార్యదర్శి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవహారాలపై సమీక్షించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి సుశీల్ కుమార్ లోహాని గురువారం గుంటూరు జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లా పరిషత్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న డిస్ట్రిక్ట్ పంచాయత్ రిసోర్స్ సెంటర్ భవనాన్ని పరిశీలించిన అనంతరం కొల్లిపర మండలంలోని కుంచవరం, దొంతలూరు గ్రామపంచాయతీలలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలను సందర్శించనున్నారు. ఫీల్డ్ విజిట్ సందర్భంగా సంబంధిత అధికారులంతా ప్రాజెక్ట్ స్థలాల్లో హాజరై పురోగతిని అదనపు కార్యదర్శికి వివరించాలని జిల్లా పరిషత్ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి, డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ తదితరులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రతిష్ఠ మసకబారుతోంది

● విస్తుగొలుపుతున్న మిర్చియార్డు ట్రేడర్ల తీరు ● రైతుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ మోసాలు ● శీతల గిడ్డంగుల యాజమాన్యాలదీ ఇదే వరుస ● ఏటా ఇదే తంతు ● పటిష్ట యంత్రాంగం ఏర్పాటుకు డిమాండ్



గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే పేరు ప్రఖ్యాతలున్న మిర్చియార్డు (వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు) పేరును కొంతమంది కమీషన్ ఏజంట్లు, ఎక్స్‌పోర్టర్లు, శీతల గిడ్డంగుల యజమానులు మసకబారేలా చేస్తున్నారు. రైతుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. రైతులకు తెలియకుండానే వాళ్ల మిర్చిని అమ్మేసి సొమ్ము చేసుకొని కనిపించకుండా పోతున్నారు. కొందరు అందుబాటులో ఉన్నా వితండవాదం చేస్తున్నారు. ఏటా మిర్చి సీజన్‌లో వ్యాపారస్థులు తమని మోసగించారన్న ఫిర్యాదులు అటు పోలీసుస్టేషన్లు, ఇటు ఏఎంసీ అధికార యంత్రాంగానికి అందుతూనే ఉన్నాయి. ఆయా సంఘటనల్లో బాధిత రైతులకు న్యాయం జరిగిన సందర్భాలు చాలా తక్కువ. దీంతో రైతులు తమ పంటను మిర్చి యార్డుకు తీసుకురావడానికి సంశయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోన్నది.

● సీజన్‌లో రోజుకు లక్షల టిక్కీల మిర్చి రాక

మిర్చి పండించే రైతులు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి గుంటూరు మిర్చియార్డుకు తమ పంట దిగుబడిని విక్రయించేందుకు వస్తుంటారు. ఇందుకోసం అధికారికంగానే 2 శాతం కమీషన్‌ని దిగుమతి వ్యాపారస్థులకు చెల్లిస్తుంటారు. ఇక దిగుమతి, దొడ్డికాపలా కూలీ, మచ్చుకూలీ వంటి వాటి రూపంలోనూ రైతు జేబు నుంచే చెల్లించాలి. కొంతమంది కమీషన్ వ్యాపారస్థులు ఐదు శాతం వరకు కూడా కమీషన్ తీసుకుంటుంటారు. సీజన్‌లో ఎక్కువగా రోజుకు లక్షకు పైగా మిర్చి టిక్కీలు వస్తాయి, అన్ సీజన్‌లో ఇందులో 50 శాతం లోపే దిగుమతి జరుగతుంటుంది. నిబంధనల ప్రకారం రైతు తీసుకొచ్చిన మిర్చిని కమీషన్ వ్యాపారస్థులు తమ దుకాణాల్లో ప్రదర్శిస్తారు. వాటిని ఎగుమతిదారులు కొనుగోలు చేస్తారు. ఇలా కొనుగోళ్లు జరిగిన 48 గంటల్లోనే రైతులకు కమీషన్ వ్యాపారస్థులు నగదు చెల్లించాలి. ఒకవేళ ధర తక్కువగా ఉంటే రైతులు కమీషన్ వ్యాపారస్థుల ద్వారా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేస్తారు. మార్కెట్‌లో రేటు పెరిగినప్పుడు వాటిని బయటకు తీసి విక్రయిస్తుంటారు.

● ప్రతి ఏడాది మోసాలు వెలుగులోకి

కాగా రైతులు తీసుకొచ్చిన మిర్చిని అమ్మి పెడతామని చెప్పి కొంతమంది కమీషన్ వ్యాపారస్థులు మోసగించిన సంఘటనలు ప్రతి సంవత్సరం వెలుగు చూస్తున్నాయి. ఇటీవలే మిర్చియార్డుకు సమీపంలోని లీలా గాయత్రి కోల్డ్‌స్టోరేజ్‌లో రైతులు నిల్వ చేసిన మిర్చి టిక్కీలను రెండేళ్ల పాటు తీసుకెళ్లలేదన్న కారణంతో వాటిని ఆ యాజమాన్యం విక్రయించింది. దీంతో తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన రైతులు ఇక్కడికి వచ్చి ఆందోళన చేస్తున్నారు. అలానే పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని జలాలపురానికి చెందిన రైతుకు సంబంధించిన మిర్చిని సాయిబాబా ట్రేడర్స్ విక్రయించి నగదు చెల్లించకుండా ఏళ్ల తరబడి తిప్పుకొంటోంది. ఎక్స్‌పోర్టు లైసెన్సు పొందిన వ్యక్తి ఒకరు కొనుగోలు చేసిన మిర్చికి సంబంధించి కమీషన్ వ్యాపారికి నగదు చెల్లించకుండా ఆ సరుకునే తిరిగి యార్డుకు తీసుకొచ్చి వేరొకరికి విక్రయించి సొమ్ము చేసుకొన్న సంఘటన ఇటీవల వెలుగు చూసింది. 2024లో నల్లపాడు రోడ్డులోని రెండు కోల్డ్‌స్టోరేజ్‌లలో ప్రకాశం జిల్లాకు చెందిన రైతులకు సంబంధించిన మిర్చిని నిల్వ చేశారు. దీనికి సంబంధించి కమీషన్ వ్యాపారి బాండ్లు తీసుకొని జీడీసీసీ, మరో ప్రైవేటు బ్యాంకు వద్ద రుణాలు తీసుకొని మోసగించారు. ఈ మోసాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కలగజేసుకొని ఒత్తిడి తీసుకొచ్చి రైతులకు న్యాయం చేయించారు. అలానే మరో కమీషన్ వ్యాపారి పల్నాడు జిల్లా రైతులను మోసగించడంతో దీనిపై లాలాపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఇది కూడా పంచాయతీ చేయాల్సిన పరిస్థితి. ఇలా రైతులను మోసగిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో నిబంధనలు పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరముందని పలువురు కోరుతున్నారు. చట్టంలో లోటుపాట్లు ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సవరణలు చేసి పటిష్ట యంత్రాంగం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చోరులు చిక్కారు

● ధూళిపాళ్ళ తల్లి నివాసంలో చోరీ కేసును ఛేదించిన పోలీసులు ● ఆరుగురు నిందితుల అరెస్ట్ ● నిందితుల్లో వైసీపీ సర్పంచ్ ● రూ.69 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ తల్లి నివాసంలో ఈ నెల 16న జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ చోరీతో సంబంధమున్న ఎనిమిది మంది నిందితుల్లో ఆరుగురుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.69 లక్షల 25 వేల ఖరీదైన బంగారు వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న రాత్రి చింతలపూడిలో స్థానిక ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తల్లి ప్రమీల దేవి ఇంటికి తాళం వేసి ఉండడంతో దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 42 సవర్ల బంగారు ఆభరణాలు, 10.50 కిలోల వెండి, రూ.లక్ష నగదును అపహరించుకుపోయారు. ఈ ఘటనపై తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇంట్లో లభ్యమైన వేలి ముద్రలు, అలాగే ఆ రోజు ఇంటి వద్ద అనుమానాస్పదంగా తిరిగిన కారు, ఇతర భౌతిక, సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించారు. ఏలూరు జిల్లాకు చెందిన సత్తెనపల్లి రాకేష్ ముఠా ఈ చోరీ చేసిందని గుర్తించి నిందితులను అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా పడపాడుకు చెందిన సత్తెనపల్లి రాకేశ్, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కలపాలెం శివారు పల్లెపాలెం గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ ఆశీర్వాదం, తూర్పుగోదావరి జిల్లా ఆకివీడులో నివాసం ఉంటున్న ఏలూరులోని కండ్రిపాడు కాలనీకి చెందిన జల్లి డయన్ కుమార్ అలియాస్ ఆశిష్, ఏలూరులోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న ఏలూరు మండలం మొండికోడు గ్రామానికి చెందిన నక్కా దుర్గాప్రసాద్, ఏలూరు మండలం చత్రపర్రు గ్రామానికి చెందిన రౌడీషీటర్ గుడిపూడి రఘు, ఏలూరు మండలం పెదపాడుకు చెందిన సత్తెనపల్లి లక్ష్మీ తదితరులను పొన్నూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కాగా ఇదే కేసులో నిందితులైన చాట్రపర్రుకు చెందిన దగ్గుమల్లి చినబాబు అలియాస్ విక్కీ, పమ్మి కృపా శామ్యూల్ అలి యాస్ బన్నీ పరారీలో ఉన్నారని త్వరలో వారిని అరెస్టు చేస్తామని తెలిపారు. ప్రధాన నిందితుడైన సత్తెనపల్లి రాకేష్‌పై ఏలూరు జిల్లాలో 34 చోరీ కేసులు ఉన్నట్లు చెప్పారు. చోరీ చేసిన అనంతరం నిందితు లు బంగారు వెండి ఆభరణాలను దొంగలు పంచుకున్నారని, కొంత వెండిని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చాటపర్రుకు చెం దిన వైసీపీ సర్పంచ్ రౌడీ షీటర్ అయినా గుడిపూడి రఘుకు ఇచ్చా రని ఎస్పీ తెలిపారు. కాగా ఈ చోరీ కేసును ఛేదించిన తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు బృందాన్ని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, పక్కన డీఎస్పీ జనార్దనరావు, సీఐ కృష్ణయ్య, వెనుక నిందితులు

పల్నాడు జంట హత్యలపై సీఎంకు వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం చర్లగుడిపాడు గ్రామంలో ఈ నెల 9వ తేదీన జరిగిన జంట హత్యల ఘటనపై ఏపీ పద్మశాలి సంఘం నాయకులు మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. భువనగిరి శ్రీనివాసరావు, కాకుమాను భావనారుషి అనే ఇద్దరు పద్మశాలిలను అపహరించి హత్య చేసి నాగార్జునసాగర్ కుడి కాలువలో పడవేసిన ఘటన తీవ్ర భయాందోళనకు గురి చేసిందన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం తోపాటు బాధిత కుటుంబాలకు తక్షణమే ఆర్థికసాయం అందించాలని, కుటుంబాల్లో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసిన వారిలో ఏపీ పద్మశాలి సంఘం అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి చిలుకోటి అంజిబాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు బండారు బెనర్జీబాబు, మహిళా అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి, కొలను కృష్ణ, చిలువేరు దశరథరామయ్య, వెంకటేష్, చింతలపల్లి రుద్రమహేష్ ఉన్నారు.

మార్కెటింగ్ ఆర్‌జేడీగా దివాకరరావు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ)గా గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ ఎం.దివాకర రావుకు పదోన్నతి లభించింది. ఇటీవలే జేడీ కాకుమాను శ్రీనివాసరావుకు డైరెక్టర్‌గా పదోన్నతి లభించడంతో దివాకర రావును ఉద్యోగోన్నతిపై పోస్టింగ్ ఇచ్చారు. అలానే మరో మార్కెటింగ్ డీడీ ఏ.శారద రాణిని జేడీ పోస్టుకు రిజర్వు చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఆర్డీఏకు ఇద్దరు ఎస్‌డీసీలు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్డీఏకు మరో ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మధుసూధన లంబాడి, జి. సుజాతను డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించి సీఆర్డీఏ ఎస్‌డీసీగా నియమించింది.

గల్లంతైన యువకుల మృతదేహాలు వెలికితీత

బాపట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పికట్ల రోడ్డులో నల్లమడ డ్రెయిన్‌లో సోమవారం గల్లంతైన ఇరువురు యువకుల మృతదేహాలను మంగళవారం వెలికితీశారు. జిల్లా అగ్నిమాపక అధికారి కె.వినయ్ ఆధ్వర్యంలో బాపట్ల అగ్నిమాపక అధికారి జి.రామ సిద్దార్థ ఆధ్వర్యంలో రెస్క్యూటీమ్ బృందాలు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టాయి. పోలీసులు, గజ ఈతగాళ్ళు, రెవెన్యూ సిబ్బంది సాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను కాల్వ నుంచి వెలికి తీశారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

బాలికపై అత్యాచారం

● నిందితుడికి 20 ఏళ్ల జైలు.. రూ.49 వేల జరిమానా

గుంటూరు (లీగల్), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను మోసగించి, బలవంతంగా పెళ్లి చేసుకొని, అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.49 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ పర్వీన్ సుల్తానా బేగం మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీగల దుర్గా ప్రసాద్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. తాడేపల్లి మండలం పోలకంపాడు గ్రామానికి చెందిన నిందితుడు ఆరోగ్య స్వామి అజయ్ అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో వెంటపడి 2021 మార్చి 24న ఆమెను బలవంతంగా పెళ్లి చేసుకున్నాడు. అనంతరం ఆమెను ఒక నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలు భయంతో మౌనంగా ఉంటూ, ఒంటరిగా ఉండటం చూసిన తల్లిదండ్రులు ఆమెను నిలదీసి అడగగా ఆమె జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. వారి ఫిర్యాదుతో 2021 జూన్ 2న మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అప్పటి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె.రవికుమార్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు ఆరోగ్య స్వామి అజయ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.49 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

కొత్త జిల్లాల్లో కోర్టులు ఏర్పాటు చేయాలి

● మండలిలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ప్రిన్సిపల్ జిల్లా కోర్టులను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మంగళవారం డి మాండ్ చేశారు. శాసన మండలిలో ఈ అం శంపై ప్రసంగించిన ఆయన రాష్ట్రంలో 28 జిల్లాలు ఏర్పాటైనప్పటికీ కొన్ని జిల్లాల్లో ప్రిన్సిపల్ కోర్టులు ఇంకా పాత ఉమ్మడి జి ల్లాల కేంద్రాలలోనే కొనసాగుతుండటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జిల్లా కోర్టు ఉన్నప్పటికీ, ప్రిన్సిపల్ కోర్టు మాత్రం ఇంకా గుంటూరులోనే కొనసాగుతోందని ఆయన ఉదహరించారు. ఈ కారణంగా పల్నాడు జిల్లాకు చెందిన న్యాయవాదులు, కక్షిదారులు ప్రతి చిన్న పనికి గుంటూరు వెళ్లి అక్కడ కేసులు ఫైల్‌చేసి, ఆ ఫైళ్లను నరసరావుపేటకు బదిలీ చేయించుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ ప్రక్రియ వల్ల సమయం, ధనం వృథా కావడంతో పాటు తీవ్ర శ్రమకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త జిల్లాల్లో పనిచేస్తున్న కోర్టులను ప్రిన్సిపల్ జిల్లా కోర్టులుగా ప్రకటించేలా ప్రభుత్వం వెంటనే హైకోర్టుకు ప్రతిపాదనలు పంపాలని ఆయన మండలి ఛైర్మన్‌ను కోరారు.



మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	140, 149, 160
చికెన్ విత్ స్కిన్(కిలో)	268.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	278.00

మిర్చియార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	1,00,860
అమ్మకాలు	98,920
నిల్వ	26,333

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	20000
నెంబరు. 5	13500	20000
273	----	----
341	14000	20500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	18000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	20500
దేవనూరు డీలక్స్	15500	21000
ఆర్మూరు	13000	16500
ఏసీ కామన్ వెరైటీ		
334	13000	19000
నెంబరు. 5	13000	19500
273	----	----
341	14000	20000
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	17000
బ్యాడిగి 355	14000	20500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	11000

భవిష్యత్తులో అమెరికా ఉద్యోగాలు మెరుగు : జయరామ్ కోమటి

భట్టిప్రోలు (కొల్లూరు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో అమెరికాలో విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని ఉత్తర అమెరికా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధి జయరామ్ కోమటి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుత్తావారిపాలెంలో తానా మాజీ అధ్యక్షుడు నాదెండ్ల గంగాధర్ స్వగృహంలో జరిగిన శుభకార్యానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ, ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా అధికారం చేపట్టిన అనంతరం భారత దేశ విద్యార్థులకు అమెరికాలో విద్య నేర్చుకోవడం కఠినంగా మారిందని, ఉద్యోగ అవకాశాలు కూడా తగ్గాయని చెప్పారు. అయితే భారత యువత అధైర్య పడాల్సిన పని లేదని, భవిష్యత్తులో మళ్లీ విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్, వివేకా డైరెక్టర్ గుత్తా వెంకటరత్నం, డాక్టర్ పరుచూరి ఆంజనేయులు, నల్లూరి వెంకటరామయ్య పాల్గొన్నారు.



తానా మాజీ అధ్యక్షుడు గంగాధర్ స్వగృహంలో జరిగిన శుభకార్యంలో పాల్గొన్న జయరామ్ కోమటి

పాట, పద్యంతో తెలుగు భాషకు ఔన్నత్యం : డొక్కా

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పద్యం, పాటతోనే తెలుగు భాష మరింత ఔన్నత్యాన్ని సంతరించుకుంటుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్, అన్నమయ్య కళావేదికపై మంగళవారం పి.సత్యనారాయణ రాజు కళావేదిక ఆధ్వర్యంలో సూర్యకాంతం స్మారక పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డొక్కా మాణిక్యవరప్రసాదు మాట్లాడుతూ, అనేక పాత్రలలో తెలుగు భాషకు సుర్యకాంతం వన్నె తెచ్చారని, ఆమె పురస్కారాన్ని పౌరాణిక నాటక బ్రహ్మ, పద్మశ్రీ యడ్ల గోపాలరావుకు అందజేయడం సముచితమని అన్నారు. అనంతరం మహాభారతంలోని పడక సీను నాటక ప్రదర్శన రసజ్ఞులను ఆలరించింది. ఈ కార్యక్రమానికి సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో పి.సత్యనారాయణ రాజు, లంకా విజయబాబు, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, పసుపులేటి శ్రీధర్, సెట్లం చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



యడ్ల గోపాలరావుకు సూర్యకాంతం పురస్కారాన్ని అందజేస్తున్న మాణిక్యవరప్రసాద తదితరులు

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



భవన నిర్మాణ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నిర్దేశిత ప్లాన్ మేరకే నిర్మాణాలు జరగాలి

● కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ నుంచి పొందిన నిర్దేశిత ప్లాన్ మేరకే నిర్మాణాలు జరగాలని, ప్లాన్ లేకుం డా లేదా ప్లాన్‌కి భిన్నంగా నిర్మాణాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. మంగళవారం శ్యామల నగర్, ఇన్నర్ రింగ్ రోడ్, టీచర్స్ కాలనీల్లో ఆక్యు పెన్సీ కోసం దరఖాస్తు చేసిన భవనాలను పరిశీలించి, ఇన్నర్ రింగ్ రోడ్డు లో ఒక భవనం ప్లాన్‌కి భిన్నంగా సెల్లార్ లో అదనపు రూమ్ ఏర్పాటుపై సంబంధిత టీపీవోకి షోకాజ్ జారీ చేయాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. బృందావన్‌గార్డెన్స్ రోడ్డు, కుందుల రోడ్డు విస్తర ణపై అధికారులను వివ రాలు అడిగి తెలుసుకొని పనులను వేగవంతం చేయాలన్నారు. కుందుల రోడ్డులో రైతు బజార్ ప్రతిపాదిత జీఎంసి స్థలాన్ని, కాకుమానువారితో టలో కార్మిక శాఖా స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుందుల రోడ్డులోని రైతుబజార్‌లో క్లస్టర్ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, ఈఈ విష్ణు, ఎస్ఎస్‌లు ప్రసాద్, సాంబయ్య, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, సర్వేయర్లు లక్ష్మీనారాయణ, సుభాని, కార్పొరేటర్ ఈ.వర ప్రసాద్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ చాంపియన్స్‌గా విజ్ఞాన్స్ యూనివర్సిటీ

గుంటూరు విద్య, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో అధ్యాపకుల కోసం ప్రతీ ఏటా నిర్వహించే ప్రతిష్టాత్మక 29వ ఎడిషన్ చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్న మెంట్‌లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచిందని యూని వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ మంగళ వారం తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో వడ్లమూడి విజ్ఞాన్స్ యూని వర్సిటీ జట్టు ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. జట్టు సభ్యులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు అభినందించారు.



జట్టు సభ్యులను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

హ్యాక్‌థాన్‌లో కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వెల్ ఐడియా ఫోర్జ్ 2 కే 26 నేషనల్ లెవెల్ 24 గంటల హ్యాక్ థాన్ పోటీల్లో చోడవరంలోని కేహెచ్‌ఐటి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరి చారని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం డాక్టర్ ఉమాశంక రరెడ్డి, కళ్ళం భరద్వాజ్ తెలిపారు. కళాశాలలో విద్యార్థులను అభినం దించారు. సీఎస్ఈ (ఏఐ అండ్ డీఎస్), సీఎస్ఈ (డి.ఎస్) విభాగానికి చెందిన విద్యార్థులు వెల్. టెక్. రంగరాజన్ డాక్టర్ శకుంతల ఆర్ అండ్ డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటి చెన్నైలో నిర్వహించిన వెల్ ఐడియా ఫోర్జ్ 2 కే 26 24 గంటల హ్యాక్ థాన్ పోటీల్లో పాల్గొని తృతీయ బహుమతి గెలుచుకున్నారు. తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సీహెచ్ జోష్ కుమార్, కె.బిందు మోహన్‌సాయి, ఎస్‌కే ఫర్హాలకు హ్యాక్ థాన్ జ్యూరి పాల్గొన్నారని ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ హనుమత్ ప్రసాద్ తెలిపారు.



విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమా శంకర్ రెడ్డి తదితరులు

ఉత్సాహభరితంగా సైక్లింగ్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక బీఆర్ స్టేడియంలో మంగళవారం శాప్ లీగ్ జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సైక్లింగ్ కోచ్ వి.కనకరావు, సైక్లింగ్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి లింగినేని శ్రీనివాసరావు, భాను ప్రసాదు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను స్థానిక కార్పొరేటర్ మీరావలీ, పాత గుంటూరు ఏఎస్ఐ షేక్ నజీర్ ప్రారంభించారు. కోచ్ వి.కనకరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోటీలలో దాదాపు 94 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. ఈ ఎంపికలలో విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 28 నుంచి ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. మాస్ స్టార్ట్ విభాగంలో ప్రథమ స్థానంలో వి విగ్నేష్, ఎం గీతా ఏసురాణి, ద్వితీయ స్థానంలో అనిల్‌కుమార్, ఎం వాసంతి, ఐటీటీ విభాగంలో ప్రథమ స్థానంలో ఎస్కే జునాయత్ అజ్మల్, పి వైష్ణవి, ద్వితీయ స్థానంలో వై చంద్రశేఖర్, దివ్యశ్రీ విజేతలుగా నిలిచారు.



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న పాతగుంటూరు ఏఎస్ఐ షేక్ నజీర్, కార్పొరేటర్ మీరావలీ

వన్ స్టాప్ సెంటర్‌లో 14 పోస్టుల భర్తీ

గుంటూరు సిటీ ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడపబడుతున్న మిషన్ శక్తి స్పెషల్ వన్ స్టాప్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న 14 పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని పీపీజీ ప్రసూనా మంగళవారం తెలిపారు. వన్ స్టాప్ సెంటర్‌లో అడ్మినిస్ట్రేటర్ (1), కేసు వర్కర్ (2), పారా లీగల్ పర్సనల్, లాయర్ (1), పారా మెడికల్ పర్సనల్ (1), సైకో సోషల్ కౌన్సిలర్ (2), ఆఫీస్ అసిస్టెంట్ (కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి) (1), మల్టీ పర్పస్ స్టాఫ్ (3), సెక్యూరిటీ గార్డ్ (3) పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమై మార్చి 5వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. పూర్తి వివరాలు గుంటూరు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని పీపీజీ ప్రసూనా సూచించారు.

జనగణన పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



జనాభా లెక్కల నిర్వహణపై జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జన గణన అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జన గణనపై జరిగిన శిక్షణ కార్యక్రమం లో మంగళవారం ఆమె ప్రసంగించారు. కలెక్టర్ మాట్లాడుతూ జన గణనలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సూపర్వైజర్లు, ఎన్యూమ రేటర్లను పర్యవేక్షించే చార్జ్ ఆఫీసర్లు, అడిషనల్ చార్జ్ ఆఫీసర్లు బాధ్య తలు చాలా కీలకమైనవని తెలిపారు. శిక్షణలో రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్లు అందించిన అంశాలపై పూర్తిస్థాయి అవగాహన ఉంటేనే క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వారిని పర్యవేక్షించడం జరు గుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రానున్న జనాభా లెక్కలసేకరణ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె మయూర్ అశోక్ మాట్లాడుతూ జనాభా గణన విజయవంతం అనేది అంకితభావంతో పాల్గొనడంపై ఆధారపడి ఉం టుందన్నారు. జనాభా లెక్కల కార్యనిర్వహణ అధికారి, జాయింట్ డైరె క్టర్ జీ.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ జనాభా లెక్కలసేకరణ ప్రక్రియ ను డిజిటల్ విధానంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఖాజావలి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి వీ.జ్యోతి బసు, ముఖ్య ప్రణాళిక అధికారి పీ.శేషశ్రీ, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అలీమ్ బాషా, జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాషా, జిల్లా ఇన్ ఛార్జ్ అధికారి వీ.ఆదిలక్ష్మి, శిక్షకులు సీహెచ్‌వీ రమణ, ఎం.స్వాతి, సమన్వయ అధికారి డీ.రామ సుబ్బారావు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ కార్యకలాపాలను వేగవంతం చేయాలి

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓటర్ జాబితాలకు సంబం ధించి స్పెషల్ ఇన్‌క్లూజివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యకలాపాలను జిల్లాలో వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్ట రేట్‌లో ఆమె రాజకీయపార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్, క్లెయిమ్‌ల పరిష్కార వివరాలను నియోజకవర్గాల వారీగా తెలిపారు. బూత్ స్థాయి అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ప్రజలకు ఓటరు జాబితాలకు సంబంధించిన వివరాలు అందించేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల న్నారు.

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను నెలవారీ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ అన్సారియా మంగళవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన తాళాల సీళ్ళు తీయించి సీసీ కెమెరాల డిస్‌ప్లే, ప్రాంగణంను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎం గోడౌన్ భద్రత విష యంలో రాజీ లేకుండా అవసరమైన అన్ని చర్యలు నిరంతరం పటి ష్టంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో డీఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఈఆర్వోలు/డిప్యూటీ కలెక్టర్‌లు గంగరాజు, తెనాలి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు చల్లా ఓబులేసు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, డాక్టర్ టి.సేవ కుమార్(ఆప్), చిరతనగండ్ల వాసు(బీఎస్పీ), వైవీ సుబ్బారావు(బీజేపీ), కేకే గుప్తా (కాంగ్రెస్), నాయుడు ఓంకార్(టీడీపీ), సీహెచ్ త్రినాధ్(జనసేన) పాల్గొన్నారు.

దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు సత్వరం భర్తీ చేయాలి

● మంత్రి డీబీఎస్ స్వామికి సంఘ నాయకుల విజ్ఞప్తి

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు సత్వరం భర్తీ చేయాలని వికలాంగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి వినతి పత్రం అందజేశారు. బ్యాక్ లాక్ పోస్టుల నోటిఫికేషన్ విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఉమ్మడి జిల్లాలు కృష్ణా, గుంటూరు, నెల్లూరుతో పాటు మరికొన్ని జిల్లాలలో రోస్ట ర్ వెరిఫికేషన్ పూర్తిస్థాయిలో జరగటం లేదని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. జిల్లాలలో పూర్తిస్థాయిలో రోస్టర్ వెరిఫికేషన్ జరగటం లేదని దానికి అసిస్టెంట్ డైరెక్టర్ ల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. అర్హులైన దివ్యాంగులు నష్టపోతారని కొన్ని జిల్లాలలో దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుంటుపల్లి సతీష్, ఏ.లక్ష్మి, అభిరామ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాటూరి మెడికల్ కళాశాలకు గవర్నర్ రాక

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఈ నెల 25వ తేదీ కాటూరి మెడికల్ కళాశాలకు రానున్నారు. ఉదయం 11.30 గంటల నుంచి జరిగే కళాశాల 22వ గ్రాడ్యుయేషన్ డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తన పర్యటన ముగించుకొని తిరిగి విజయవాడలోని లోక్ భవన్‌కు బయలుదేరి వెళతారు. ఈ మేరకు గవర్నర్ క్యాంపు కార్యాలయం నుంచి గుంటూరు కలెక్టరేట్‌కు సమాచారం అందింది.

యువ రచయితలకు కథ, కవితల పోటీలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మే నేలలో తిరుపతిలో జరిగే అరసం 20వ రాష్ట్ర మహాసభల సందర్భంగా యువ రచయితలకు కథ, కవితల పోటీలను నిర్వహిస్తున్నట్టు అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివ ప్రసాదు ఒక ప్రకటనలో తెలిపారు. 40 ఏళ్ల లోపు వయసు కలిగిన యువతి, యువకులు ఈ పోటీలకు అర్హులన్నారు. ఐదు పేజీలలో కథ, రెండు పేజీలలో కవితలు ఉండాలన్నారు. ఎంపికైన కథా రచనల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, కవిత్వంలో రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి అందజేయనున్నట్టు చెప్పారు. తమ రచనలను ఏప్రిల్ 13వ తేదీలోపు వల్లూరి శివప్రసాదు, అరసం, 401 శ్రావణి రెసిడెన్సీ, 6/3, ఎస్వీఎన్ కాలనీ, గుంటూరు, ఫోన్ నెం 92915 30714 చిరునామాకు పంపాలని కోరారు.

సింహాద్రి శివారెడ్డి పోరాటాలు స్ఫూర్తిదాయకం : నేతాజీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సింహాద్రి శివారెడ్డి చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయ కమని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. బ్రాడీపేటలోని, ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ శివారెడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో పేదలకు ఇళ్ళ స్థలాలు, ఇళ్ళ పట్టాలు కోసం ఆయన అనేక పోరాటాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.భావన్నారాయణ, కే.నళినికాంత్, కాకుమాను నాగేశ్వరరావు, చిష్టీ, ఎన్.పద్మ, ఖాసిం వలీ, భైరగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీరామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి, గతంలో ఉన్న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకాన్ని కొనసాగించాలని అఖిల భారత రైతు, కూలీ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.గనిరాజు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనేక మంది పేదలకు ఉపాధి కల్పించిన ఈ పథకాన్ని మోదీ ప్రభుత్వం దశలవారీగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాల్లో కొత్త చట్టాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం డీఆర్వో ఖాజావలీకి వారు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనల్లో ఎన్‌వి కృష్ణ, నరసింహారావు, మల్లేశ్వరరావు, బాలయ్య, శంకర్, నరసింహారావు, శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను దేశం నుంచి తరిమికొట్టాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వేదిక లపై ప్రతిష్టను దిగజార్చిన కాంగ్రెస్‌ను దేశం నుంచి తరిమికొట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పిలుపునిచ్చారు. స్థానిక హిమని సెంటర్లో మంగళవారం మహిళా మోర్చా అధ్యక్షురాలు రాధా మాధవి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు వ్యతిరేఖంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ దేశ పరువు తీసిన కాంగ్రెస్ నాయకులని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరి మాట్లాడుతూ కాంగ్రెస్ తన ప్రవర్తనని మార్చుకుని దేశ ప్రజలకి క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్చి యార్డు డైరెక్టర్ శ్రావణకుమారి, మోర్చా నాయకులు హరి పావని, కాసు శ్రీదేవి, డాక్టర్ స్రవంతి, శ్రీను నాయక్, యశ్వంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హిమని సెంటర్లో జరిగిన నిరసనల్లో బీజేపీ నాయకులు

ముస్లింలకు గంజి పంపిణీ



ముస్లింలకు గంజి పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ సజీల, షౌకత్ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు మాయబజార్ సెంటర్‌లో మంగళవారం డిప్యూటీ మేయర్ షేక్ సజీల చేతుల మీదుగా గంజి పంపిణీ చేశారు. మాయబజార్ సెంటర్‌లో ప్రత్యేకంగా గంజి వంటకం తయారు చేసి ముస్లింలకు అందజేస్తున్నట్లు తెలిపారు. జీఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ షేక్ షౌకత్, బాజీ, బాషీ, మహ్మద్ , రహమాన్, ఆలీ తదితరులున్నారు.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న బొల్లేపల్లి సత్యనారాయణ, మస్తానయ్య తదితరులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 26 నుంచి మార్చి 3 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26న అంకురారోపణ, 27న శేషవాహన సేవ, 28న ఉదయం హనుమత్ వాహన సేవ, సాయంత్రం గరుడ వాహన సేవ, మార్చి 1న ఉదయం గజవాహన సేవ, సాయంత్రం స్వామివారి శాంతి కల్యాణం, 2న ఉదయం సుహాసిని పూజ, సాయంత్రం రథోత్సవం, 3న ఉదయం పూర్ణాహుతి, ధ్వజావరోహణం, అన్నసమారాధన జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సభ్యులు లంకా విజయబాబు, సూర్యదేవర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఆంజనేయస్వామికి ఘటాభిషేకం



శ్రీ ఆంజనేయస్వామి వారికి ఘటాభిషేకం చేస్తున్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్, శ్రీ మారుతి దేవాలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ వాసుదేవానంద భారతి స్వామి ఆధ్వ ర్యంలో ఆంజనేయస్వామి వారికి మహాలింగాత్మక శ్రీ రుద్ర సహిత ఘటాభి షేకం నిర్వహించారు. అనంతర శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సామూహిక కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం లక్ష మోదక హోమం, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ శ్రీనివాస్ బృందం చేత వారిచే భజన కార్యక్రమాలు జరిగాయి. కమిటీ సభ్యులు కొరపాటి రామారావు, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు

నేత్రపర్వంగా శ్రీ ఆదిలక్ష్మి, నారాయణుల కల్యాణం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళ వారం శ్రీ ఆదిలక్ష్మి, నారాయణుల కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం నిత్యపూజలు, శ్రీ చక్ర మేరుకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంత రం కల్యాణంలో పాల్గొన్న దంపతులకు తీర్ధ ప్రసాదాలు గావించారు. ప్రధా నార్చకులు మర్రిపాటి ప్రసాదు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం కల్యా ణాలు, సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయన్నారు.

మసీద్ వద్ద బార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా 27న ర్యాలీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డు, బండ్లమూడి గార్డెన్స్, అంబేద్కర్ నగర్‌లో మసీదు ఎదుట ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 27న నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు అంబేద్కర్‌నగర్, మస్జీద్ ఎ మురాద్ అధ్యక్షుడు ఇమాభీ ఖాన్ తెలిపారు. విద్యాసంస్థలకు, ప్రార్థన స్థలాలకు 100 మీటర్లకు దూరంగా మద్యం షాపులు ఉండాలని ఎక్సైజ్ నిబంధనలు చెబుతున్నా యని, అయినప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యం లో ముస్లీం సంఘాలతో భారీ ర్యాలీకి సిద్ధమవుతున్నట్టు స్పష్టం చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు

అంబటిని నాయకుడిగా చిత్రీకరించడానికి వైసీపీ పాట్లు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పనికిమాలిన అంబటిని నాయకు డిగా చిత్రీకరించడం కోసం వైసీపీ నాయకులు పడరాని పాట్లు పడుతున్నా రని, గుంటూరుకి క్యూ కడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణి క్యరావు విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డినే రాష్ట్ర ప్రజలు నాయకుడిగా చూడట్లేదని, అసలు జగన్‌మో హన్‌రెడ్డి, రెడ్డి కులానికి చెందిన వ్యక్తి కాదని, సంచార జాతులకు చెందిన వ్యక్తి అని విమర్శించారు. పేదల కోసం పోరాటం చేసిన వంగవీటితో అంబటిని పోల్చడానికి వైసీపీ నేతలు తమ్మినేని, ముద్రగడ లాంటి వారికి సిగ్గుండాలని విమర్శించారు. మండలిలో శ్రీవారిని అవమానపరిచి కూడా అసత్య ప్రచారాలు చేసిన బొత్సని ఆ శ్రీవారు కూడా క్షమించరన్నారు. కూట మి చీలిపోతే నేర సామ్రాజ్యాన్ని విస్తరించవచ్చని వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఎందరు జగన్‌లు వచ్చినా కూటమిని ఏమీ చేయ లేరని, అభివృద్ధిని ఆపలేరని తేల్చి చెప్పారు. రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ మాజీ ఛైర్మన్ దాసరి రాజామాష్టారు మాట్లాడుతూ ప్రజాసేవ చేయటానికి రాజకీయం ఒక వేదికగా ఉండాలి తప్పా, రాజకీయాలలో ఎదగడానికి కు లాలను వేదికగా చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కాపులకు సముచిత స్థానం కల్పించింది మొదటి నుంచి టీడీపీనే అన్నారు. ఆనాడు ఎన్టీఆర్.. ఈనాడు చంద్రబాబు కాపులకు తగిన గౌరవం కల్పించారన్నారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, వేములకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జన్నత్ హుస్సేన్ నియామకంపై విషప్రచారం ఆపాలి

● గుంటూరు పశ్చిమ మైనారిటీ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడిగా షేక్ జన్నత్ హుస్సేన్‌ను నియమించడంపై కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న విషప్రచారాన్ని పశ్చిమ నియోజకవర్గ ముస్లిం మైనారిటీ నాయకులు తీవ్రంగా ఖండించారు. టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. షేక్ జన్నత్ హుస్సేన్ 2014 నుంచి పార్టీ పట్ల అంకితభావంతో క్రియాశీలకంగా పనిచేస్తూ వస్తున్నారని తెలిపారు. 2019 ఎన్నికల అనంతరం ఏర్పడిన కొన్ని ప్రత్యేక రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన వైసీపీలో చేరాల్సి వచ్చిందని, ఆ సమయంలో జరిగిన పరిణామాలకు బలమైన కారణాలు ఉన్నాయని వివరించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి జరిగిన సమయంలో జన్నత్ హుస్సేన్ జగన్ పార్టీలో లేరని స్పష్టం చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో తిరిగి చేరారని చెప్పారు. నిబద్ధతతో పనిచేస్తున్న నాయకుడిపై అసత్య ప్రచారాలు చేయడం తగదని, ప్రజలు పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పఠాన్ అస్మా, షేక్ నాగూర్, అబ్దుల్ రహీం, చిన్న మస్తాన్ వలి,షేక్ ఇమ్రాన్, షేక్ హుస్సేన్, సుభాని (బీడింగ్) పలువురు మైనారిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశ్చిమలో.. మహిళా గ్రీవెన్స్


గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు మంగళవారం మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వినిపించారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, చెంబేటి మణికుమారి, షేక్ కరీమూన్, లక్ష్మీ ప్రసన్నలు మహిళా కమిటీ సభ్యులు పాల్గొని మహిళల నుంచి వినతులు స్వీకరించారు. కుటుంబ, సంక్షేమ, పింఛన్లు, గృహ సమస్యలు, ఉపాధి, ఆరోగ్య, స్థానిక మౌలిక వసతులు వంటి పలు అంశాలపై మహిళలు తమ వినతిపత్రాలను సమర్పించారు.



మహిళా గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న తెలుగు మహిళలు

రెండోరోజు సాగిన అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యూటి అమలు, మే నెల సెలవులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక రామిరెడ్డినగర్, గుంటూరు ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు 2వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను మంగళవారం యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు రమణ, ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షుడు కె శ్రీనివాసరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు 2019 నుంచి జీతం పెంచలేదని, దీనికి తోడు పని భారం పెరిగిందని అన్నారు. పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని కోరారు. ప్రాజెక్ట్ కార్యదర్శి ఎస్.కె అస్మత్ తారా మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారానికి నేటి నుంచి మూడు రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు జరుగుతాయని, ఆ తరువాత మార్చి 2న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నిరసనల్లో గౌస్య, అమీరునిషా, సూర్యకుమారి, రున్నిష, నాహిద, ప్రత్యూష, వాణి తదితరులు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ కోసం సమ్మెకైనా సిద్ధం

● ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఎన్ఎంయూ ఉద్యోగుల ధర్నా

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు పరం కాకుండా పరిరక్షించుకునేందుకు అవసరమైతే సమ్మెకైనా సిద్ధమవుతామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ బస్టాండ్‌లో గుంటూరు-2 డిపో గ్యారేజ్ ఎదుట మంగళవారం నేడు ధర్నా రేపు సమ్మె అంటూ నినాదాలతో నిరసనగా ధర్నా నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ పేరుతో కోట్లాది రూపాయల ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించే విధానాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ధర్నాలో ఎన్ఎంయూ ఛైర్మన్ సుబ్బారావు, డిపో అధ్యక్షుడు నారాయణ, పి.అమర్‌నాథ్, జాయింట్ సెక్రటరీ టిఆర్ రాజు, గుంటూరు 1 డిపో అధ్యక్ష, కార్యదర్శులు టిఎస్ రావు, చిన్నబాబు, ట్రెజరర్ రాంబాబురెడ్డి, పలువురు ఉద్యోగులున్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు కల్పించింది. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న డిప్యూటీ కలెక్టర్లు జి.వెంకటేష్, కె.సుధారాణి, కె.వినాయకం, వి.శైలజ, వి.సుబ్బారావు, రంగాల చంద్రముని ఏపీసీఆర్‌డీఏ ఎస్‌డీసీలుగా పోస్టింగ్ ఇచ్చింది. అలాగే డి.ఎలీషా, బొంతు రత్నాకర్, పి.మధుసూదనరావు, వాడబోయిన పద్మావతి, కాకర ఆనందరావుకు ప్రమోషన్ కల్పించి ఏపీసీఆర్‌డీఏ ఎస్‌డీసీలుగా నియమించింది. ప్రత్తిపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవలే కలెక్టరేట్‌కు వచ్చిన జి.సుజాతకు ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పించి ఏపీసీఆర్‌డీఏ ఎస్‌డీసీగా నియమించింది. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వద్ద విధులు నిర్వహిస్తోన్న తహసీల్దార్ కె.సాంబశివరావుకు ప్రమోషన్ కల్పించి మచిలీపట్నం ఆర్‌డీవోగా పోస్టింగ్ కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.



నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయం

రేపు క్రాపలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

కొల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కొల్లూరు మండల పరిధిలోని క్రాప గ్రామంలో గురువారం జరగనుంది. రూ.80 లక్షల నిధులతో కోగంటి వారి కుటుంబసభ్యులు సీతారామలక్ష్మణ, ఆంజనేయ ఆలయం, కనకదుర్గా ఆలయం, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను నూతనంగా నిర్మించారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 10.08 గంటలకు స్వామి వార్ల విగ్రహ వాయు ప్రతిష్ఠాపన మహోత్సవం రుత్వికులతో జరుపనున్నారు. ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం గ్రామంలో స్వామివార్ల విగ్రహాల ఊరేగింపు, గ్రామోత్సవం జరుపుతున్నట్లు కోగంటి వారి కుటుంబసభ్యులు తెలిపారు. ఆలయాల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని వారు కోరారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం



దుర్గాదేవి ఆలయం

విజయకీలాద్రిపై ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

● పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర ● మంగళశాసనాలు అందించిన చిన్న జీయర్‌స్వామి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): త్రిదండి చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై మంగళవారం ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, శ్రీ భూనీళా సమేత వైకుంఠనాథ పెరుమాళ్, శ్రీలక్ష్మీ హయగ్రీవస్వామి, శ్రీయోగాంజనేయ స్వామి వార్ల ఆలయ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా గోపుర కలశ స్థాపన, పూర్ణాహుతి, తీర్థ ప్రసాదగోష్టితో కార్యక్రమాలు నిర్వహించారు. త్రిదండి చిన్న జీయర్ స్వామి మంత్రి కొల్లు రవీంద్రకు జ్ఞాపికను అందజేసి, మంగళ శాసనాలు చేశారు. ఈ ఉత్సవాల్లో చిన్న జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి, వేద పండితులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మంత్రి కొల్లు రవీంద్రకు జ్ఞాపిక అందజేస్తున్న చిన జీయర్‌స్వామి

9 నుంచి వాయుసేన రిక్రూట్‌మెంట్ ర్యాలీ

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భారత వాయుసేన అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మార్చి 9వ తేదీ నుంచి ఏఎన్‌యూలో ప్రారంభ మవుతుందని జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ ర్యాలీ నిర్వహణపై కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అభ్యర్థులకు ఇదొక మంచి అవకాశమని అన్నారు. హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ డైరెక్టర్ వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ, మార్చి 9, 10 తేదీలలో యువతులకు, మార్చి 12, 13 తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ పురుష అభ్యర్థులకు, మార్చి 15, 16 తేదీలలో తెలంగాణ పురుష అభ్యర్థులకు ఓపెన్ ర్యాలీ జరుగుతుందన్నారు. 2005 జూలై 2 నుంచి 2009 జనవరి 2వ తేదీ మధ్య జన్మించిన అవివాహిత పురుష, మహిళ అభ్యర్థులు ర్యాలీలో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. 1.6 కిలోమీటర్ల పరుగు పోటీ, భౌతిక, శారీరక పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్‌ఎస్‌కే ఖాజావలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయలక్ష్మి, రవాణాశాఖ ఉప కమిషనర్ కె.సీతారామి రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, డీఎస్పీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణపై మాట్లాడుతున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

అమ్మ వంట అద్భుతం

● విటోపియాలో ఆకట్టుకున్న స్టాల్
● రాజధాని మహిళల ఉపాధి బలోపేతానికి సీఆర్డీఏ కృషి
● శిక్షణ అందించి విక్రయశాలల ఏర్పాటుకు చేయూత

తుళ్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి 24 వరకు వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో జరిగిన విటోపియా-2026లో రాజధాని మహిళలు అమరావతి అమ్మ వంట బ్రాండ్ పేరుతో విక్రయించిన మిల్లెట్ ఆధారిత సంప్రదాయ ఆహార పదార్థాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. మహిళల ఉపాధి అవకాశాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఏపీ సీఆర్డీఏ అమరావతిలో జరిగే కార్యక్రమాలలో స్థానిక మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తోంది. ఇందులో భాగంగా రాజధాని మహిళలు అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఆహార పదార్థాలను విక్రయించారు.

● శిక్షణ అందించి చేయూత

ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు, సోషల్ డెవలప్‌మెంట్ గ్రూప్ డైరెక్టర్ వెలుగోటి రాములు మార్గదర్శకత్వంలో అమరావతి ప్రాంత మహిళలకు గతంలో మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాల తయారీపై సీఆర్డీఏ శిక్షణ ఇచ్చింది. శిక్షణ పూర్తయిన అనంతరం రాజధాని మహిళలకు వారు సిద్ధం చేసిన రుచికరమైన ఆహార పదార్థాల విక్రయాలకు విస్తృత అవకాశాలను కల్పించడంలో సీఆర్డీఏ కీలక పాత్ర పోషించింది. మిల్లెట్స్ వంటకాల తయారీలో మహిళలకు శిక్షణ అందించటం, వారి ఉత్పత్తుల అభివృద్ధికి సహాయం అందించడం బ్రాండింగ్, ప్యాకేజింగ్ కార్యక్రమాలు లోగో రూకల్పన, స్టాల్ డిజైన్, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలను ఏపీ సీఆర్డీఏ నిర్వహించింది. గృహిణులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని సీఆర్డీఏ విజయవంతంగా అమలు చేసింది.

● స్టాల్ ఏర్పాటుతో రూ.45 వేల ఆదాయం

ఉండవల్లి మందడం, యర్రబాలెం అనంతవరం గ్రామాలకు చెందిన మొత్తం 11 మంది మహిళలు విటోపియా-2026 కార్యక్రమంలో పాల్గొని అమరావతి అమ్మ వంట బ్రాండ్ పేరుతో మిల్లెట్ ఆధారిత సంప్రదాయ ఆహార పదార్థాలను ప్రదర్శించి విక్రయించారు. వివిధ రకాల ఆరోగ్యకరమైన స్నాక్స్, మిల్లెట్ స్వీట్స్, సంప్రదాయ పచ్చళ్లు విక్రయించారు. స్టాల్ నిర్వహణ ద్వారా ప్రతి మహిళ రోజుకు సగటున సుమారు రూ. 5వేల వరకు విక్రయాలు జరపగా, మూడు రోజులలో కలిపి దాదాపు రూ. 45 వేలు వరకు ఆదాయం పొందారు. మొదటి రోజు ఉండవల్లి 1 బ్యాచ్ మహిళలు, రెండో రోజు ఉండవల్లి-2 బ్యాచ్ మహిళలు, మూడో రోజు అనంతవరం మహిళలు పాల్గొన్నారు. భవిషత్తులో ఎస్‌ఆర్ఎం యూనివర్శిటీ, వీఐటీ విశ్వవిద్యాలయం, ఎయిమ్స్, హైకోర్టు వంటి ప్రాంతాలలో అమరావతి అమ్మ వంట స్టాల్స్‌కు శాశ్వత విక్రయ స్థలాలు ఏర్పాటు చేసే దిశగా ఏపీ సీఆర్డీఏ చర్యలు తీసుకుంటుందని కమిషనర్ తెలిపారు.



వీఐటీలో అమరావతి అమ్మ వంట స్టాల్ నిర్వహిస్తున్న అమరావతి రాజధాని గ్రామాల మహిళలు

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



ఉదయపూర్‌లో మోగిన పెళ్లి బాజా

హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మరి కొన్ని గంటల్లో వివాహబంధంతో ఒకటవనున్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఐటీసీ మెమెంటోస్ లగ్జరీ హోటల్ ఈ నెల 26న జరిగే వీరి వివాహానికి వేదికవుతోంది. ఇప్పటికే అతికొద్ది మంది కుటుంబ సభ్యులు, మిత్రులతో కలసి విజయ్, రష్మిక ఉదయపూర్ చేరుకున్నారు. మంగళవారం మెహందీ, సంగీత్ కార్యక్రమాలను నిర్వహించి, బుధవారం హల్దీ, గురువారం వివాహం జరపడానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు విజయ్, రష్మిక. ఐటీసీ మెమొంటోస్ హోటల్‌లో మొత్తం 117 విల్లాలు ఉన్నాయి. ఓ నది, ఆ పక్కనే ఓ సరస్సు. వాటి పక్కనే ఈ విల్లాలు ఉండడం విశేషం. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొందరు మంత్రులు, కొంతమంది దర్శకులు విజయ్, రష్మిక వివాహానికి హాజరవుతారని అంటున్నారు.

భిన్న కోణాల పాత్ర

నయన్ సారిక



"విష్ణు విన్యాసం' చిత్రంలో చాలా భిన్నమైన క్యారెక్టర్ నాది. ఈ పాత్రకు చాలా కోణాలుంటాయి' అని నయన్ సారిక తెలిపారు. శ్రీ విష్ణు హీరోగా యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. సుమంత్ నాయుడు నిర్మించారు. ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక నయన్ సారిక మీడియాతో మాట్లాడారు. 'ఈ సినిమాలో నేను మనీషా అనే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. తను జీవితంలో చాలా కష్టాలు అనుభవించిన అమ్మాయి. ఒక దశకు చేరుకున్నాక జీవితాన్ని హాయిగా గడిపేయాలనుకునే అమ్మాయి. ఈ చిత్రంలో విష్ణుగారు, నేను కాలేజీ లెక్చరర్స్ పాత్రల్లో కనిపిస్తాం. ఇద్దరు లెక్చరర్స్ మధ్య జరిగే ప్రేమ కథ. విద్యార్థులు, యువతకు మా పాత్రలు బాగా కనెక్ట్ అవుతాయి' అని చెప్పారు.


ఆనందంతో ఆలింగనం!



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న 'కల్కి 2898 ఏడీ' చిత్రం సీక్వెల్ షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. తాజాగా ఈ చిత్రీకరణ సెట్స్‌లో జరిగిన ఓ సంఘటన ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. మంగళవారం ఈ చిత్రం షూటింగ్‌లో కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్ పాల్గొన్నారు. చాలా కాలం తర్వాత కమల్‌హాసన్‌తో కలసి పనిచేస్తుండడంతో ఆనందంతో ఆయనను ఆలింగనం చేసుకున్నారు అమితాబ్. ఈ ఫొటోలను తన బ్లాగ్‌లో షేర్ చేశారు. 'గిరఫ్తార్' తర్వాత దాదాపు 40 ఏళ్లకు వీరిద్దరూ కలసి నటిస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్.

నాని కొత్త చిత్రం 'బ్లడీ రోమియో'

వరుస బ్లాక్‌బస్టర్ చిత్రాలతో దూసుకుపోతున్న హీరో నాని, 'ఓజీ' దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రూపుదిద్దుకుంటోంది. నిహారికా ఎంటర్‌టైన్‌మెంట్, యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి మేకర్స్ 'బ్లడీ రోమియో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మంగళవారం నాని పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక వీడియోను విడుదల చేసి టైటిల్‌ను ప్రకటించారు. 'చిటికెడు కరుణ, పిడికెడు కోపం, బారెడు బీభత్సం..మతిపోయేంత ప్రేమ' అంటూ ఓ వంటకాన్ని తయారు చేయడం చూపిస్తూ హీరో పాత్రను పరిచయం చేశారు. ఈ వేసవిలో షూటింగ్ ప్రారంభం అవుతుంది.



జడలురోయ్.. హడలురోయ్..

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న బిగ్గెస్ట్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్' చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'ఆయా షేర్'ను మంగళవారం విడుదల చేశారు. షేర్ రాకను సూచిస్తూ కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను తెలంగాణ జానపద గాయకులు అడ్డుల జంగిరెడ్డి, ఆకునూరి దేవయ్య పాడారు. జడలతో కూడిన హెయిర్ స్టైల్, గడ్డంతో నాని రగ్గడ్ లుక్ ఆకట్టుకున్నాయి. అనిరుధ్ రవిచంద్రన్ అందించిన సంగీతం హైలైట్‌గా నిలిచింది. ఈ సినిమా ఆగస్టు 21న విడుదల కానుంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.

ది కేరళ స్టోరీ2 వివాదం

● సినిమాను కోర్టుకు చూపించబోమన్న మేకర్స్



సంచలన విజయం సాధించి జాతీయ అవార్డులు దక్కించుకున్న 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు ముందు తీవ్ర వివాదాల్లో చిక్కుకుంది. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం విడుదలను నిలిపివేయాలని కేరళ హైకోర్టులో పిటిషన్లు దాఖలు కావడంతో ఉత్కంఠ నెలకొంది. బలవంతపు మత మార్పిళ్ల నేపథ్యంలో తెరకెక్కిన 'ది కేరళ స్టోరీ 2' సినిమాను విడుదలకు ముందు బుధవారం నాడు తమకు ప్రదర్శించాలని కేరళ హైకోర్టు ఆదేశించగా, అందుకు చిత్రబృందం నిరాకరించింది. అంతేకాకుండా టీజర్‌ను కూడా తొలగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో కోర్టు ఈ వ్యవహారంపై తదుపరి విచారణను నేటికి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాలపై నిర్మాతల తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్లు ప్రజా ప్రయోజన వ్యాజ్యం కిందకు వస్తాయా?, లేదా ప్రైవేట్ లిటిగేషన్ కిందకు వస్తాయా అనేది ముందుగా తేల్చాలని కోర్టును కోరారు. ప్రదర్శన ఏర్పాటు చేసే విషయంపై కేంద్ర ప్రభుత్వంతో పాటు నిర్మాతలు తమ వైఖరిని తెలపాలని సూచిస్తూ కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.

సెట్స్‌పై శరవేగంగా షూట్స్







ఒకప్పుడు అభిమానులను అలరించేందుకు వరుస సినిమాలతో బాక్సాఫీస్ బరిలో ఉండేవారు అగ్రహీరోలు. ఇటీవలే ఊపందుకున్న పాన్ ఇండియా ట్రెండ్ పుణ్యమా అని సంవత్సరానికి లేదా రెండు సంవత్సరాలకు ఒక చిత్రంతో ప్రేక్షకులను పలకరిస్తున్నారు. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో చిత్రీకరణలో ఉన్న పలువురు టాలీవుడ్ అగ్రహీరోల షూటింగ్ అప్డేట్స్.

ఇటీవలే విడుదలైన రాజాసాబ్‌తో ప్రేక్షకులను పలకరించారు ప్రభాస్. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్', 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ చిత్రాల్లో నటిస్తున్నారు. వీటిలో ముందుగా విడుదలయ్యే సినిమా 'ఫౌజీ'. పీరియాడిక్ కథాంశంగా హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే 75 శాతం పూర్తైంది. కేవలం కొన్ని కీలక సన్నివేశాల షూట్ మాత్రమే మిగిలి ఉండడంతో వాటిని అతి త్వరగా పూర్తి చేసి.. సినిమాను దసరా సందర్భంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో దేశం కోసం పోరాడే సైనికుడి పాత్రలో ప్రభాస్ కనిపించనున్నట్లు సమాచారం. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆయన నటిస్తున్న 'స్పిరిట్' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. వచ్చే ఏడాది మార్చి 5న విడుదలవుతోంది. ఇప్పటికే 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ చిత్రీకరణ ప్రారంభం అయింది. త్వరలోనే తను నటించే సన్నివేశాల చిత్రీకరణలో భాగం అవ్వనున్నారు ప్రభాస్.

సగ భాగం పూర్తి

మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రం ఇప్పటికే 50 శాతం షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. ఇందులో సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలు, పోరాట ఘట్టాలను చిత్రీకరించారు మేకర్స్ ప్రస్తుతం ఈ చిత్రం ద్వితియార్థానికి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రానికి వీఎఫ్ఎక్స్ వర్క్ ఎక్కువగా ఉండడంతో ఎంత వీలైతే అంత తొందరగా షూటింగ్‌ను పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో రుద్ర పాత్రలో కనిపించనున్నారు మహేశ్‌బాబు. వచ్చే ఏడాది ఉగాది సందర్భంగా ఏప్రిల్ 7న 'వారణాసి' విడుదలవుతోంది.

కీలక సన్నివేశాలు పూర్తి

అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ తెరకెక్కిస్తున్న 'ఏఏ 22.. అట్లీ6' సినిమా షూటింగ్ 40 శాతం పూర్తైంది. ఇందులో సినిమాకు సంబంధించిన అత్యంత కీలకమైన సన్నివేశాలు ఉన్నాయి. మోషన్ క్యాప్చర్ ఆధారంగా తెరకెక్కిన ఆ సన్నివేశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతాయని మేకర్స్ తెలిపారు. త్వరలోనే మిగతా చిత్రీకరణను పూర్తి చేసి వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఇందులో పలు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారు అల్లు అర్జున్. సైన్స్ ఫిక్షన్ కథాంశంతో అత్యాధునిక సాంకేతికతతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో నటిస్తూనే లోకేశ్ కనగరాజ్ చిత్రంలో నటించడానికి పచ్చజెండా ఊపారు ఆయన. త్వరలోనే ఈ సినిమాను ప్రారంభించనున్నారు. అత్యంత భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

వేసవి బరిలో...

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' ఏప్రిల్ 30న విడుదలవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ దాదాపు ఇప్పటికే పూర్తయ్యింది. కేవలం కొంత టాకీ పార్ట్, ప్యాచ్ వర్క్, ఒక ప్రత్యేక గీతం బ్యాలెన్స్ ఉన్నాయి. వీటిని కూడా అతి త్వరగా పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. క్రికెట్ క్రీడ నేపథ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఇందులో రామ్‌చరణ్ కెరీర్‌లో ఎప్పుడు కనిపించనంత మాస్ లుక్‌లో కనిపించనున్నారు. అలాగే త్వరలోనే సుకుమార్ దర్శకత్వంలో ఆయన నటించనున్న చిత్రం ప్రారంభం కానుంది.

కొత్త షెడ్యూల్‌లో..

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎన్టీఆర్ 31' వర్కింగ్ టైటిల్. నీల్ గత చిత్రాలు 'కేజీఎఫ్', 'సలార్' తరహాలోనే ఈ చిత్రం కూడా శక్తిమంతమైన కథతో తెరకెక్కుతోంది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తైంది. త్వరలోనే హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించనున్నారు. ఈ చిత్రం కోసం తన లుక్ పరంగా పూర్తిగా మేకోవర్ అయ్యారు ఎన్టీఆర్. జూన్ 25న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్.



విటోపియా 2026లో భాగంగా నిర్వహించిన సంగీత విభావరి

వీఐటీ-ఏపీలో ముగిసిన 'విటోపియా'

» విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య నిర్వహణ

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని వీఐటీ-ఏపీ యూనివర్సిటీలో గత నాలుగు రోజుల నుంచి జరుగుతున్న 'విటోపియా 2026' ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సాహభరిత పోటీలు, ఉర్రూతలూగించే ప్రదర్శనలు, విద్యార్థుల కేరింతలు, తుళ్లింతలతో సాగిన ఈ ఉత్సవ సంరంభం విజయవంతమైనట్టు వీఐటీ నిర్వాహకులు ప్రకటించారు. ఈ ఉత్సవం వీఐటీ-ఏపీ క్యాంపస్‌లోని విద్యార్థులను ఒకేచోట చేర్చి ప్రతిభ, సమష్టి కృషి, సృజనాత్మకతను చాటి చెప్పింది. చివరి రోజు మంగళవారం వివిధ సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న వారు బహుళ కళాత్మక విభాగాల్లో అసాధారణమైన నైపుణ్యం, అభిరుచిని ప్రదర్శించారు. సోమవారం సాయంత్రం జరిగిన ప్రో-షోలో, దర్శన్ రావల్, మక్కా బ్యాండ్, తేరి మికో వంటి ప్రఖ్యాత కళాకారులు తమ సంగీత నైపుణ్యంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. చివరి రోజున శాస్త్రీయ సంగీత ద్వయం మోహన సిస్టర్స్, ఉత్సాహ భరితమైన పైనాపిల్ ఎక్స్‌ప్రెస్, ప్రముఖ ప్రదర్శనకారుడు డీజే పృథ్వీ, బ్యాండ్ సర్కిల్స్ వంటి అద్భుతమైన లైనప్ పాల్గొని గొప్ప సంగీత మహోత్సవాన్ని అందించారు. సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలతో పాటు విద్యార్థులు ఉత్సాహంగా పిల్లో ఫైట్, సాక్ రేస్, విస్పర్ ఛాలెంజ్, మ్యూజికల్ ఛైర్స్, బెలూన్ బర్స్ట్, ఆర్చరీ, రింగ్ టాస్ వంటి వివిధ రకాల వినోదభరితమైన కార్నివాల్ ఆటల్లో పాల్గొని పండుగ వాతావరణానికి ఉత్సాహాన్ని, ఆనందాన్ని జోడించారు. ఈ కార్యక్రమానికి వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.అరుల్మొళి వర్మన్, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ డాక్టర్ ఎస్.గోపీకృష్ణన్, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్ పాషా, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రరావు తదితరులు కూడా పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడును సత్కరిస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళన విరమణ

» డిమాండ్లపై సర్కారు సానుకూల నిర్ణయం

» జీతాలు 20 శాతం, గ్రాట్యుటీ 4 లక్షలకు పెంపు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగులు ఆందోళన విరమించారు. కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లపై స్పందించిన ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపింది. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, సహకారశాఖల మంత్రి అచ్చెన్నాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సహకారశాఖ కమిషనర్ అహ్మద్‌బాబు, ఆప్కాబ్ ఎండీ రామకృష్ణ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. పీఏసీఎస్ ఉద్యోగుల జీతాల 20శాతం పెంపును ఆమోదిస్తూ ఈ సందర్భంగా మంత్రి, అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గ్రాట్యుటీని రూ.2లక్షల నుంచి రూ.4లక్షలకు పెంచాలని, ప్రతి ఉద్యోగికీ రూ.5లక్షల గ్రూప్ ఆరోగ్య బీమా అమలు చేయాలని నిర్ణయించారు. ఉద్యోగుల విస్తృత ప్రయోజనాలపై త్వరలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి అచ్చెన్న ప్రకటించారు. అనంతరం ఉద్యోగ సంఘాల నేతలు విజయవాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

50 మంది స్పెషల్ డిప్యూటీ/డిప్యూటీ కలెక్టర్లు బదిలీలు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 50 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు/డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ మంగళవారం సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.బాపిరెడ్డిని ఏపీసీఆర్‌డీఏకు బదిలీ చేశారు. కడప జిల్లా ముద్దనూరు జీఎన్ఎస్ఎస్ యూనిట్-2లో పనిచేస్తున్న బీకే వెంకటేశ్వర్లును శ్రీకాళహస్తి దేవాలయం ఈవోగా నియమించారు. సింహాచలం ఎస్‌వీఎల్ఎన్ఎస్ దేవస్థానాల ల్యాండ్ ప్రొటెక్షన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.గీతాంజలిని ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ల్యాండ్స్)గా నియమించారు. పులిచింతల స్పెషల్ కలెక్టర్ పీఓగా ఉన్న ఆర్.రమేష్‌బాబును పాఠశాల విద్యాశాఖకు చెందిన ఎన్టీఆర్ జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా నియమించారు. విశాఖపట్నం హౌసింగ్ పీడీగా ఉన్న సీహెచ్.సత్తిబాబును విజయనగరం డీఆర్వోగా నియమించారు. చిత్తూరు డిజాస్టర్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ జిల్లా మేనేజర్ ఎం.అనుపమను నగరి ఆర్డీఓగా బదిలీ చేశారు. పీవీపీ మన్యంలో డీఆర్‌డీఏ పీడీగా ఉన్న సుధారాణి మాలతిని చీపురుపల్లి ఆర్డీఓగా నియమించారు.

9 మంది గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్

ఏపీపీఎస్సీ గ్రూప్-1 2023 నోటిఫికేషన్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైన 9 మందికి డిప్యూటీ కలెక్టర్లుగా పోస్టింగ్‌లు ఇస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

తిరుపతిలో స్టేట్ డేటా సెంటర్.. రూ.6.03 కోట్లతో స్థాపన

విపత్తుల నిరోధానికి తిరుపతిలో రాష్ట్ర డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బిల్డ్ ఆన్ ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ విధానం (బూట్)లో రూ.6.03 కోట్లతో ఈ డేటా సెంటరును స్థాపించాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నిర్ణయించింది. ఈమేరకు ఐటీ శాఖ కార్యదర్శి (ఎఫ్ఏసీ) యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గనులు, భూగర్భశాఖ డైరెక్టర్‌గా చంద్రశేఖర్

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గనులు, భూగర్భశాఖ డైరెక్టర్‌గా డబ్ల్యూ.బి.చంద్రశేఖర్ నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎఫ్ఏసీ) ముకేశ్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఎస్టీయూ సమర శంఖారావం

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలపై సమర శంఖారావం పేరుతో బుధవారం విజయవాడలో ధర్నా చేపడుతున్నట్టు రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయి శ్రీనివాస్ తెలిపారు.

జగన్ కోసం 'ఆత్మాహుతి దళం' అవుతాం: ధర్మాన కృష్ణదాసు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ దాడులను తిప్పి కొట్టేందుకు మా నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోసం ఆత్మాహుతి దళంలా పని చేస్తామని వైసీపీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాసు అన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్డులో టీడీపీ వర్గాల దాడిలో దెబ్బతిన్న మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిని ఆయన మంగళవారం పరిశీలించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం అని చెప్పి ఇలాంటి దాడులను ప్రోత్సహించడం దారుణమన్నారు.

కోర్టులకు మళ్లీ బాంబు బెదిరింపులు

అనంతపురం క్రైం/పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు కోర్టులకు మరోమారు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. అనంతపురం జిల్లా కోర్టు, ఉరవకొండ కోర్టు,, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం అదనపు జిల్లా కోర్టు, కదిరి, పుట్టపర్తి జూనియర్ సివిల్, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులకు మంగళవారం ఉదయం రమీజా హుస్సేనీ పేరుతో హాట్ మెయిల్ నుంచి బెదిరింపు సందేశం పంపించారు. డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో వెళ్లి పోలీసులు తనిఖీలు చేశారు. పేలుడు పదార్థాలు ఏవీ లేక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అల్పపీడనం వెనక్కి..!

» చాలా అరుదంటున్న వాతావరణ నిపుణులు

» కోస్తా, సీమల్లో అక్కడక్కడా వర్షాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వెనక్కి పయనమైంది. మూడు రోజుల క్రితం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నైరుతి బంగాళాఖాతం వరకూ వచ్చింది. ఆ తర్వాత ఈశాన్యంగా దిశ మార్చుకుని సోమవారం మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. అక్కడి నుంచి తొలుత ఈశాన్యంగా ఆ తర్వాత తూర్పుగా పయనించి మంగళవారానికి తిరిగి ఆగ్నేయ బంగాళాఖాతంలో ప్రవేశించింది. రానున్న 24 గంటల్లో తూర్పుదిశగా పయనించి క్రమేపీ బలహీనపడనుంది. అల్పపీడనం ఏర్పడిన ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పయనమైన తర్వాత తిరిగి వెనక్కి రావడం అరుదుగా జరుగుతుంటుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు ఏర్పడగా.. అందులో ఒకటి శ్రీలంక సమీపాన బలహీనపడింది. మరొకటి ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి పశ్చిమ వాయవ్యంగా పయనించి తిరిగి దిశ మార్చుకుని అదే ఆగ్నేయ బంగాళాఖాతంలో ప్రవేశించడం వాతావరణంలో జరుగుతున్న మార్పులకు సంకేతమని ఆయన వ్యాఖ్యానించారు. ఇదిలావుండగా సోమవారం పశ్చిమ బెంగాల్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు విస్తరించిన ఉపరితల ద్రోణి.. మంగళవారానికి పశ్చిమ బెంగాల్ నుంచి ఒడిశా వరకు కొనసాగుతోంది. దీని ప్రభావంతో సముద్రం నుంచి తేమగాలులు వీస్తూ వాతావరణ అనిశ్చితి నెలకొని కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

శ్రీమఠానికి నవరత్న కవచం

50 కిలోల రజత శేష వాహనాన్ని బహూకరణ

మంత్రాలయం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఓ భక్తుడు 50 కిలోల వెండి శేష వాహనం, సుమారు రూ.కోటిన్నర నవరత్న కవచాన్ని బహూకరించినట్టు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మఠం అధికారులు తెలిపారు. బెంగళూరుకు చెందిన సంపత్ కుమార్ శెట్టి అనే భక్తుడు.. మూలరాములుకు రజత శేష వాహనం, పూర్వ పీఠాధిపతి సుజయీంద్రతీర్థుల బృందావనానికి నవరత్న కవచాన్ని బహూకరించినట్టు వెల్లడించారు. నవరత్న కవచాన్ని సుజయీంద్ర తీర్థుల బృందావనానికి అలంకరించి పీఠాధిపతి హారతులు ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి భక్తుడి కుటుంబాన్ని ఆశీర్వదించారు.



సుజయీంద్రతీర్థుల బృందావనానికి నవరత్న కవచాన్ని అలంకరించిన దృశ్యం



50 కిలోల వెండితో తయారు చేయించిన శేష వాహనం

నీటి కేటాయింపులపై ట్రైబ్యునల్ పాత్ర నామమాత్రమే!

ప్రాజెక్టుల వారీగా కేటాయించే అధికారం దానికి లేదు: ఏపీ

» తెలంగాణ వాదనలు అపరిపక్వం, అనాలోచితం వాటిని పరిగణనలోకి తీసుకోవద్దు

» రాజధాని అమరావతి పరిధి 217 చకిమీ మాత్రమే 8,603 చకిమీగా ఉందనడం నిజం కాదు

» హైదరాబాద్ పట్టణీకరణపై తెలంగాణ చేస్తున్న వాదనల్లోనూ వాస్తవం లేదు

» బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల స్పష్టీకరణ

» తదుపరి విచారణ మార్చి 23, 24 తేదీలకు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నీటి కేటాయింపులపై ట్రైబ్యునల్ పాత్ర నామమాత్రంగానే ఉంటుందని ఆంధ్రప్రదేశ్ తెలిపింది. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేసే అధికారం దానికి లేదని స్పష్టం చేసింది. కృష్ణా జలాలపై తెలంగాణ చేస్తున్న అపరిపక్వ, అనాలోచిత, నిరాధార వాదనలను పరిగణనలోకి తీసుకోవద్దని కోరింది. ట్రైబ్యునల్ న్యాయసమ్మతంగానూ.. చట్టం మేరకు మాత్రమే జోక్యం చేసుకోగలదని తెలిపింది. పరిశ్రమలు, తాగునీరు, పర్యావరణానికి నదీ జలాలను తప్పనిసరిగా కేటాయించాలని స్పష్టం చేసింది. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి సంబంధించి విచారణ జరుపుతున్న బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా సారథ్యంలో సీనియర్ కౌన్సిల్ ఉమాపతి, న్యాయవాదులు ఎస్.సంజయ్, శరత్‌చంద్రతో కూడిన న్యాయవాద బృందం.. కృష్ణా డెల్టా సిస్టమ్ సాగునీటి అవసరాలపై వరుసగా రెండోరోజైన మంగళవారం కూడా తన వాదనలు కొనసాగించింది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదిలోకి ఎత్తిపోస్తున్నందున.. తమకు 105.9 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించాలన్న తెలంగాణ వాదనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించేందుకు వీల్లేదని తెలిపింది. 'గోదావరి జలాలను కృష్ణా నదిలోకి మళ్లించే పక్షంలో ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను పంచుకోవాలని గోదావరి ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. తమ ఒక్క రాష్ట్రానికే 105.9 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ కోరడంలో న్యాయం లేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక.. కుడి ప్రధాన కాలువ గుండా పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసే ప్రక్రియ నిలిచిపోతుంది. అయినా ఈ అంశం బ్రిజేశ్ ట్రైబ్యునల్ పరిధిలోకి రాదు' అని తెగేసిచెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా తీరంలో నగరీకరణ కారణంగా కృష్ణా జలాలను తమకు అధికంగా ఇవ్వాలన్న తెలంగాణ వాదన కూడా న్యాయసమ్మతం కాదని తెలిపింది. 'రాజధాని అమరావతి నగరం పరిధిని 217 చదరపు కిలోమీటర్ల వరకే ప్రకటించారు. కానీ 8,603 చదరపు కిలోమీటర్లుగా ఉందన్న పొరుగు రాష్ట్రం వాదనలో నిజం లేదు. ప్రభుత్వం అధికారికంగా చేసిన ప్రకటననే పరిగణనలోకి తీసుకోవాలి. హైదరాబాద్ పట్టణీకరణపై తెలంగాణ చేస్తున్న వాదనల్లోనూ వాస్తవం లేదు. 10,472 చదరపు కిలోమీటర్ల మేర వ్యవసాయం తగ్గిపోయిందంటూ.. ఆ నీటిని పరిశ్రమలకు, తాగునీటికీ తరలించాలని చెబుతోంది. పులిచింతల రిజర్వాయరులోని నీటి పునఃపంపిణీ సాధ్యం కాదు. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువలు, మున్నేరు ద్వారా పులిచింతలకు 12 టీఎంసీల దాకా బదలాయిస్తున్నారన్న వాదనలోనూ నిజం లేదు. నీటి కేటాయింపులపై తెలంగాణ సూచించిన 30 అంశాలను పరిగణనలోకి తీసుకునేందుకు ఆస్కారమే లేదు' అని స్పష్టంచేసింది. అనంతరం ట్రైబ్యునల్ తదుపరి విచారణను వచ్చే నెల 23, 24 తేదీలకు వాయిదావేసింది.

శ్రీకాకుళంలో ప్రబలిన డయేరియా

» ఒకరి మృతి.. పలువురి పరిస్థితి విషమం

» కలుషిత నీరే కారణమని గుర్తింపు



డయేరియాతో మృతి చెందిన మండల సురేశ్

శ్రీకాకుళం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో డయేరియా ప్రబలింది. గత రెండు రోజుల్లో పదుల్లో కేసులు నమోదయ్యాయి. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందారు. మరికొందరి పరిస్థితి విషమంగా మారింది. నగరంలోని దమ్మలవీధి, గోల్కొండరేవు, కాకివీధి, సారంగడాల వీధి, ఎచ్చెర్లవారి వీధి, గుడివీధి, కుమ్మరివీధి, రంగిరేజు వీధుల్లో డయేరియా ప్రబలింది. కొద్ది రోజుల క్రితం మురుగు కాలువల్లో పూడికను యంత్రాలతో తొలగించారు. ఆ సమయంలో నగరపాలక సంస్థకు చెందిన పైపులైన్లు విరిగిపోయాయి. దీంతో నీరు కలుషితమైంది. మూడ్రోజుల నుంచి ఆయా ప్రాంతాల్లో పలువురు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు కేసుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. మంగువారి తోట ప్రాంతంలో కంద్రవీధికి చెందిన మండల సురేశ్(43) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో అధికార యంత్రాంగం ఒక్కసారి ఉలిక్కిపడింది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లా అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆసుపత్రులకు వెళ్లి రోగులను పరామర్శించారు. ఇప్పటి వరకు మొత్తం 60 డయేరియా కేసులు నమోదు అయ్యాయి. కాగా.. డయేరియాతో మృతి చెందిన మండల సురేశ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, తక్షణమే ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు పరిహారంగా అందజేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలియజేశారు.

మెరుగైన వైద్యం అందించండి: సీఎం ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో డయేరియా బాధితులందరికి మెరుగైన వైద్యం అందించాలని, వెంటిలేటర్‌పై ఉన్న ఇద్దరి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళంలో డయేరియా ఘటనపై మంగళవారం ఆయన సమీక్షించారు. జిల్లా అధికారులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని రోడ్డు మరమ్మతుల కారణంగా డయేరియా వ్యాపించిందని అధికారులకు సీఎంకు వివరించారు. ఈ ఘటనలో 65 మంది వివిధ ఆస్పత్రుల్లో చేరారని.. ఎనిమిది మంది డిశ్చార్జ్ అయ్యారని, ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో 55 మంది చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, ప్రస్తుతం వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామన్నారు. మరో 79 మందిలో డయేరియా లక్షణాలు గుర్తించామని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఆస్పత్రుల్లో చేరాల్సిన అవసరం లేదని గుర్తించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. వ్యాధి మరింత ప్రబలకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి లీగల్ క్లబ్స్

» ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో లీగల్ క్లబ్స్ నిర్వహించి విద్యార్థినుల సమస్యలను నమోదు చేసుకుని, కమ్యూనిటీ మహిళా రక్షణకు విద్యార్థులు వలంటీర్లుగా పనిచేసే విధానాన్ని తీసుకువస్తామని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ స్పష్టం చేశారు. క్యాంపస్ అంబాసిడర్ల కార్యక్రమ నిర్వహణపై రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో మంగళవారం మహిళా కమిషన్ అడ్వయిజరీ డైరెక్టర్ సూయజ్, ఉన్నత విద్య మండలి ఛైర్మన్ మధుమూర్తితో కలిసి ఆమె వర్చువల్ సమావేశం నిర్వహించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూలంకషంగా చర్చించారు. శైలజ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులు మహిళా కమిషన్ ఆధ్వర్యంలో పరిశోధనలు జరపాలని సూచించారు. పరిశోధనలు చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేస్తామని, ఈ సర్టిఫికెట్లు ఉద్యోగ నియామకాలు, కళాశాలల్లో సీట్లు సంపాదించడానికి రిజర్వేషన్లుగా పనిచేస్తాయని తెలిపారు.

మా కన్నీళ్లు ఇంకిపోయాయి

» ఈ నెల 27న ఆయేషా శరీర భాగాలతో పాటు సత్యం, న్యాయం, ధర్మాలనూ ఖననం చేస్తున్నాం

» దోషులకు శిక్షపడలేదన్న ఆవేదన నిద్రపోనివ్వట్లేదు

» చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌పైనే చివరి ఆశలు

» ఆయేషా మీరా సంస్మరణ దినంగా డిసెంబరు 27

» ఆమె పేరుపై ప్రభుత్వమే ట్రస్ట్ ఏర్పాటు చేయాలి

» సీఎం చంద్రబాబుకు ఆయేషా తల్లిదండ్రుల వినతి



ఆయేషా ఫొటోను చూపుతున్న తల్లిదండ్రులు ఇక్బాల్ బాషా, సంషాద్ బేగం,

తెనాలి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): "18 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తరువాత మాలో ఆశలు చచ్చిపోయాయి. కన్నీళ్లు ఇంకిపోయాయి. న్యాయం జరుగుతుందని ఏదో మూలన ఉన్న చిన్నపాటి ఆశ కూడా ఆవిరైపోయింది. మా కుమార్తె శరీర భాగాలను కూడా కోర్టులో పోరాడి తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నెల 27న వాటితో పాటు సత్యం, న్యాయం, ధర్మాన్ని కూడా పూడ్చిపెట్టబోతున్నాం" అంటూ ఆయేషా మీరా తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గుంటూరు జిల్లా తెనాలిలో ఆయేషా తల్లిదండ్రులు సంషాద్ బేగం, ఇక్బాల్ బాషా మీడియాతో మాట్లాడారు. ఇన్నేళ్ల పోరాటం తరువాత తమ నోటి వెంట వస్తున్న మాటలు చాలా సముచితమైనవేనని భావిస్తున్నామని తెలిపారు. తమ పోరాటం వృథా అయిపోయిందన్న బాధ కంటే తమ కుమార్తెను దారుణంగా హత్య చేసిన దోషులకు శిక్ష పడలేదన్న ఆవేదన నిద్రపోనివ్వడం లేదని వాపోయారు. ఈ కేసులో దోషులు తప్పించుకోవడానికి కీలక పాత్ర పోషించింది అధికారులేనని, వారిపై చర్యలు తీసుకునే విషయంలో కూడా న్యాయవ్యవస్థ ఇచ్చిన ఆదేశాలు అమలు కాకపోవడం కలచి వేస్తోందని పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా ఏదో ఒక మూల న్యాయం జరుగుతుందన్న ఆశ ఉండేదని, ఏళ్ల తరబడి విచారణ జరిపిన సీబీఐ నివేదికలోని దారుణాలు చూస్తే ఆ నమ్మకం కూడా పోయిందని అన్నారు. ఇస్లాం మతానికి వ్యతిరేకంగా ఖననం చేసిన మృతదేహం శరీర భాగాలను అప్పగించినా న్యాయం జరగకపోగా పది రోజుల్లో తామే ఆ భాగాలను అందిస్తామన్న సీబీఐ అధికారులు ఏడేళ్ల తరువాత మీరు వచ్చి తీసుకెళ్లమంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం చూస్తే బాధితులమైన తమపై కంటే నేరం చేసినవారిపై ఎంత ప్రేమ చూపించారో అర్థమవుతోందని ఆరోపించారు. తమ కుమార్తె శరీర భాగాలను అప్పగించేందుకు ఆదేశాలు ఇచ్చిన న్యాయమూర్తికి రుణపడి ఉంటామన్నారు. 27న వాటిని తెనాలి చెంచుపేట శ్మశాన వాటికలో ఖననం చేయనున్నట్లు చెప్పారు. దర్యాప్తు వ్యవస్థలన్నీ తమకు అన్యాయమే చేశాయని, చివరకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ వల్లే న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. తమ కుమార్తె హత్యకు గురైన డిసెంబరు 27ను ఆయేషా మీరా సంస్మరణ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ఆమె పేరుపై ప్రభుత్వమే ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇటువంటి బాధితులను ఆదుకోవాలని సీఎంకు ఆయేషా తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

విచారణార్హతపై ముందుగా వాదనలు వింటాం

ఆళ్ల రామకృష్ణారెడ్డికి హైకోర్టు స్పష్టీకరణ.. తదుపరి విచారణ మార్చి 10కి వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్ రింగ్ రోడ్ వ్యవహారంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టు ముందు విచారణకు వచ్చింది. సీఐడీ తరపున సీనియర్ న్యాయవాది మాధవ్ ఖురానా వాదనలు వినిపిస్తూ... ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. ఏసీబీ కోర్టులో ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేయాల్సిన పిటిషనర్ ఆ పని చేయకుండా బెయిల్ రద్దు పిటిషన్ వేశారన్నారు. ఇది సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి వ్యాజ్యం విచారణార్హతపై ముందుగా వాదనలు వింటానని రామకృష్ణారెడ్డికి స్పష్టం చేశారు. తదుపరి విచారణను మార్చి 10వ తేదీకి వాయిదా వేశారు. అంతకు ముందు రామకృష్ణారెడ్డి తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు సీఐడీని ప్రభావితం చేస్తున్నారన్నారు. కోర్టు విధించిన షరతులను ఉల్లంఘిస్తున్న నేపథ్యంలో బెయిల్ రద్దు కోరుతూ పిటిషన్ వేశామన్నారు. ఈ నెల 27న విజయవాడలోని ఏసీబీ కోర్టులో ప్రొటెస్ట్ పిటిషన్ వేయాల్సి ఉందని, పిటిషన్ దాఖలుచేస్తే ఏసీబీ కోర్టు కేసును మూసివేస్తుందని అన్నారు. బెయిల్ రద్దు కోసం తాము దాఖలు చేసిన పిటిషన్ నిరర్థకం అవుతుందన్నారు. సాధ్యమైనంత త్వరగా వ్యాజ్యంపై విచారణ జరపాలని కోరారు.



మృతి చెందిన లలిత

కొడుకు ఎదుటే ఉరి వేసుకున్న తల్లి

» భర్త కానిస్టేబుల్.. వేధింపులే కారణం

» అల్లుడిని ఉరి తీయాలని మృతురాలి తండ్రి డిమాండ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలో ఓ మహిళ తన కుమారుడి ఎదుటే ఉరి వేసుకుంది. భర్త వేధింపులే దీనికి కారణమని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మోహన్ కృష్ణ, లలిత(30) దంపతులు నగరంలోని ఆజాద్ నగర్‌లో నివసిస్తున్నారు. వీరికి ధర్మయోగి(8) అనే కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో లలిత మంగళవారం ఉదయం కుమారుడి ఎదుటే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అల్లుడి వేధింపుల కారణంగానే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని లలిత తండ్రి సాయిప్రసాద్ కన్నీటి పర్యంతమయ్యారు. అతనిపై సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశామని, రాత్రి మహిళా పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. 'అనంతపురం నుంచి మంగళవారం ఉదయం మా ఊరు ముచ్చుకోటకు బయలుదేరాం. శింగనమల వెళ్లేసరికి మా మనవడి నుంచి ఫోన్ వచ్చింది. తాతా.. అమ్మ ఉరివేసుకుంది అన్నాడు' అని సాయి ప్రసాద్ కంటతడి పెట్టుకున్నారు. మోహన్ కృష్ణ ఇతర మహిళలతో తిరుగుతూ, తన కూతుర్ని వేధించాడని చెప్పారు. తన పింఛన్ డబ్బుతో కూతురు ఇల్లు గడుపుతోందన్నారు. 'పెళ్లయినప్పటి నుంచి నా కూతురుకి నరకం చూపుతున్నాడు. వివాహేతర సంబంధం పెట్టుకుని వేధిస్తున్నాడు. అతనికి ఉరిశిక్ష వేస్తేనే నా కూతురు ఆత్మ శాంతిస్తుంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని నాలుగో పట్టణ సీఐ జగదీష్ తెలిపారు.

ఫ్యాషన్



వేసవి నెమ్మదిగా ప్రతాపాన్ని పెంచడం మొదలుపెట్టింది. కాబట్టి కాటన్ దుస్తుల కలెక్షన్ మొదలుపెట్టక తప్పదు. ఈ కాలంలో కాటన్ ఫ్రాక్స్ ఎంతో సౌకర్యంగా ఉంటాయి. జైపూర్ కాటన్, బగ్రు, కలంకారీ వస్త్రాలతో ఇవిగో ఇలాంటి ఫ్రాక్స్ డిజైన్ చేయించుకోండి.

కలర్‌ఫుల్ కాటన్ ఫ్రాక్స్

ప్రింటెడ్ కాటన్స్ ఈ కాలంలో ఎంతో సౌకర్యంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. అందుకోసం హ్యాండ్ బ్లాక్, లినెన్, బాగ్, మల్, బగ్రు, కాంతా, పిమా కాటన్ వస్త్రాలను ఎంచుకోవచ్చు. బజార్లో లెక్కలేనన్ని మోడల్స్‌లో రెడీమేడ్ ఫ్రాకులు దొరుకుతాయి. కానీ ఒంటికి అద్దినట్టు అందంగా కనిపించాలన్నా, ఎక్కువ కాలం మన్నాలన్నా స్వయంగా డిజైన్ చేయించుకోవాలి. సౌకర్యాన్ని బట్టి మోకాళ్ల వరకూ లేదా మోకాళ్ల కింది వరకూ ఫ్రాక్స్ కుట్టించుకోవచ్చు. మెడకు కాలర్, నడుముకు బెల్ట్‌తో దుస్తులకు మోడర్న్ లుక్ వస్తుంది. పొట్టి చేతులైనా, మోచేతుల వరకూ కుట్టించుకున్నా చూడముచ్చటగానే ఉంటుంది. ఫ్రాక్‌కు అదనపు హంగులు జోడించడం కోసం ఆకర్షణీయమైన బటన్స్ ఎంచుకోవచ్చు.

యాక్సెసరీస్ ఇలా...

- బూట్స్, శాండిల్స్, లోఫర్స్... ఫ్రాకులకు ఎలాంటి పాదరక్షలైనా చాలా బాగా నప్పుతాయి
- మెడలో హారాలు నప్పవు. కానీ లోనెక్ ఫ్రాక్ ధరించినప్పుడు మెడలో చైన్ వేసుకోవడం తప్పనిసరి
- చేతికి వాచ్ అదనపు ఆకర్షణ తెచ్చిపెడుతుంది, కానీ ఆ వాచ్ కచ్చితంగా బోల్డ్‌గా ఉండాలి
- కాటన్ ఫ్రాక్స్‌కు స్లింగ్ బ్యాగ్ చాలా బాగా సూటవుతుంది



కళ తెచ్చే సీలింగ్

ఇల్లు అందంగా కనిపించాలంటే గదుల 'సీలింగ్స్' ప్రత్యేకంగా ఉండాలంటున్నారు ఇంటీరియర్ డిజైనర్లు. ఇంటికి రాయల్ లుక్‌ని తెచ్చే సరికొత్త సీలింగ్ డిజైన్లు ఎన్నో అందుబాటులో ఉన్నాయి.

- సాఫ్ట్ కోవ్ లైటింగ్‌తో కూడిన ఫాల్స్ సీలింగ్.. ఇంటిని అందంగా మెరిపిస్తుంది. ఉడెన్ ప్యానెల్, మినిమల్ పీఓపీ, బ్యాక్‌లిట్, లేయర్డ్ సీలింగ్ లాంటి రకాలకు కూడా డిమాండ్ అధికంగా ఉంటోంది. పైకప్పు ఎత్తు తక్కువగా ఉన్నప్పటికీ ఇవి ఇంటిని హుందాగా మార్చేస్తాయి.



- మరీ ముదురు రంగులు కాకుండా గోధుమ రంగు షేడ్స్, బూడిద వర్ణం, ఇతర లేత రంగుల డిజైన్లు ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
- తక్కువ కాంతిని ఇచ్చే లైట్లు అమర్చిన సింగిల్ లేయర్ పెయింటింగ్ డిజైన్లు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఇవి ఇంటికి పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొస్తాయి.



- పడక గది కోసం సింపుల్ సీలింగ్ డిజైన్‌ను ఎంపిక చేసుకోవడం మంచిది. దీనివల్ల గది విశాలంగా కనిపించడంతోపాటు మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. హాయిగా నిద్ర పడుతుంది కూడా.
- ఎండీఎఫ్ ప్యానెల్స్‌తో కూడిన 3డీ డిజైన్లు, మెటాలిక్ ఫినిషింగ్ డిజైన్లు... ఇంటికి మోడరన్ లుక్‌ని అందిస్తాయి.
- ఎల్‌ఈడీ బల్బులతో కూడిన జ్యామితీ డిజైన్లు.. లివింగ్ రూమ్ అందాన్ని పెంచుతాయి.
- సౌండ్ ప్రూఫ్‌తో రూపొందించిన అకౌస్టిక్ సస్పెండెడ్ సీలింగ్... ఆఫీస్ రూమ్ ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది.
- వంటగది, బాత్రూమ్‌లకు పీవీసీ సీలింగ్ అనువుగా ఉంటుంది. ఇది తేమ నిరోధకంగా పనిచేస్తుంది కూడా.

దళిత, ఆదివాసీ మహిళలు, బాలికల సమస్యలపై గడ్డం ఝాన్సీది రెండు దశాబ్దాల పోరాటం. దళిత మహిళలపై హింస రూపం మారిందంటున్న ఝాన్సీ... 'దళిత స్త్రీ శక్తి' వ్యవస్థాపకురాలుగా వేల మంది బాధితులకు న్యాయం దక్కేలా పాటుపడుతున్నారు. ఈ ఏడాది ఇరవయ్యేళ్లు పూర్తి చేసుకున్న తమ సంస్థ ప్రస్థానం, లక్ష్యాల గురించి 'నవ్య'కు వివరించారు.

బాధితులకు 'పెద్దక్క'

"ప్రేమించేటప్పుడు అమ్మాయి కులం గుర్తుకురాదు కానీ పెళ్లిచేసుకోవాల్సి వచ్చినప్పుడు మాత్రం అబ్బాయిలు ముఖం చాటేస్తున్నారు. ఒకరు, ఇద్దరు కాదు... ప్రేమపేరుతో మోసపోయిన కొన్ని వందలమంది దళిత బాధితురాళ్ల పక్షాన 'దళిత స్త్రీ శక్తి' పోరాడుతోంది. ఈ ఇరవై ఏళ్లలో కనీసం నాలుగు వేల కేసులైనా ఇలాంటివి మా దగ్గరకు వచ్చి ఉంటాయి. 'ప్రేమిస్తున్నా'మంటారు! మాయమాటలు చెప్పి దగ్గరవుతారు. అమ్మాయి నెల తప్పిందని తెలియగానే పారిపోతారు. "కడుపులో బిడ్డ సంగతేమిటి?" అని నిలదీస్తే... "మాకు సంబంధం లేదు' అని తిరిగి ఆ అమ్మాయి వ్యక్తిత్వం మీద బురద జల్లుతారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి కేసులు బాగా పెరిగాయి. "పోనీ 'వద్దు' అనుకున్నవాడిని మరచిపోయి హాయిగా కొత్త జీవితాన్ని ప్రారంభించండి" అని అమ్మాయిలకు ఎంత నచ్చజెప్పినా... వాళ్లు ససేమిరా ఒప్పుకోరు. "చచ్చినా బతికినా ప్రేమించినవాడితోనే" అంటూ మొండికేస్తారు. ప్రేమ పేరుతో మోసపోయిన ఒక అమ్మాయి తనకు బిడ్డ పుట్టినప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఇప్పుడు ఆ పిల్లాడు ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. డీఎన్ఏ రిపోర్టుల్లాంటివి అన్నీ ఉన్నా... ఆ అమ్మాయికి ఇంతవరకు న్యాయం దక్కలేదు. మోసగాడు మాత్రం మరొక పెళ్లిచేసుకొని సుఖంగా జీవిస్తున్నాడు. తన బిడ్డకు తండ్రి ఉన్నాడని లోకానికి చాటాలన్నది ఆ తల్లి తాపత్రయం. ఇంకొందరు అబ్బాయిలు కుటుంబాన్ని ఎదిరించి కులాంతర వివాహం చేసుకుంటారు. కొన్నాళ్ల తర్వాత భార్యను కులం పేరుతో తిడుతూ నానా హింసలు పెట్టి ఇంటి నుంచి వెళ్లగొడతారు. సాధారణ మహిళలు లింగ వివక్షను మాత్రమే ఎదుర్కొంటూ ఉంటే... కుల, లింగ వివక్షలను నిత్యం ఇంట, బయట పంటిబిగువున భరిస్తూ బతుకెళ్లదీస్తున్న దళిత, ఆదివాసీ మహిళలు ఎంతో మంది. అలాంటి వారికి మేము అండగా నిలుస్తున్నాం.



అందుకే 'దళిత స్త్రీ శక్తి'

దళిత మహిళలకు కుటుంబంలో ఎదురయ్యే హింసాత్మక ఘటనలు కొన్ని కళ్లారా చూశాను. వీటిపై దళిత హక్కుల ఉద్యమకారులుసైతం నోరు మెదపకపోవడం నాకు ఆశ్చర్యం కలిగించింది. పితృస్వామ్యానికి ఎవరూ అతీతులుకాదన్నది నాకు అప్పుడు అర్థమైంది. అంతకు ముందు నుంచీ దళితుల పక్షాన పని చేస్తూ ఉమ్మడి ఏపీలోని అన్ని జిల్లాలు పర్యటించాను. కడపలో పోరాడిమరీ దళితులకు భూమి పంపిణీ చేయించగలిగాను. ఆ అనుభవంతో దళిత, ఆదివాసీ మహిళలు, బాలికల అభ్యున్నతి లక్ష్యంగా 2006లో 'దళిత స్త్రీ శక్తి' ప్రారంభించా. మా దగ్గరకు వచ్చే బాధితులంతా నిరుపేదలు. కులం, ధనం అండ లేనివాళ్లు. చాలా సందర్భాల్లో హింసకు పాల్పడుతున్న వారంతా ధనికులు, ఆధిపత్య కులాలకు చెందినవారే. అలాంటివారిని ఢీకొని బాధితులకు అండగా నిలవడమే మా కర్తవ్యం.

పెద్ద యుద్ధమే చేయాల్సివస్తోంది

దళిత మహిళలను వ్యక్తులుగా, శక్తులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో 'దళిత స్త్రీశక్తి' ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 11 జిల్లాల్లో చాలా చురుగ్గా పనిచేస్తోంది. 'గ్రామాల్లో మహిళా కలయిక నాయికల సంఘాలు' ఏర్పాటు చేసి చట్టాలు, హక్కులతో పాటు విద్య, ఆరోగ్యాభివృద్ధి వంటి ప్రాథమిక విషయాలమీద అవగాహన కల్పిస్తున్నాం. కృష్ణా జిల్లాలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి ఘటనలో 'దళిత స్త్రీశక్తి' జోక్యం చేసుకొనే వరకు పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేయని దుస్థితి. కొన్ని కేసుల్లో అయితే పోలీసులతో మేము పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. అత్యాచారాలు, హత్యలు లాంటి 1,300కుపైగా మేజర్ కేసుల్లో బాధితురాళ్ల పక్షాన న్యాయస్థానాల్లో పోరాడుతున్నాం. అందులో పోక్సో కేసులు కూడా వందకుపైగా ఉంటాయి. ప్రేమ పేరుతో మోసాలు, కులోన్మాద దాడులు, గృహహింస, ఇతర వేధింపులకు సంబంధించి 13,909 కేసుల పరిష్కారం నిమిత్తం బాధితుల పక్షాన 'దళితస్త్రీ శక్తి' పెద్దక్కగా ఉద్యమిస్తోంది. అలాగే ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాధికారులు, న్యాయనిపుణుల సమక్షంలో కొన్ని కేసులపై లీగల్ క్లినిక్ నిర్వహిస్తున్నాం. బాధితురాళ్ల కోసం ప్రత్యేకంగా మానసిక ఆరోగ్య శిబిరాలు, కౌన్సెలింగ్ తరగతులు ఏర్పాటు చేస్తున్నాం. అత్యాచార బాధితురాళ్లకు పునరావాస కల్పన, ఆర్థిక పరిహారం అందించడం లాంటి విషయాల్లో ముందుండి పని చేస్తున్నాం. ఇప్పటివరకు అయిదు కోట్ల రూపాలయకు పైగా పరిహారాన్ని బాధితులు లేదా బాధితుల కుటుంబ సభ్యులకు ఇప్పించగలిగాం.

బెదిరింపులు సాధారణమే

పోరాటంలోకి దిగిన తర్వాత కొన్ని సందర్భాల్లో ప్రాణాలను కూడా లక్ష్యపెట్టలేం. గుంటూరులో ఒక హత్య కేసులో బాధిత కుటుంబం పక్షాన పోరాడుతున్న సమయంలో నాకు వరుసగా వారం- పది రోజులు 'చంపేస్తాం, నరికేస్తాం' అంటూ బెదిరింపు ఫోన్లు వచ్చాయి. అయినా వెనక్కి తగ్గలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఓ గ్రామంలో భూమి తగాదా కారణంగా ఆధిపత్య కులానికి చెందిన కొందరు... దళితులను కర్రలతో కొట్టారు. ఆ పక్కనే మరొక గ్రామంలో దళితులు గణేష్ నవరాత్రుల్లో వేలంపాట ద్వారా లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారన్న అక్కసుతో ఆధిపత్య వర్గాలు దాడికి తెగబడ్డాయి. పోలీసులు నిందితులపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా శాంతి చర్చల (శాంతి కమిటీ ఏర్పాటు)కు పిలిచారు. నేనూ వెళ్లాను. "రాజీ కుదుర్చుకుందాం! అయితే దెబ్బలు తిన్న నా దళిత బిడ్డలు కూడా కర్రలతో అవతలివాళ్లను కొడతారు. చెల్లుకు చెల్లు. అప్పుడు పీస్ కమిటీ ఏర్పాటు చేద్దాం" అన్నాను. అప్పుడు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత 'దళిత స్త్రీ శక్తి' ఆ రెండు గ్రామాల్లో సామాజిక సమానత్వం, అంబేద్కర్ ఆలోచనలపై సమావేశాలు నిర్వహించింది. ఇప్పుడు రెండు గ్రామాల్లోని ఇరువర్గాలు కలిసిమెలిసి జీవిస్తున్నారు. ఊరి నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆవిష్కర్తగా ఇరు గ్రామస్తులు నన్ను ఆహ్వానించినప్పుడు చాలా సంతోషం కలిగింది.

చట్టాలపై అవగాహన

కులవివక్ష కాలంతో పాటు కొత్తరూపాలు సంతరించుకుంది. అది బయటకు కానరాకుండా చాలా బలంగా సమాజం మీద ప్రభావం చూపిస్తోంది. ప్రేమ పేరుతో మోసాలు అందుకు నిదర్శనం. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలపై అత్యాచార నిరోధక చట్టంతో పాటు గృహహింస, వరకట్ననిషేధ చట్టం వంటివాటిపై పోలీసులకు కనీస అవగాహన ఉండడంలేదని మా అనుభవంలో గ్రహించాం. అలాంటప్పుడు ఇక బాధితులకు న్యాయం ఎలా దక్కుతుంది.? అందుకే దళిత, ఆదివాసీ మహిళలకు చట్టాలు, రాజ్యాంగంపై సరైన అవగాహన కల్పించాలన్న సంకల్పంతో తెలుగులో 'మన చట్టాలు', 'సంక్షిప్తంగా రాజ్యాంగం' తదితర పుస్తకాలు ప్రచురించి పల్లెల్లో పంచుతున్నాం. దళిత, ఆదివాసీ బాలికలు, మహిళలు సర్వతోముఖాభివృద్ధిని, ఆర్థిక స్వాతంత్రాన్ని సాధించాలి. సామాజిక అవగాహనతో అవరోధాలు దాటి ముందుకు వెళ్లాలి. అదే 'దళిత స్త్రీ శక్తి' ప్రధాన లక్ష్యం. అందుకోసం నా చివరి శ్వాసవరకు పని చేస్తాను."

• సాంత్వన్
ఫొటో: జ్వాలా కోటేశ్

పిల్లలు బిజీగా..!

వీకెండ్ సెలవులు వచ్చాయంటే చాలు పిల్లలు చేసే అల్లరితో తల్లిదండ్రులకు తలనొప్పి తప్పదు. అలాంటప్పుడు పిల్లల దృష్టిని మరల్చి వారిని బిజీగా ఉంచే ఏర్పాటు చేస్తే సరి. అదెలాగంటే...

- **కలరింగ్:** పిల్లలకు డ్రాయింగ్ బుక్స్, కలర్ పెన్సిల్స్, క్రేయాన్స్, స్కెచ్ పెన్స్ లాంటివి ఇచ్చి బొమ్మలకు రంగులు వేయమని చెప్పాలి. ఇది పిల్లలు బాగా ఇష్టపడే అంశం కూడా. దీనివల్ల పిల్లల్లో ఏకాగ్రత, సృజనాత్మకత పెరుగుతాయి.
- **కథలు:** బొమ్మల కథలు పిల్లలకు బాగా నచ్చుతాయి. అలాంటి కథల పుస్తకాలు తెచ్చి పిల్లలతో కలిసి కూర్చుని చదవాలి. కొద్దిసేపటి తరువాత వారే స్వయంగా చదవడానికి ఆసక్తి చూపిస్తారు. దీనివల్ల పిల్లల్లో ఊహా శక్తి పెరుగుతుంది.



- **బ్లాక్స్:** రంగురంగుల బిల్డింగ్ బ్లాక్స్ తెచ్చి వాటితో ఇల్లు, గుడి, బడి లాంటివి కట్టడం ఎలాగో చూపిస్తే చాలు. రోజంతా అదే పనిలో ఉంటారు పిల్లలు. పజిల్ గేమ్స్ ఆడించినా పిల్లల మేధాశక్తి మెరుగుపడుతుంది.
- **బొమ్మల తయారీ:** బంకమట్టి లేదంటే క్రాఫ్ట్ క్లేతో రకరకాల బొమ్మలు తయారుచేయడం, వాటికి రంగులు వేయడం నేర్పిస్తే పిల్లలు ఇష్టంగా నేర్చుకుంటారు. వీటివల్ల పిల్లల మెదడు చురుకుగా మారుతుంది. కండరాలు బలోపేతమవుతాయి.
- **తోటపని:** మొక్కలకు నీళ్లు పోయడం, ఎండిన ఆకులతోపాటు కొమ్మలను తొలగించడం, కుండీల్లో మట్టిని మార్చడం లాంటి చిన్న చిన్న పనులను పిల్లలచేత చేయించవచ్చు.
- **కళలు:** పాటలు పాడడం, డ్యాన్స్ చేయడం, ఏదైన మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్ (వీణ, కీ బోర్డ్, వయొలిన్ లాంటివి) ప్లే చేయడం లాంటివి నేర్చుకునే అవకాశం కల్పించినా ప్రయోజనం ఉంటుంది.



కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్న పౌరులు, మృత్యువాత పడుతున్న మూగజీవాలు... ఈ పరిస్థితి చూసి చలించిపోయారు బత్తుల నీలిమ. సాధారణ సైన్స్ టీచర్ అయిన ఆమె పర్యావరణం కోసం, మెరుగైన సమాజం కోసం తన వంతు ప్రయత్నం ప్రారంభించారు. ఇటీవల 'దక్షిణ భారత సైన్స్ ఫెయిర్'లో ప్రత్యేక బహుమతి అందుకున్న ఆమె...పర్యావరణ పరిరక్షణలో బడిపిల్లలను భాగస్వాములుగా చేసి భావితరాలను ప్రకృతి సంరక్షకులుగా మార్చుతున్నారు. ఆ విశేషాలు 'నవ్య'కోసం...

కాలుష్యం లేని రేపటి కోసం

యుక్త వయసు నుంచే కాలుష్యంపై పోరాడాలనే సంకల్పం తీసుకున్నారు బత్తుల నీలిమ. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఆమె తండ్రి కార్మిక సంఘాల నాయకుడు బత్తుల సామ్యేల్ దీనికి స్ఫూర్తి అని ఆమె చెబుతారు. 2002లో ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టిన ఆమెను కళ్ళ ఎదుటే కలుషితమైపోతున్న వాతావరణం కలవరపెట్టింది. "మన చుట్టూ కాలుష్యం కోరలు చాచడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్లాస్టిక్ కారణంగా పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇదంతా నాకు ఎంతో వేదన కలిగించింది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్ తరాల పరిస్థితి ఇంకా అధ్వానంగా ఉంటుంది. అందుకే పర్యావరణ పరిరక్షణ కోసం, మెరుగైన సమాజం కోసం ఏదైనా చెయ్యాలనుకున్నా. దీనికి నా భర్త అంజిబాబు కూడా సహకారం అందించారు" అని చెబుతున్నారు నీలిమ. ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని... సుస్థిరమైన అభివృద్ధి సాధించవచ్చనీ, వాటితో సహజసిద్ధంగా, ఆనందంగా జీవించవచ్చని అంటారామె. తాను సైన్స్ ఉపాధ్యాయినిగా పని చేస్తున్న బాపట్ల జిల్లా వేటపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు ఈ పాఠాలు ఆమె బోధిస్తున్నారు. ప్రకృతి పట్ల వారికి మక్కువ పెంచుతూ... మొక్కలు నాటిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాముల్ని చేస్తున్నారు.

పూలు కురిపిస్తూ స్వాగతం


ఇటీవల మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వివిధ దశల్లో సైన్స్ ఫెయిర్‌లు జరిగాయి. నీటిని, గాలిని కాలుష్యరహితంగా రూపుదిద్దడం, ప్రకృతి వనరులను స్థిరమైన అభివృద్ధికి దోహదం చేసేలా రూపుదిద్దడం తదితర అంశాలు ప్రధానంగా ఆమె ప్రాజెక్ట్‌ను సిద్ధం చేశారు. పలు దశల్లో విజయం సాధించిన ఆ ప్రాజెక్ట్... దక్షిణ భారత స్థాయిలో ప్రదర్శనకు ఎంపిక అయింది. గత నెల 23న తెలంగాణలో నిర్వహించిన 'దక్షిణ భారత సైన్స్ ఫెయిర్'లో వివిధ రాష్ట్రాలవారితో పోటీ పడి... ప్రత్యేక అవార్డు అందుకున్నారు. అనంతరం పాఠశాలకు వచ్చిన ఆమెకు విద్యార్థులు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఉన్నతాధికారులు, సహోపాధ్యాయులు ప్రశంసలతో ముంచెత్తారు. "భావి తరాలకు మంచి వాతావరణం ఉండాలనేదే నా కోరిక. దాని కోసం కృషి చేస్తాను. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిరోధానికి, కాలుష్య నివారణకు ఉద్యమిస్తాను" అంటున్నారు నీలిమ.



• తాళ్లూరి ప్రదీప్, చీరాల

జిడ్డు వేధిస్తోందా..?

జిడ్డు చర్మం ఉన్నవారికి ముఖంపై మొటిమలు, మచ్చలు ఎక్కువగా వస్తూ ఉంటాయి. వీటివల్ల ముఖ వర్చస్సు పాడవుతుంది. అలాకాకుండా ముఖంపై జిడ్డును తొలగించే చిట్కాలివే..!



- తేనె లేదంటే చల్లటి పాలను ముఖానికి అప్లయ్ చేసుకుని పావుగంట తరువాత మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే జిడ్డుకు కారణమైన సెబమ్ ఉత్పత్తి తగ్గుతుంది.
- రాత్రి పడుకునేముందు పలుచని రుమాలులో ఐస్‌క్యూబ్‌ను చుట్టి దానితో ముఖంపై సున్నితంగా రుద్దినా ఫలితం కనిపిస్తుంది.
- చిన్న గిన్నెలో గుడ్డులోని తెల్ల సొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో కొద్దికొద్దిగా తీసుకుంటూ ముఖమంతా రాయాలి. పది నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే జిడ్డు పూర్తిగా తొలగిపోతుంది. ముఖం తాజాగా కనిపిస్తుంది.
- జిడ్డుగా ఉందంటూ పదేపదే సబ్బు లేదా ఫేస్‌వాష్‌తో ముఖాన్ని కడుక్కోకూడదు. రోజుకు మూడుసార్లు ముఖంపై మంచినీటిని చిలకరించుకుని మెత్తటి టవల్‌తో అద్దుకుంటే చాలు.



కేరట్లు తాజాగా

కేరట్లు త్వరగా తేమను కోల్పోయి వడలిపోతూ ఉంటాయి. వీటిని ఫ్రిజ్‌లో ఉంచినప్పటికీ అంతగా ఫలితం కనిపించదు. కానీ చిన్న చిట్కాలతో కేరట్లు ఎక్కువ రోజులు తాజాగా ఉండేలా చేయవచ్చు.

- కేరట్లకు తొక్క తీసి శుభ్రంగా కడిగి వాటిని గాలి చొరబడని వెడల్పాటి కంటైనర్‌లో ఉంచాలి. అవి మునిగేవరకు మంచినీటిని పోసి ఫ్రిజ్‌లో ఉంచాలి. నాలుగు రోజులకోసారి నీళ్లు మారుస్తూ ఉండాలి. ఇలా చేస్తుంటే కొన్ని వారాలపాటు కేరట్లు గట్టిగా తాజాగా ఉంటాయి.
- కేరట్లకు తడి లేకుండా శుభ్రంగా తుడవాలి. ఆపైన న్యూస్ పేపర్ లేదా పేపర్ టవల్‌లో చుట్టి జిప్‌లాక్ కవర్లో భద్రపరచి ఫ్రిజ్‌లో ఉంచితే నెల రోజుల వరకు కేరట్లు తాజాగా ఉంటాయి. వారానికోసారి పేపర్లు మార్చడం మర్చిపోకూడదు.
- కేరట్లను పెద్ద సైజు ముక్కలుగా కోసి వేడినీటిలో వేసి రెండు నిమిషాలు ఉంచాలి. తరువాత వాటిని చల్లటి నీటిలో ముంచి పొడిగా ఆరబెట్టాలి. ఆపైన వీటిని ఫ్రీజర్ బ్యాగ్‌లో నిల్వ చేసుకోవచ్చు.
- కేరట్లను యాపిల్, అరటిపండ్లు, బంగాళదుంపలనుంచి దూరంగా ఉంచితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.
- గట్టిగా, ఎర్రగా, ప్రకాశవంతంగా ఉండే కేరట్లను మాత్రమే కొనుగోలు చేయాలి. వీటికి పైన ఉండే ఆకుపచ్చని భాగాలను చాకుతో కోసి తొలగించాలి. దీనివల్ల కేరట్లు తేమను కోల్పోకుండా ఉంటాయి.





మార్షల్ ఆర్ట్స్ ఇరగదీసిన చైనా రోబోలు!

బీజింగ్‌లో ఆకట్టుకున్న 49 రోబోల ప్రదర్శన

బీజింగ్, ఫిబ్రవరి 24: టెక్నాలజీ విషయంలో చైనా ప్రపంచ దేశాలకు దాటేస్తూ దూసుకెళ్తోంది. తాజాగా చైనా హ్యూమనాయిడ్ రోబోలు చేసిన మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనే అందుకు నిదర్శనం. ఇటీవల ముగిసిన చైనీస్ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బీజింగ్‌లోని టెంపుల్ ఆఫ్ హెవెన్‌లో 49 హ్యూమనాయిడ్ రోబోలు సింక్రొనైజ్డ్ మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాయి. చైనీస్ రోబో కంపెనీ యూనిట్రీ విడుదల చేసిన ఈ 40 సెకన్ల వీడియో.. రోబోలు పంచ్‌లు, కిక్‌లు ఇస్తూ.. అత్యంత కష్టమైన పల్టీలు కొడుతూ అద్భుతమైన టైమింగ్‌తో మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శించాయని గ్లోబల్ టైమ్స్ నివేదించింది. ఇవి ఏఐతో చేసినవి కాదు.. రోబోలు చేసిన నిజమైన షాట్లు.. అని పేర్కొంది. సోమవారం విడుదలైన ఈ వీడియోలో.. బీజింగ్‌లోని టెంపుల్ ఆఫ్ హెవెన్‌లోని హాల్ ఆఫ్ ప్రేయర్ ఫర్ గుడ్ హార్వెస్ట్ ముందు 49 జీ1 రోబోలు మార్షల్ ఆర్ట్స్‌ను ప్రదర్శించాయి. యూనిట్రీ జీ1 అనేది ఏఐ ఆధారితంగా రూపొందించిన మనిషిని పోలిన రోబో. ఇది చాలా చురుకుగా కదులుతుంది.

పట్టణ ఆవాస్ యోజన కింద కొత్తగా 2.88లక్షల ఇళ్లు మంజూరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-అర్బన్2.0(పీఎంఏవై-యూ:2.0)కింద కొత్తగా 2.88లక్షల ఇళ్లను కేంద్రం మంజూరు చేసింది. కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తాజాగా మంజూరు చేసినవాటితో కలిపి పీఎంఏవై-యూ:2.0 కింద మంజూరు చేసిన మొత్తం ఇళ్ల సంఖ్య 13.61లక్షలకు పెరిగింది. కేంద్రం తాజా నిర్ణయంతో 16 రాష్ట్రాలు లబ్ధి పొందనున్నాయి. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఉన్నాయి.

లోకం తీరు



తమిళనాట శశికళ కొత్త పార్టీ


పార్టీ జెండాతో శశికళ

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న వేళ.. రాష్ట్రంలో మరో కొత్త పార్టీ ప్రారంభమైంది. జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు శశికళ మంగళవారం కొత్త పార్టీని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. జయలలిత 78వ జయంతిని పురస్కరించుకుని రామనాథపురంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన ఆమె.. త్వరలోనే పార్టీ పేరును వెల్లడిస్తానని తెలిపారు. నలుపు, తెలుపు, ఎరుపు రంగులు గల పతాకంపై దివంగత సీఎంలు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చిత్రాలున్నాయి. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ మాజీ సీఎం పళనిస్వామి(ఈపీఎస్)పై తీవ్ర ఆరోపణలు చేశారు. తనకు, అన్నాడీఎంకేకు ద్రోహం తలపెట్టారని విమర్శించారు. "మేం తొందరపడి ఆయన్ను ముఖ్యమంత్రిగా ఎంచుకున్నాం. అప్పటికి ఆయన ఎలాంటి వ్యక్తో నాకు తెలియదు. ఆయన్ను నేను సీఎం కుర్చీలో కూర్చోపెడితే, నన్ను పార్టీ నుంచి తొలగిస్తూ తీర్మానం చేయించాడు" అని శశికళ పరోక్షంగా ఈపీఎస్‌పై నిప్పులు చెరిగారు. "నేను జైల్లో ఉన్నప్పుడు నా భర్త చనిపోతే అధికారులు 15 రోజులు పెరోల్ మంజూరు చేశారు. అయితే నాకు 5 రోజుల కంటే ఎక్కువ పెరోల్ ఇవ్వకూడదని ఉత్తర్వులు తెప్పించారు. నేను ముఖ్యమంత్రి చేసిన వ్యక్తి నాకే వెన్నుపోటు పొడిచాడు" అంటూ శశికళ భావోద్వేగానికి గురయ్యారు.

విదేశీ డ్రగ్ స్మగ్లర్ల బహిష్కరణ వేగవంతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: మాదకద్రవ్యాల కేసులు నమోదైన విదేశీ డ్రగ్ స్మగ్లర్ల బహిష్కరణను వేగవంతం చేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. చట్టపరమైన జాప్యాల కారణంగా వారు ఎక్కువ కాలం దేశంలో ఉండకుండా నిరోధించాలని, వీలైతే కొన్ని కేసుల్లో ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకొనే దిశగా చర్యలు తీసుకోవాలని కోరింది. కాగా, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) వార్షిక నివేదిక ప్రకారం.. 2024లో డ్రగ్స్ స్మగ్లింగ్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా 660 మంది విదేశీయులు అరెస్టయ్యారు. వీరిలో నేపాలీలు 203 మంది, నైజీరియన్లు 106 మంది, మయన్మార్ వాసులు 25 మంది, బంగ్లాదేశ్ పౌరులు 25 మంది ఉన్నారు.

నేటి నుంచి ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ప్రధాని మోదీ బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు, అమెరికా-ఇరాన్ మధ్య క్షీణిస్తున్న సంబంధాల నేపథ్యంలో జరుగుతున్న ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పర్యటనలో ఇందులో భాగంగా ఆ దేశ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు ప్రధాని నెతన్యాహు, అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌లతో మోదీ కీలక చర్చలు జరపనున్నారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్‌లో మోదీ ప్రసంగానికి సుప్రీంకోర్టు అధ్యక్షుడు యెట్‌ఝాక్ అమిత్‌ను ఆహ్వానించకపోతే ఆయన ప్రసంగాన్ని బహిష్కరిస్తామని ఆ దేశ ప్రతిపక్ష నేత యాయర్ లాపిడ్ హెచ్చరించారు. దీనిపై స్పందించిన స్పీకర్ అమీర్ ఓహానా.. ఆహ్వానం పంపే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. విపక్షాలు రాకపోతే ఆ సీట్లను మాజీ సభ్యులతో భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

ఇక పోలీసు పర్యవేక్షకుల సమక్షంలో రాష్ట్ర పోలీసు సిబ్బందికి విధుల అప్పగింత: ఈసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఇకపై పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద విధుల్లో ఉండే రాష్ట్ర పోలీసు సిబ్బందిని నియోజకవర్గాల్లో విధుల్లో ఉన్న కేంద్ర పోలీసు పరిశీలకుల సమక్షంలో ఎవరిని ఎక్కడికి పంపాలో (ర్యాండమైజేషన్) నిర్ణయించాలని ఎన్నికల సంఘం(ఈసీ) ఆదేశించింది. పారదర్శకతను పెంచే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పక్షపాత ధోరణిని నివారించేందుకు స్థానిక పోలీసులను వారి ప్రస్తుత స్టేషన్ ప్రాంతాలకు వెలుపల విధులు అప్పగించనున్నారు.

'భోజ్‌శాల' మసీదు ప్రాంతంలో ఆలయ ఆనవాళ్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల వివాదం కొత్త మలుపు తిరిగింది. భోజ్‌శాలలో కమల్ మౌలా మసీదు ఉన్న ప్రాంతంలో ప్రాచీన ఆలయాల ఆనవాళ్లను గుర్తించినట్టు భారతీయ పురావస్తు శాఖ తెలిపింది. వివాదాస్పద భోజ్‌శాల కాంప్లెక్స్‌ను హిందువులు వాగ్దేవి(సరస్వతి) ఆలయంగా, ముస్లింలు కమల్ మౌలా మసీదుగా భావిస్తున్నారు. అయితే, ప్రాచీన ఆలయాల శిథిలాలతోనే మసీదు నిర్మాణం జరిగిందనేందుకు ఆధారాలు లభించాయని పురావస్తు శాఖ తాజాగా తెలిపింది.

మతాన్ని వదులుకున్నట్లు రుజువులు ఇవ్వండి

- 'నో క్యాస్ట్.. నో రెలిజియన్' సర్టిఫికెట్ జారీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు స్పష్టీకరణ

చెన్నై, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'నో క్యాస్ట్.. నో రెలిజియన్' సర్టిఫికెట్ కావాలంటే ముందుగా మతాన్ని వదులుకోవాలని మద్రాస్ హైకోర్టు సూచించింది. తనకు 'నో క్యాస్ట్.. నో రెలిజియన్' సర్టిఫికెట్ జారీ చేయడానికి తిరుపత్తూర్ తహశీల్దారు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ చెల్లమాణిక్యం అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఇటీవల విచారణ చేపట్టింది. పిటిషనర్ మతాన్ని వదులుకున్నారా? అని ప్రశ్నించింది. లేదని సమాధానం ఇవ్వడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హిందూ ఆచారాల ప్రకారం పిటిషనర్ తన మతాన్ని వదులుకునే వరకు ఆయన అభ్యర్థనను అధికారులు పరిగణనలోకి తీసుకోలేరని స్పష్టం చేసింది. మతాన్ని వదులుకోకుండా, మతాన్ని వదులుకున్నట్లు తెలిపే రుజువులు సమర్పించకుండా 'నో రెలిజియన్' సర్టిఫికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

పాపికొండల్లోనే పెద్దపులి!

- రాజమహేంద్రవరం సీసీఎఫ్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి

రంపచోడవరం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో రెస్క్యూ చేసిన పెద్దపులిని ఈ నెల 14న పాపికొండల నేషనల్ పార్కులో వదిలామని, అది ఆ ప్రాంతంలోనే ఉందని రాజమహేంద్రవరంలోని ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్(సీసీఎఫ్) శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి తెలిపారు. రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పెద్దపులి ఫొటో, ఈ పులికి సంబంధించినది కాదని చెప్పారు. రాజమండ్రిలో రెస్క్యూ చేసిన పెద్దపులి.. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిందని, అది ఇంతవరకూ మనుషుల మీద దాడి చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం పులి తన కారిడార్‌ను నిర్మించుకుంటోందని, ఈ పులికి ఎక్స్‌పోజర్ అని పేరుపెట్టామని తెలిపారు. కాగా, రంపచోడవరం పరిసర అటవీప్రాంతంలో పెద్దపులి సంచరిస్తోంది. సోమవారం ఇది రంపచోడవరం మండలం పెదగెద్దాడ, భూపతిపాలెం రిజర్వాయర్ ఎగువ ప్రాంతంలో సంచరించగా... మంగళవారం బూసిగూడెం, రంప అటవీప్రాంతం మీదుగా చెరువుపాలెం, మర్రివాడ అటవీ ప్రాంతంలో తిరిగిందని స్థానిక గిరిజనులు తెలిపారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

యుద్ధం.. సందిగ్ధం!

ఇరాన్‌పై దాడి తప్పదంటూనే అమెరికా తర్జనభర్జన



- చాలా రిస్క్ ఉందని అధ్యక్షుడికి పెంటగాన్ సూచనలు
- అది తప్పుడు ప్రచారమన్న ట్రంప్
- గురువారం స్విట్జర్లాండ్‌లో ఇరాన్-అమెరికా చర్చలు

వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఇరాన్‌పై ఏ క్షణమైనా దాడికి దిగవచ్చని హెచ్చరిస్తున్న అమెరికా.. వాస్తవంగా యుద్ధంపై తర్జనభర్జన పడుతున్నట్టు కనిపిస్తోంది. యుద్ధంతో చాలా రిస్క్ ఉందంటూ అమెరికా రక్షణ ఉన్నతాధికారుల హెచ్చరికలు.. ఎంత ఒత్తిడి తెచ్చినా, భారీగా సైన్యాన్ని మోహరించినా ఇరాన్ ఏమాత్రం దిగిరాకపోవడం.. యుద్ధమే మొదలైతే యూఏఈ, ఖతార్, బహ్రెయిన్ తదితర దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడొచ్చనే అంచనాలు.. మరోవైపు స్విట్జర్లాండ్ మధ్యవర్తిత్వంతో జెనీవాలో జరుగుతున్న అమెరికా-ఇరాన్ చర్చలు వంటి పరిణామాలన్నీ ఈ అంశాన్ని స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు చైనా తమ నౌకా విధ్వంసక క్షిపణులను ఇరాన్‌కు విక్రయించే ఒప్పందం తుది దశకు చేరినట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్‌పై దాడి కోసం అమెరికా యూఎస్ఎస్ గెరాల్డ్ ఫోర్డ్, యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక యుద్ధ నౌకలతోపాటు ఇతర యుద్ధ నౌకలను మోహరించిన నేపథ్యంలో ఈ క్షిపణుల అంశం చర్చనీయాంశంగా మారింది.

ఇరాన్‌పై దాడి చాలా రిస్క్!

ఇరాన్‌పై దాడి చేస్తే ప్రమాదకర పరిణామాలు తలెత్తే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఆ దేశ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్ స్పష్టం చేసినట్టు తెలిసింది. రక్షణశాఖ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డేన్ కెయిన్, ఇతర ఉన్నతాధికారులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ తాజాగా కథనాన్ని ప్రచురించింది. పరిమిత స్థాయిలో దాడుల వల్ల సమస్య ఉండకపోవచ్చని, కానీ ఎక్కువ రోజులు కొనసాగితే మాత్రం అమెరికా సైన్యాలకు గణనీయంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశాలు ఎక్కువని వారు పేర్కొన్నట్టు తెలిపింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ గనుక ఒకేసారి దాడులకు దిగితే ఇబ్బంది తలెత్తుతుందని స్పష్టం చేసినట్టు వెల్లడించింది. అయితే ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖండించారు. జనరల్ కెయిన్ సమర్థవంతుడైన అధికారి అని.. ఆయన సాధారణంగా యుద్ధాన్ని కోరుకోబోరని, కానీ ఒక్కసారి నిర్ణయం జరిగితే చాలా సులువుగా యుద్ధాన్ని గెలవగలమనేదే ఆయన అభిప్రాయమని చెప్పారు. కాగా, ఇరాన్ దిగివచ్చి ఒప్పందం కుదుర్చుకోకపోతే చాలా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ మరోసారి హెచ్చరించారు. కాగా, అమెరికా ఎన్నడూ లేనంతగా బలగాలను మోహరించినా, అన్ని వైపుల నుంచీ ఒత్తిడి తెచ్చినా ఇరాన్ ఎందుకు లొంగిపోవడం లేదంటూ ట్రంప్ సందేహం వెలిబుచ్చారని అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించడం గమనార్హం. అంతేకాదు ఇరాన్ యురేనియం శుద్ధి ప్రక్రియలో అణుబాంబు తయారు చేయడానికి వీలైనస్థాయికి దాదాపుగా చేరుకుందని.. ఇది చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు.

ఇరాన్‌కు మద్దతుగా హెజ్బొల్లా?

మరోవైపు స్విట్జర్లాండ్ మధ్యవర్తిత్వంతో జెనీవాలో అమెరికా, ఇరాన్ మధ్య ఇప్పటికే రెండు దఫాలుగా చర్చలు జరిగాయి. అణుశుద్ధిని పూర్తిగా నిలిపివేయడం, క్షిపణుల పరిధిని కుదించుకోవాలని అమెరికా డిమాండ్ చేస్తుండగా.. ఈ రెండు అంశాలపై వెనక్కి తగ్గేది లేదంటూ ఇరాన్ పట్టుబడుతోంది. గురువారం(ఈ నెల 26న) మరో దఫా చర్చలు జరగనున్నాయి. కాగా, ఇరాన్‌పై యుద్ధం చేపడితే అమెరికా స్థావరాలపై దాడి చేసేందుకు ఇరాన్ మద్దతున్న హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ సిద్ధమైనట్టు వార్తలు వెలువడ్డాయి. ఇరాన్‌కు మద్దతుగా హెజ్బొల్లా దాడులకు దిగితే.. ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాలు లెబనాన్‌పై దాడి చేయవచ్చని ఆ దేశ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో ఇరాన్, అమెరికా యుద్ధం విషయంలో జోక్యం చేసుకోవద్దని తాజాగా హెజ్బొల్లాకు విజ్ఞప్తి చేసింది.

ఇరాన్‌కు చైనా నౌకా విధ్వంసక క్షిపణులు!

చైనా నుంచి నౌకా విధ్వంసక క్షిపణుల కొనుగోలు కోసం ఇరాన్ జరుపుతున్న చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని తాజాగా వార్తలు వెలువడుతున్నాయి. చైనాకు చెందిన సీఎం-302 యాంటీ షిప్ సూపర్ సోనిక్ క్షిపణుల కొనుగోలు కోసం ఇరాన్ చాలా రోజుల నుంచి చర్చలు జరుపుతోంది. తాజాగా అమెరికా యుద్ధ నౌకల మోహరింపు నేపథ్యంలో కొన్ని రోజులుగా ఈ ప్రక్రియ వేగవంతం చేశారని.. ఒప్పందం దాదాపుగా తుదిదశలో ఉందని అంతర్జాతీయ వార్తసంస్థ రాయిటర్స్ తాజా కథనంలో పేర్కొంది. 290 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగల ఈ క్షిపణులు.. సముద్ర తలంపై అతి తక్కువ ఎత్తులో, అత్యంత వేగంగా ప్రయాణించగలవని, అదే సమయంలో వేగంగా దిశను మార్చుకోగలవని తెలిపింది. ఈ సామర్థ్యం కారణంగా నౌకల రక్షణ వ్యవస్థలకు చిక్కకుండా దాడి చేయగలదని పేర్కొంది. త్వరలోనే ఈ క్షిపణుల సరఫరా ప్రారంభం కావొచ్చని.. గల్ఫ్ సముద్ర ప్రాంతంలో ఇరాన్ బలం మరింత పెరుగుతుందని వెల్లడించింది.

సౌర తుఫాన్లను మూడేళ్ల ముందే పసిగట్టే 3డీ మోడల్

- ప్రపంచంలోనే మొట్టమొదటిది..
- ఐఐటీ కాన్పూర్ శాస్త్రజ్ఞుల ఘనత


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: సూర్యుని అంతర్భాగంలో జరిగే అయస్కాంత మార్పులను అంచనా వేసే మొట్టమొదటి త్రీడీ డేటా డ్రివెన్ మోడల్‌ను ఐఐటీ కాన్పూర్‌కు చెందిన గోపాల్ హజ్రా, సౌమ్యదీప్ చటర్జీ అనే ఇద్దరు పరిశోధకులు అభివృద్ధి చేశారు. సూర్యుని ఉపరితలంపై కనిపించే మచ్చల ద్వారా.. ఇది సౌరతుఫానుల రాకను మూడేళ్ల ముందే, సౌర కార్యకలాపాలను ఐదేళ్ల ముందే కచ్చితంగా అంచనా వేయగలదు. దీని వల్ల.. జీపీఎస్, రేడియో సమాచార వ్యవస్థలు, పవర్ గ్రిడ్లు, అంతరిక్షంలో ఉండే ఉపగ్రహాలు దెబ్బతినకుండా జాగ్రత్తపడడానికి వీలైనంత సమయం లభిస్తుంది. మన ఇస్రో చేపట్టిన ఆదిత్య ఎల్1 వంటి సౌర మిషన్లకు, భవిష్యత్తులో చేపట్టే ఇతర అంతరిక్ష ప్రాజెక్టులకు కూడా ఈ మోడల్ ఇచ్చే సమాచారం ఎంతగానో ఉపయోగపడనుంది. సౌరతుఫాన్లను ముందే గుర్తించడానికి ఇప్పటికే కొన్ని మోడల్స్ ఉన్నాయిగానీ.. అవి ఊహాజనిత గణిత నమూనాలను ఉపయోగించి రూపొందించిన 2డీ మోడల్స్. ఇది సూర్యుడి కార్యకలాపాలకు (సోలార్ యాక్టివిటీ) సంబంధించి.. నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ సేకరించిన ముప్పై ఏళ్ల రియల్ టైమ్ డేటాను విశ్లేషించి రూపొందించిన 3డి మోడల్ కావడం వల్ల దీని ఫలితాలు అత్యంత కచ్చితంగా ఉంటాయి. వీరి పరిశోధన వివరాలు 'ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్' జనవరి సంచికలో ప్రచురితమయ్యాయి. ఇలా.. సోలార్ సైకిల్‌కి సంబంధించి వాస్తవంగా సేకరించి, పరిశీలించిన డేటా ఆధారంగా సౌర చక్ర అంచనా, త్రీడీ మ్యాపింగ్ చేసిన మొదటి వ్యక్తులం తామేనని గోపాల్ హజ్రా, సౌమ్యదీప్ చటర్జీ పేర్కొన్నారు.

కేరళ ఇక కేరళం!

- రాష్ట్ర పేరు మార్పునకు కేంద్రం ఆమోదం
- సేవా తీర్థ్‌లో తొలిసారి క్యాబినెట్ భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: కేరళ ఇకపై కేరళం కానుంది. ఈ రాష్ట్రం పేరును మార్చడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఒక రాష్ట్రం పేరు మార్చాలంటే ఆ ప్రతిపాదన తీర్మానాన్ని శాసనసభ ఆమోదించాలి. రాష్ట్ర పేరు మార్పు బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తీసుకుంటారు. తర్వాత బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెడతారు. ఆ బిల్లు ఆమోదానికి సాధారణ మెజారిటీ సరిపోతుంది. అనంతరం రాష్ట్రపతి ఆమోదంతో పేరు అధికారికంగా మారుతుంది. ఈ ఏడాది కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. కేరళ పేరు మార్పుపై తొలిసారి 2023లో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. ఇదిలా ఉండగా, మంగళవారం కేంద్ర మంత్రివర్గ సమావేశం కొత్తగా నిర్మించిన ప్రధాన మంత్రి కార్యాలయం 'సేవా తీర్థ్'లో జరిగింది. సేవా తీర్థ్‌లో క్యాబినెట్ భేటీ జరగడం ఇదే తొలిసారి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాలకు సంబంధించిన రూ.9072 కోట్ల విలువైన మూడు రైల్వే ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జనపనార మద్దతు ధరను క్వింటాలుకు రూ.275 పెంచారు.

ఎనిమిదో తరగతి పుస్తకంలో.. న్యాయవ్యవస్థ అవినీతి!



- పెండింగ్ కేసులు, జడ్జీల కొరత కూడా
- సాంఘిక శాస్త్రంలో చేర్చిన ఎన్‌సీఈఆర్‌టీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో పొందుపరచింది. న్యాయవ్యవస్థలో అవినీతి, భారీగా పెండింగ్ కేసులు, న్యాయాధికారులు/న్యాయమూర్తుల కొరతను కూడా అందులో ప్రస్తావించింది. 'మన సమాజంలో న్యాయవ్యవస్థ పాత్ర' పేరుతో సవరించిన అధ్యాయాన్ని చేర్చింది. గత సంచికల్లో న్యాయవ్యవస్థ, కోర్టుల పాత్ర వరకే పరిమితం కాగా.. సోమవారం విడుదల చేసిన నూతన పాఠ్యపుస్తకంలో కోర్టుల వ్యవస్థ, న్యాయం ఎంతవరకు అందుతోంది.. అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. అందులోని ఓ అధ్యాయంలో.. న్యాయవ్యవస్థలో అవినీతి, ఆర్థికంగా బలహీన వర్గాలకు న్యాయం అందించడంలో దాని ప్రభావం గురించి వివరించారు. పెండింగ్ కేసులను ప్రస్తావిస్తూ.. సుప్రీంకోర్టులో 81 వేల కేసులు, వివిధ హైకోర్టుల్లో 62.40 లక్షలు, జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 4.70 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పుస్తకంలో పేర్కొన్నారు. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఉన్న జవాబుదారీ యంత్రాంగాల గురించీ ప్రస్తావించారు. ఈ వ్యవస్థలోని సమస్యలపై సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ వ్యవస్థ (సీపీజీఆర్ఏఎంఎస్) ద్వారా ఫిర్యాదు చేయొచ్చని.. దీని ద్వారా 2017-21 మధ్య 1,600 కంప్లయింట్లు అందాయని తెలిపింది. అవినీతి, దుష్ప్రవర్తన.. న్యాయవ్యవస్థపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ గత ఏడాది జూలైలో చేసిన ప్రసంగాన్ని కూడా సదరు అధ్యాయంలో పొందుపరిచారు.

కాంగ్రెస్ నేతలు దేశ విభజనే పరిష్కారమనుకున్నారు!

'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్ (పార్ట్2) అనే ఈ కొత్త పాఠ్యపుస్తకంలో 'ఇండియాస్ లాంగ్ రోడ్ టూ ఇండిపెండెన్స్' అనే అధ్యాయం చేర్చారు. ఇందులో మహాత్మాగాంధీ, పలువురు కాంగ్రెస్ నేతలు 1947లో దేశ విభజన భావననే తీవ్రంగా వ్యతిరేకించారని.. భారతీయ ముస్లింలలో అత్యధికులు కూడా ఈ ఆలోచనకు అంగీకరించలేదని.. అయితే కాంగ్రెస్ నేతలు చివరకు దేశ విభజన ఒక్కటే సమస్యకు పరిష్కార మార్గమని తుది నిర్ణయానికి వచ్చారని తెలిపారు. 1857 తిరుగుబాటు నుంచి 1947 వరకు.. స్వాతంత్ర్యోద్యమం, బెంగాల్ విభజన, దేశవిభజన గురించి విశదీకరించారు. గాంధీజీ, ఆయన అహింసా సిద్ధాంతం, కాంగ్రెస్ విధానాల వల్లే వాళ్లు వెళ్లిపోయారని మొదట్లో అనుకునేవారని.. అయితే ఇతరత్రా చాలా కారణాలున్నట్లు తర్వాత గుర్తించారని వెల్లడించారు. 'జనరంజక ఉద్యమాలు, విప్లవకారుల దాడులు, రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, రాయల్ ఇండియన్ నేవీల్లో తిరుగుబాట్లు వీటిలో ఉన్నాయి. అంతేగాక రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటన్ స్థాయి మసకబారింది. ప్రపంచమంతటా వలస పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు మొదలయ్యాయి. సామ్రాజ్యాల శకం అంతరించింది' అని సదరు అధ్యాయంలో తెలిపారు. బంకించంద్ర చటోపాధ్యాయ రాసిన 'వందే మాతరం' గేయంలో మొదటి రెండు చరణాలను ప్రస్తావించారు. ముస్లింలీగ్ చేపట్టిన ప్రత్యక్ష కార్యాచరణ దినం, కలకత్తాలో హింస గురించి పొందుపర్చారు. ఒడిసాలో రైతుల విప్లవం 'పాయికా సంగ్రామం'పైనా ఓ అధ్యాయాన్ని చేర్చారు.

8 మంది యూత్ కాంగ్రెస్ నేతలకు పోలీసు కస్టడీ విధింపు


పటియాలా హౌస్ కోర్టు వద్ద చిబ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ వద్ద నిరసనలు తెలిపినందుకు యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఉదయ్ భాను చిబ్‌కు ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు నాలుగు రోజుల పోలీసు కస్టడీ విధించింది. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి ఏఐ సమ్మిట్ వద్ద కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. దీంతో పోలీసులు చిబ్‌తో సహా 8మంది యూత్ కాంగ్రెస్ నేతలను అరెస్టు చేశారు. కాగా ఢిల్లీ పోలీసులు యూత్ కాంగ్రెస్ నేతలపై అల్లర్లకు పాల్పడినట్లు బీఎన్ఎస్ సెక్షన్ 191(1), 192 కింద అదనపు సెక్షన్లను నమోదు చేశారు. కాగా రాహుల్‌గాంధీ యూత్ కాంగ్రెస్ నేతల అరెస్టును ఖండించారు. అది నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు. జాతి ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డ ప్రధానికి వ్యతిరేకంగా గళమెత్తిన యూత్ కాంగ్రెస్ నేతలను చూసి గర్వపడుతున్నానని పేర్కొన్నారు. కాగా ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్ అర్ధనగ్న ప్రదర్శన సూత్రధారి రాహుల్‌గాంధీయేనని బీజేపీ ఆరోపించింది. తెర వెనుక ఉండి ఈ నిరసన చేయించి దేశాన్ని అవమానించిన వారిని చట్టం వదిలిపెట్టదని తెలిపింది. బీజేపీ కేంద్ర కార్యాలయంలో జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ సూచనల మేరకే యూత్ కాంగ్రెస్ ఈ నిరసన నిర్వహించినట్లు ఆరోపించారు. కాగా పలువురు ప్రముఖులు కూడా యూత్ కాంగ్రెస్ నిరసనలను ఖండించారు. రిటైర్డ్ జడ్జిలు, మాజీ రాయబారులు ఇది క్షమించరాని చర్య అని పేర్కొన్నారు. అది ముందస్తు ప్రణాళిక ప్రకారం చేసిందేనని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎప్‌స్టీన్ భయంతోనే మోదీ లొంగిపోయారు!

- అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి అంగీకరించారు
- ఆ ఒప్పందం రైతులకు శరాఘాతం: రాహుల్
- మోదీ అంత పిరికి ప్రధానిని చూళ్లేదు: ఖర్గే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఎప్‌స్టీన్ ఫైళ్ల భయం, అదానీ మీద అమెరికాలో నమోదైన క్రిమినల్ కేసు ఒత్తిడి నేపథ్యంలోనే ప్రధాని మోదీ.. అమెరికాతో ఏకపక్ష వాణిజ్య ఒప్పందానికి అంగీకరించారని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ ఒప్పందం దేశంలోని రైతులకు పూర్తిగా వ్యతిరేకమైనదన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో మంగళవారం జరిగిన కిసాన్ మహాచౌపల్ (రైతుల మహాసభ)లో ప్రసంగిస్తూ రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు కొట్టేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసే ధైర్యం ఉందా? అంటూ మోదీకి సవాల్ విసిరారు. ఒప్పందం వెనుక రెండు కారణాలున్నాయన్నారు. 'మొదటిది.. ఎప్‌స్టీన్ ఫైళ్లు. ఈ ఫైళ్లలో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్‌పురీ పేరు కూడా ఉంది. వాటిని చూపెట్టి మోదీని భయపెట్టారు. మా మాట వినకపోతే ఫైళ్లలోని అంశాలను బయటపెడతామన్నారు. ఇక, రెండో కారణం.. అమెరికాలో అదానీపై నమోదైన క్రిమినల్ కేసు. ఇది మోదీ లక్ష్యంగా అదానీ మీద పెట్టిన కేసు' అని రాహుల్ అన్నారు. ఇదే సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ, 60ఏళ్ల రాజకీయ జీవితంలో మోదీ అంతటి పిరికి ప్రధానిని చూడలేదన్నారు.

బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

- దేశవ్యాప్తంగా అందించనున్న కేంద్రం
- 14 ఏళ్లవారికి సింగిల్ డోస్ గార్డాసిల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: మహిళల్లో పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 14 ఏళ్ల వయసున్న బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాను అందించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనుందని ఆరోగ్యశాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సింగిల్ షాట్ గార్డాసిల్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను అందిస్తారు. ఇది గర్భాశయ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ వైరస్‌లోని నాలుగు రకాల (6, 11, 16, 10) ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తుంది. 15 ఏళ్లలోపు వయసున్న బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న గార్డాసిల్-4 అనే వ్యాక్సిన్‌ను రెండు డోసులు అందించాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర రూ.3,927. అయితే 15 ఏళ్లు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసులు తీసుకోవాలి. గార్డాసిల్-4 వ్యాక్సిన్‌ను ఎంఎస్‌డీ ఇండియా అనే సంస్థ తయారు చేస్తోంది.











విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 'ఆటవిడుపు' పేరిట సోమవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

'ఉన్నత విద్య'లో ప్రక్షాళన

- కొత్తగా ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి కమిషనరేట్లు
- అకడమిక్ అంశాలకే ఉన్నత విద్యామండలి పరిమితం
- సమూల మార్పులకు క్యాబినెట్ ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'ఉన్నత విద్య'లో సమూల ప్రక్షాళన చేపట్టింది. మొత్తం స్వరూపాన్ని మార్చే కీలక నిర్ణయాలకు మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. కొత్తగా ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి కమిషనరేట్లు ఏర్పాటు కానున్నాయి. సాంకేతిక విద్యా శాఖను రద్దు చేయనున్నారు. ఉన్నత విద్యాశాఖ పునర్వ్యవస్థీకరణపై 1-2 రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి. వేర్వేరుగా ఉన్న వ్యవస్థలను ఒక్కటి చేసేలా పలు శాఖల రద్దు, విలీన ప్రక్రియ చేసింది. ఒకే పనిని వేర్వేరు కార్యాలయాలు చేస్తుండటం వల్ల గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మార్పులకు శ్రీకారం చుట్టింది.

ఉన్నత విద్య కమిషనరేట్

ఉన్నత విద్యాశాఖకు కొత్తగా ఒక కమిషనరేట్ ఏర్పాటు కానుంది. ప్రస్తుత కళాశాల విద్యా శాఖే ఉన్నత విద్య కమిషనరేట్‌గా మారుతుంది. ఇంజనీరింగ్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, పాలిటెక్నిక్‌లు, ఇతర ఉన్నత విద్యా కోర్సులు అందించే అన్ని రకాల కాలేజీలు దీని పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం కళాశాల విద్యాశాఖ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను మాత్రమే పర్యవేక్షిస్తోంది. ప్రైవేటు డిగ్రీ కాలేజీలు, బీఈడీ కాలేజీలు, ఇతర విద్య కోర్సుల కాలేజీలు ఉన్నత విద్యామండలి పరిధిలో ఉన్నాయి. ఇకపై ఇవన్నీ ఉన్నత విద్య కమిషనరేట్‌లోకి రానుండగా.. ఉన్నత విద్యామండలి ప్రవేశ పరీక్షలను మాత్రమే నిర్వహిస్తుంది. ఇకపై అడ్మిషన్లన్నీ ఉన్నత విద్య కమిషనరేట్ చేపడుతుంది. ఇప్పటివరకూ ఇంజనీరింగ్ అడ్మిషన్లు, వాటికి అనుమతులు సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉన్నాయి. దీన్ని రద్దుచేసి, అందులోని ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి శాఖకు, పాలిటెక్నిక్‌లను ఉన్నత విద్యకు బదిలీ చేస్తారు. ఆస్తులు, సిబ్బందిని కూడా పంపిణీ చేస్తారు.

నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, శిక్షణ కమిషనరేట్

ప్రస్తుతం నైపుణ్యాభివృద్ధి శాఖలో ఉపాధి కల్పన, శిక్షణ డైరెక్టర్ కార్యాలయం ఉంది. దానిని నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, శిక్షణ కమిషనరేట్‌గా మారుస్తున్నారు. రాష్ట్రస్థాయితో పాటు జిల్లాల్లో జిల్లా ఉపాధి కల్పన అధికారి(డీఈవో) పోస్టును జిల్లా ఉపాధి కల్పన, స్కిల్ అధికారి(డీఈఎస్‌వో)గా మారుస్తున్నారు. ప్రస్తుతం ఉన్నత విద్యకు కేంద్ర బిందువుగా ఉన్న ఉన్నత విద్యామండలి అకడమిక్ అంశాలకే పరిమితం కానుంది.

ఇకపై నిర్ణయాల్లో ఆలస్యం ఉండదు

ప్రస్తుత విధానంలో ఉన్నత విద్య నిర్ణయాల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని ప్రభుత్వం అభిప్రాయపడింది. ఒకే పనిని వేర్వేరు కార్యాలయాలు చేస్తుండటం వల్ల గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయనే ఉద్దేశంతో ఈ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇంజనీరింగ్ అడ్మిషన్ల అంశాన్ని తీసుకుంటే ప్రవేశ పరీక్షను ఉన్నత విద్యామండలి, అడ్మిషన్లను సాంకేతిక విద్యాశాఖ చేపడుతున్నాయి. కాలేజీలకు అనుమతుల మంజూరు మండలి పరిధిలో ఉంది. డిగ్రీ కాలేజీల పర్యవేక్షణ.. మండలి పరిధిలో ప్రైవేటు, కళాశాల విద్యా శాఖ పరిధిలో ప్రభుత్వ కాలేజీలకు వేర్వేరుగా ఉంది. ఉన్నత విద్యతో సంబంధం ఉండే పాలిటెక్నిక్ విద్య నైపుణ్యాభివృద్ధి శాఖ పరిధిలో ఉంది. ఈ క్రమంలో విధాన నిర్ణయాల్లో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సమూల మార్పులకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఇకపై ఉన్నత విద్యలో వేగం పెరుగుతుందనేది ప్రభుత్వ భావన.

రైడెన్ డేటా సెంటర్‌కు భాగస్వామిగా అదానీ

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఏర్పాటు చేయనున్న ఒక గిగావాట్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణ, నిర్వహణ బాధ్యతలను అదానీకి అప్పగించడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అదానీని తమ భాగస్వామ్య సంస్థగా పేర్కొంటూ ఇటీవల రైడెన్ లేఖ రాసింది. ఈ లేఖపై కార్యనిర్వాహక స్టీరింగ్ కమిటీ సమావేశమై.. రైడెన్‌కు అప్పగించిన భూములు, ప్రకటించిన రాయితీలను అదానీకి బదలాయించాలంటూ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ సిఫారసులను క్యాబినెట్ ఆమోదానికి ఐటీ శాఖ పంపింది. వాటిని క్యాబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది.

రూ.2,387.81 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ

స్త్రీశక్తి పథకంలో 40%, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి కూడా ఉచిత బస్సు

క్యాబినెట్‌లో 57 అంశాలకు ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా ఆనందవరం మండలం తర్లువాడ గ్రామంలో రూ.2,387.81 కోట్లతో నిర్మించే సెమీకండక్టర్ పరిశ్రమకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఏపీ సెమీ కండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 2024-29 కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు విస్తరించేందుకు ఈ నెల 18న జరిగిన ఎస్ఐపీబీలో తీసుకున్న సిఫారసులను అనుమతించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో 57 అంశాలకు ఆమోదం లభించింది.

క్యాబినెట్ ఆమోదించిన మరికొన్ని నిర్ణయాలు ఇవీ...

- ఏపీ మోటార్ వెహికల్స్ టాక్సేషన్ సవరణ బిల్లు-2026ను ప్రవేశపెట్టడానికి ఆమోదం. మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించాల్సిన లైఫ్‌ట్యాక్స్‌పై 10% అదనపు పన్నును రోడ్డు సేఫ్టీ సెస్‌గా విధించి వసూలు చేయడానికి 3-సీ లెవీ ఆఫ్ రోడ్ సేఫ్టీ సెస్ అనే కొత్త సెక్షన్‌ను ప్రవేశపెట్టడానికి ఈ బిల్లు ప్రవేశపెట్టనుంది.
- స్త్రీశక్తి పథకంలో భాగంగా 40శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని విస్తరించడానికి ఆమోదం. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం ఇస్తున్న 50 శాతం రాయితీని కొనసాగింపునకు అనుమతి.
- చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం పట్నం గ్రామంలో 18.60 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వయంభూ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి కేటాయించారు. కాణిపాకం యాత్రికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి, అభివృద్ధి కార్యకలాపాలకు మార్కెట్ విలువ ఎకరా రూ.8.75 లక్షల చొప్పున కేటాయిస్తారు.
- ప్రస్తుత 'పర్యావరణ, అటవీ, విజ్ఞాన, సాంకేతిక శాఖ'ను 'పర్యావరణ, అటవీశాఖ'గా నామకరణం చేయాలని ప్రతిపాదించింది. 'సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ'ను కొత్తగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- ఫిబ్రవరి 11న జరిగిన ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది.
- కొల్లేరు వన్యప్రాణి అభయారణ్య సరిహద్దుల హేతుబద్ధీకరణపై 48వ నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ సమావేశం చేసిన సిఫారసుల ప్రకారం చర్యలు తీసుకోవడానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీని సంప్రదించేందుకు చేసిన ప్రతిపాదనలను ఆమోదించింది.
- విశాఖపట్నం రుషికొండలో వి హోటల్ అనే స్వంత బ్రాండ్ కింద 3-స్టార్ హోటల్ అభివృద్ధి కోసం వీరాంజనేయ హాస్పిటాలిటీకి ప్రోత్సాహకాలకు ఆమోదం.
- సత్యసాయి జిల్లా పెనుగొండలోని గనగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం పాదపీఠం వద్ద మెగా స్పిరిచ్యువల్ అండ్ కల్చరల్ టూరిజం సెంటర్-బేస్ క్యాంప్ అభివృద్ధి కోసం బెంగుళూరు ఇస్కాన్‌కు భూమి, ప్రోత్సాహకాలు అందించేందుకు జారీ చేసిన ఉత్తర్వులకు అనుమతి లభించింది.
- విశాఖ జిల్లా తర్లువాడలో అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌కు 30 ఎకరాల కేటాయింపు, పెట్టుబడికి ప్రత్యేక ప్రోత్సాహకాలు విస్తరించడానికి ఎస్ఐపీబీ సిఫారసులకు ఆమోదం.

ప్రజాప్రతినిధుల 'ఆటవిడుపు'

బిజీ లైఫ్‌కు దూరంగా.. ఆటలతో సరదాగా..

విజయవాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నిత్యం బిజీబిజీగా ఉండే ప్రజాప్రతినిధులు కబడ్డీ.. కబడ్డీ.. అంటూ కలబడ్డారు..! టగ్ ఆఫ్ వార్‌లో నువ్వా నేనా అన్నట్టు తలపడ్డారు. వాలీబాల్ ఆడారు. 100 మీటర్ల పరుగుపందెంలో రేసుగుర్రాల్లా పరుగులు తీశారు. మహిళా ఎమ్మెల్యేలు సైతం పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, టెన్నికాయిట్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్ రేసుల్లో సత్తాచాటారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 'ఆటవిడుపు' పేరిట ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. భేషజాలు వీడి హుషారుగా పాల్గొన్నారు. కబడ్డీ పోటీలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ భుజానికి గాయమైంది.

స్పీకర్‌పై డిప్యూటీ స్పీకర్ విజయం

ఆటవిడుపులో భాగంగా తొలుత టగ్ ఆఫ్ వార్ పోటీని నిర్వహించారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ జట్లు ఈ పోటీలో తలపడ్డాయి. చివరికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు జట్టుపై డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు టీమ్ విజయం సాధించింది. అనంతరం 100 మీటర్ల పరుగు పందెంలో పార్వతీపురం ఎమ్మెల్యే బి విజయచంద్ర విజయం సాధించారు.

మహిళా కెప్టెన్లు... పురుష క్రీడాకారులు

ఈ ఆటలపోటీల్లో మహిళా ప్రజాప్రతినిధులు కెప్టెన్సీతో పురుషులతో కూడిన తమ జట్లను ముందుకు నడిపించారు. వాలీబాల్‌లో ఒక జట్టుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, మరో జట్టుకు ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ కెప్టెన్లుగా వ్యవహరించారు. పురుష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ జట్లలో సభ్యులు. హోరాహోరీగా సాగిన పోరులో గ్రీష్మ జట్టు విజయం సాధించింది.

పోటీలు ప్రారంభించిన స్పీకర్ అయ్యన్న

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 'ఆటవిడుపు' పేరిట ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలను అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంగళవారం ప్రారంభించారు. తొలుత విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు క్రీడాజ్యోతితో ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఈ జ్యోతిని స్పీకర్‌కి అందజేయగా... స్పీకర్, మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు క్రీడా దీపాన్ని వెలిగించారు. క్రీడల ప్రారంభం సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ.. ఒత్తిడితో కూడిన జీవితానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు మాట్లాడుతూ... ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ, లింగ భేదాలను మరిచి ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ... కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రతిపక్ష సభ్యులు ఆడాలని విజ్ఞప్తి చేశారు. మహిళల 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొనేందుకు కావలి గ్రీష్మతోపాటు మరో ముగ్గురు మాత్రమే ముందుకొచ్చారు. మిగిలిన వారు వెనుకంజ వేయడంతో పోటీలో పాల్గొనని వారికి సభలో మైక్ ఇవ్వనంటూ అయ్యన్నపాత్రుడు సరదాగా వ్యాఖ్యానించారు.

నేడు వెలిగొండకు సీఎం

- ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన

మార్కాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశాక.. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటిసారి ఇక్కడకు రానున్నారు. బుధవారం బహిరంగ సభలో పాల్గొననున్నారు. అంతకుముందు ఆయన దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనులకు శంకుస్థాపన చేస్తారు. జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే జాతికి అంకితం చేసి ప్రజలను మోసగించింది. కనీసం ఫీడర్ కాలువ పటిష్ఠతపై కూడా దృష్టిపెట్టకపోవడంతో పలుచోట్ల గండ్లుపడి కట్టలు తెగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫీడర్ కాలువ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.456 కోట్లు మంజూరు చేసింది. షెడ్యూల్ ప్రకారం సీఎం మధ్యాహ్నం 12.40 గంటలకు గంటవానిపల్లి వద్దకు చేరుకుని.. ఫీడర్ కాలువ పనులకు శంకుస్థాపన చేస్తారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడతారు. అనంతరం మార్కాపురం చేరుకుంటారు. మధ్యాహ్నం తర్లుపాడు రోడ్డులో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పర్యటనకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది.

అక్రమ డిజిటల్ ఆస్తులు, షేర్లపై ఏసీబీ నిఘా!

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అవినీతి సొమ్మును డిజిటల్ ఆస్తులు, క్రిప్టోకరెన్సీ, షేర్ల రూపంలో దాచిపెడుతున్న అక్రమార్కులపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దృష్టి సారించనుంది. అలాంటి అక్రమాస్తులను గుర్తించేందుకు రాష్ట్రంలోని ఏసీబీ అధికారులకు ఐసీసీసీ (ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్) ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యాన విజయవాడలోని కేబీఎన్ కాలేజీలో ఈ నెల 18 నుంచి 20 వరకు వర్చువల్‌గా ఈ శిక్షణ కొనసాగినట్టు అధికారులు మంగళవారం తెలిపారు. ఏసీబీకి చెందిన 32 మంది ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు డీఎస్పీలు, ముగ్గురు అదనపు ఎస్పీలు, ఐదుగురు ఎస్పీ/జాయింట్ డైరెక్టర్లు, నలుగురు లీగల్ అధికారులు, ఒక ఐజీ/డైరెక్టర్ స్థాయి అధికారికి 'వర్చువల్ డిజిటల్ ఆస్తుల(వీడీఏ) దర్యాప్తు' పై శిక్షణ ఇచ్చారు.

'సితా' డైరెక్టర్‌గా ముక్తేశ్వరరావు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (సితా) డైరెక్టర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్.ముక్తేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. దేవదాయ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రోజంతా స్పీడ్ పోస్ట్ బుకింగ్ సేవలు

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):ప్రజలకు మరింత చేరువయ్యే దిశగా కార్యకలాపాల వేగాన్ని పెంచుతూ పోస్టల్ శాఖ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 11 ప్రధాన నగరాల్లో 24 గంటలపాటు స్పీడ్ పోస్ట్, పార్శిల్ బుకింగ్ సేవలను అందించేందుకు సిద్ధమైంది. మరో 242 పట్టణాల్లోని సబ్ పోస్ట్ ఆఫీసుల పని వేళలను రెండు గంటలు పెంచింది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, కడప, అనంతపురం, ఒంగోలు, గుంతకల్ నగరాల్లోని ప్రజలకు జనరల్ పోస్ట్ ఆఫీస్(జీపీవో)ల్లో స్పీడ్ పోస్ట్, పార్శిల్ బుకింగ్‌లను 24 గంటలపాటు చేసుకునే అవకాశం కల్పించింది. ఐటీ 2.0 సాఫ్ట్‌వేర్‌ను జీపీవో, సబ్ పోస్ట్ ఆఫీసులకు అనుసంధానం చేసిన తరువాత పోస్టల్ సేవలు మరింత స్మార్ట్‌గా మారడంతో కస్టమర్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

ఓఎంసీ అక్రమాలపై నివేదికకు గడువు పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దులోని ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) అక్రమ మైనింగ్, అటవీ భూముల ఆక్రమణల ఆరోపణలపై సమగ్ర నివేదిక సమర్పించడానికి కమిటీకి సుప్రీంకోర్టు మరో ఆరువారాల గడువు ఇచ్చింది. సమగ్ర నివేదిక సమర్పిస్తారనే నమ్మకంతోనే గడువును పెంచుతున్నామని, ఆ నివేదిక వచ్చాకే తదుపరి ఆదేశాలు ఉంటాయని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు మంగళవారం సీజేఐ, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.


లోకేశ్.. భేష్!

సమస్యలపై విద్యామంత్రి తక్షణమే స్పందిస్తున్నారు.. హైకోర్టు కితాబు

- మంత్రి ఇలా పనిచేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంతో ఎందుకు చెడ్డపేరు తెస్తున్నారు?
- సర్వశిక్ష అభియాన్ పీడీ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారు
- క్రిమినల్ కోర్టు ధిక్కరణ కేసు పెడతామని ధర్మాసనం హెచ్చరిక
- తాజాగా మళ్లీ అఫిడవిట్ వేయాలని ఆదేశం
- విచారణ మూడు వారాలకు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా మంత్రి లోకేశ్ పనితీరును హైకోర్టు ధర్మాసనం ప్రశంసించింది. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనపై తక్షణమే స్పందించారని గుర్తుచేసింది. ఆయన ఆదేశాలతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా యంత్రాంగమంతా ఘటన స్థలానికి చేరుకుని విద్యార్థినులను ఆదుకున్నారని పేర్కొంది. 'కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధనాసిబ్బందికి జీతాలు పెంచడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీ చేయడంపై కేంద్రంతో చర్చిస్తున్నామని శాసనసభలో ఆయన ప్రకటన చేసినట్లు పత్రికల్లో చూశాం. మంత్రి ఈ విధంగా పనిచేస్తున్నప్పుడు కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వానికి, మంత్రికి ఎందుకు చెడ్డపేరు తెస్తున్నారు' అని వ్యాఖ్యానించింది. కేజీబీవీల్లో పీజీటీల నియామకానికి సంబంధించి సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంపై సుమోటోగా నమోదు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. గత విచారణ సందర్భంగా ధర్మాసనం సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు వైఖరిని తప్పుపట్టింది. దిగువ స్థాయి అధికారిని రక్షించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించింది. కోర్టు ఉత్తర్వులు అమలు చేయని అధికారులపై తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. మంగళవారంనాటి విచారణలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వేసిన అఫిడవిట్‌ను పరిశీలించింది. 'గత విచారణలో బాధ్యులైన అధికారికి నోటీసు ఇచ్చామని చెప్పారు. అఫిడవిట్‌లో కోర్టు విచారణ తర్వాత నోటీసు జారీ చేసినట్లుగా ఉంది. ఐఏఎస్ అధికారి అయిఉండి కోర్టును తప్పుదోవ పట్టిస్తారా? మీపై క్రిమినల్ కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేస్తాం. తగిన చర్యలు తీసుకునే నిమిత్తం సిబ్బంది-శిక్షణ విభాగానికి సిఫారసు చేస్తాం' అని శ్రీనివాసరావును హెచ్చరించింది. ప్రస్తుత అఫిడవిట్ సంతృప్తికరంగా లేదని, తాజాగా మరోసారి దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను మూడువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు.. కేజీబీవీల్లో శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీపై ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఇదీ కేసు.. సమగ్ర శిక్ష పథకం కింద నిర్వహించే కేజీబీవీల్లో పార్ట్‌టైం పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు)గా పనిచేస్తున్న తమను అర్ధాంతరంగా తొలగించడాన్ని సవాల్ చస్తూ 2023లో వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పిటిషనర్లను ఉద్యోగాల్లో కొనసాగించాలని, ఒప్పందం ముగిసిన అనంతరం కూడా కొనసాగించే విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ అధికారులు 2024 జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ విచారణ సందర్భంగా సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేస్తామని ఇచ్చిన హామీ పూర్తిస్థాయిలో అమలుకాకపోవడంతో సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావుపై సుమోటో కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించింది. గత విచారణ సందర్భంగా ఆయన నేరుగా ధర్మాసనం ముందు హాజరయ్యారు. ఆయన ఇచ్చిన సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం.. కోర్టు ఉత్తర్వులు అమలు చేయని అధికారులపై ఏమి చర్యలు తీసుకున్నారో సవివరంగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే.



కాకినాడ, అమలాపురం ఎంపీ నియోజకవర్గాల నేతలతో ఆత్మీయ భేటీలో చిన్నారిని ముద్దాడుతున్న మంత్రి లోకేశ్

మీ తీరు కోర్టు ధిక్కరణే!

- 2018 గ్రూపు-1 అభ్యర్థులను అప్రాధాన్య పోస్టులకు మార్చడంపై నివేదిక ఎందుకు ఇవ్వలేదు?
- సీఎస్‌పై హైకోర్టు ధర్మాసనం ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌పై హైకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. మెయిన్స్ జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో గ్రూప్-1 (2018 నోటిఫికేషన్) ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను కీలక పోస్టుల నుండి అప్రాధాన్యత పోస్టులకు మార్చాలని ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసి, రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు నివేదిక సమర్పించకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. సీఎస్ వ్యవహారశైలి కోర్టు ధిక్కరణ కిందికి వస్తుందని వ్యాఖ్యానించింది. ఆయనపై సుమోటో కోర్టుధిక్కరణ కేసు ఎందుకు నమోదు చేయకూడదో బుధవారం కోర్టు ముందు వివరణ ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మ ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.

గతంలో ఏం జరిగింది?

2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా 169 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని హైకోర్టు సింగిల్ జడ్జి నిర్ధారించారు. 2022 మే26న ఏపీపీఎస్సీ ఇచ్చిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను రద్దు చేశారు. తాజాగా మళ్లీ మెయిన్స్ నిర్వహించాలని, ఎంపిక ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశిస్తూ 2024 మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందిన కొందరు అభ్యర్థులు హైకోర్టులో అప్పీల్ చేశారు. అప్పీళ్లపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. పలువురు అభ్యర్థుల అనుబంధ పిటిషన్లను పరిష్కరించింది. జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాల ఆరోపణల్లో వాస్తవాలను తేల్చేందుకు సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అలాగే ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులందరినీ తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు కీలక పోస్టుల నుండి అప్రాధాన్యత పోస్టులకు మార్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వ్యక్తిగత ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోలేం

ఈ వ్యవహారంపై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. సీఎస్ ఎలాంటి నివేదిక దాఖలు చేయలేదని రిజిస్ట్రార్ జ్యుడీషియల్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. నివేదిక దాఖలుపై సమాచారం ఏమైనా ఉందా? అని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను ప్రశ్నించింది. ఏజీ ఎలాంటి నివేదిక దాఖలు చేయలేదని బదులిచ్చారు. ఉత్తర్వులు అమలుపై న్యాయస్థానం నుండి స్పష్టత తీసుకోవాలని సీఎస్ భావించారని నివేదించారు. అయితే తనకు వ్యక్తిగత ఇబ్బంది ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. కోర్టు విచారణల్లో వ్యక్తిగత ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోలేమని ఏజీకి తేల్చిచెప్పింది. కోర్టు ధిక్కరణ చర్యల ప్రారంభానికి సంబంధించి ఉత్తర్వులు జారీని ప్రారంభించింది. ఏజీ స్పందిస్తూ.. అప్పీళ్లపై విచారణను ఒకరోజు వాయిదా వేయాలని కోరారు. అందుకు ధర్మాసనం నిరాకరించింది. కేసును ఏవిధంగా హ్యాండిల్ చేయాలో తమకు తెలుసని పేర్కొంది.

విపక్షంగా వైసీపీ విఫలం!

(మొదటి పేజీ తరువాయి)


రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసలు సభకే రాకుండా బయట రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుచేత ప్రతిపక్ష పాత్రను కూడా మనమే పోషించాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో వివిధ శాఖల పద్దులపై జరిగే చర్చల్లో మంత్రులు బాగా సిద్ధమై వచ్చి మాట్లాడాలని.. ఒక మంత్రి ఒక సబ్జెక్టుపై మాట్లాడినప్పుడు.. అనుబంధంగా మాట్లాడే వారూ కంటెంట్‌తో మాట్లాడితేనే ప్రజల్లోకి ఆ అంశం బలంగా వెళ్తుందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలు ఎలా ఉన్నాయో కృత్రిమ మేథ (ఏఐ) ద్వారా విశ్లేషణ చేయిస్తానని చెప్పారు.

ప్రతిరోజూ పరీక్షే..

ప్రజల పక్షాన నిలవాల్సిన ప్రతిపక్షం కేవలం రాజకీయమే చేస్తోందని, దీంతో మనమే అధికారపక్షంతో పాటు ప్రతిపక్ష పాత్ర కూడా పోషించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో మనకు ప్రతి రోజూ పరీక్షేనని సీఎం వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేసే మంచి పనిని కిందిస్థాయి వరకు తీసుకెళ్లాలని సూచించారు. మంత్రులు తమ శాఖల్లో చేసే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. మంత్రులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మంత్రులతో బాగా సమాధానాలు ఇప్పించే బాధ్యత సభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌దేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ జరిగినన్ని రోజులూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 వరకు ఒక్కో అంశంపై లఘు చర్చ చేపడదామని సూచించారు. ఇందుకు తగ్గట్లుగా అంశాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సందర్భాన్ని బట్టి తాను, పవన్ కల్యాణ్ చర్చల్లో పాల్గొంటామన్నారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం చేస్తున్న కృషి అసెంబ్లీ వేదికగా ప్రజల్లోకి బాగా వెళ్లాలన్నారు.

అలాంటి ఘటనలు పునరావృతం కాకూడదు..

శ్రీకాకుళంలో డయేరియా, రాజమండ్రిలో కల్తీపాలు ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించామని, ఈ రెండు ఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, ఇలాంటి ఘటనలు ఎట్టిపరిస్థితుల్లో పునరావత్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ నెల 28నే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్నామని.. వీటి పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలని, అందకు అనుగుణంగా 28న అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని పయ్యావులను సీఎం కోరారు. కాగా.. ఎజెండాలోని అంశాల్లో.. హెరిటేజ్ కంపెనీతోపాటు 10 కంపెనీల విస్తరణకు స్థల కేటాయింపులు కూడా ఉన్నాయి. ఈ కేటాయింపులకు సంబంధించిన అంశాలు క్యాబినెట్‌లో చర్చకు వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమావేశం నుంచి వెళ్లిపోయారు.





శాసనసభకు వచ్చిన విద్యార్థులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

వైసీపీ ఇళ్ల పట్టాల పంపిణీలో ఆరేడు వేల కోట్ల అవినీతి

» అనర్హులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేస్తాం

» 426 పశువైద్య భవనాలు నిర్మిస్తున్నాం: మంత్రులు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆరేడు వేల కోట్ల అవినీతి జరిగిందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ఈ అక్రమాలపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలపై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. వైసీపీ హయాంలో 28లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చారని, అయితే ఇప్పటికీ లక్షలాది మంది ఆ పట్టాల కన్వేయన్స్ డీడ్లు తీసుకోలేదని, దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. 43వేల మంది అనర్హులకు పట్టాలు ఇచ్చినట్టు గుర్తించామని, వాటిని రద్దు చేస్తామన్నారు.

పశు వైద్యశాలలకు కొత్త భవనాలు: అచ్చెన్న

కొత్తగా 426 పశు వైద్యశాలలకు భవనాలు నిర్మిస్తున్నామని, వాటిని రెండేళ్లలో పూర్తి చేస్తామని వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. పశు వైద్యశాలల కొరత గురించి ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివ రావు, కె.మురళీమోహన్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు.

సీఆర్‌జెడ్ జోన్ మార్పునకు ప్రయత్నాలు: దుర్గేశ్

విశాఖపట్నం బీచ్ రోడ్డులో నిర్మాణాలకు అడ్డంకిగా ఉన్న సీఆర్‌జెడ్ జోన్ మార్పునకు ప్రయత్నాలు చేస్తున్నామని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. జోన్-3 నుంచి జోన్-2కు మార్పులని ఎమ్మెల్యేలు వంశీకృష్ణమోహన్, వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. సీఆర్‌జెడ్-19 అమల్లోకి వస్తే పర్యాటక ప్రాజెక్టులకు అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పెన్షన్ల పెంపుపై చర్చిస్తాం: రాంప్రసాద్

ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్ల పెంపుపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు సౌకర్యాలపై ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సభలో ప్రశ్నించారు.

దశలవారీగా గిరిజన ప్రాంతాల్లో రోడ్లు: మనోహర్

గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం దశలవారీగా జరుగుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అడవితల్లి బాట పథకంపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. పీఎం జన్‌మన్, నరేగా, పీఆర్‌జెడ్ పథకాల ద్వారా రూ.1077 కోట్లతో 393 రోడ్లు మంజూరయ్యాయన్నారు. 341 గిరిజన ఆవాసాలకు రూ.914 కోట్లతో 303 రోడ్లు, 33 వంతెనలు మంజూరయ్యాయని తెలిపారు. కొఠియా ప్రాంతంలోని పది గ్రామాల సమస్యను పరిష్కరించాలని కొణతాల కోరారు.

త్వరలో హైలెవెల్ బ్రిడ్జిల మంజూరు: జనార్దన్‌రెడ్డి

పలాసలో మూడు కాజ్‌వేల వద్ద హైలెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు కోరామని, బడ్జెట్ కేటాయింపుల ఆధారంగా వాటిని మంజూరు చేస్తామని రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. పలాసలో పురాతన కాజ్‌వేల గురించి ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. కొబ్బరి పరిశ్రమ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, ఐతాబత్తుల ఆనందరావు కోరారు.

12.88% మందికి పెన్షన్లు: కొండపల్లి శ్రీనివాస్

రాష్ట్ర జనాభాలో 12.88శాతం మందికి పెన్షన్లు అందిస్తున్నామని.. దేశంలో అత్యధికంగా పెన్షన్లు ఇచ్చే రాష్ట్రాల్లో ఏపీ ముందుందని సెర్ప్, ఎంఎస్ఎంఈ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

జూ. కాలేజీల్లో ఖాళీలను భర్తీ చేస్తాం: లోకేశ్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీలను యుద్ధప్రాతిపదిక భర్తీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రకటించారు. అనంతపురం జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల మంజూరుపై వైసీపీ సభ్యుడు శివరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరు చేయగా, అన్ని కళాశాలల్లో బోధన సిబ్బంది, 5 కళాశాలల్లో బోధనేతర సిబ్బంది పోస్టులు మంజూరు చేశామని చెప్పారు. వైసీపీ హయాంలో విద్యాశాఖను నిర్లక్ష్యం చేశారని అన్నారు. ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల ఏర్పాటుపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ ప్రభుత్వ డైట్, బీఈడీ, బీపీఈడీ కళాశాలలను బలోపేతం చేస్తామని చెప్పారు. శిక్షణ కళాశాలల్లో ఖాళీలను డిప్యూటేషన్‌తో భర్తీ చేశామన్నారు.

ఔట్ సోర్సింగ్‌లో లస్కర్ల నియామకం: నిమ్మల

ఇరిగేషన్ శాఖలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో లస్కర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు జలవనరుల మంత్రి రామానాయుడు తెలిపారు. లస్కర్ల కొరతపై టీడీపీ సభ్యులు రాంగోపాల్‌రెడ్డి, బీటీ నాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 'కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి రాష్ట్రంలో 7,224 మంది లస్కర్ పోస్టులకు 1,517 మందే పని చేస్తున్నారు. నిరుడు 1,033 మందిని ఔట్‌సోర్సింగ్‌లో తీసుకున్నాం. గత ప్రభుత్వం లస్కర్ల జీతాలు కూడా చెల్లించకపోతే.. రూ.9.16కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది. లస్కర్ల రోజువారీ వేతనాన్ని రూ.350 నుంచి రూ.500కు పెంచాం' అని చెప్పారు. చైర్మన్ మోషేన్‌రాజు జోక్యం చేసుకుని, లాకులు, షట్టర్లకు మరమ్మతులు చేయకుండా లస్కర్ల నియమించి ఉపయోగం ఏంటని అన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

ఫిర్యాదులొస్తే అంగన్వాడీలపై చర్యలు: సంధ్యారాణి

అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై టీడీపీ సభ్యులు గ్రీష్మ, రాంగోపాల్‌రెడ్డి, రవిచంద్ర అడిగిన ప్రశ్నకు మహిళా సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి జవాబిస్తూ.. ప్రజల నుంచి ఫిర్యాదుల అందినచోట అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2025లో 172 మంది సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

బీసీ హాస్టళ్లలో మౌలిక వసతుల మెరుగు: సవిత

బీసీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత చెప్పారు. టీడీపీ సభ్యులు రాజశేఖరం, గ్రీష్మ, రాంగోపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. పులివెందులలో నిర్మించిన బీసీ హాస్టల్‌ను జూన్‌లో ప్రారంభిస్తామని చెప్పారు.

కొత్త జిల్లా కోర్టుల ఏర్పాటు ప్రతిపాదన లేదు: ఫరూక్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో జిల్లా కోర్టుల ఏర్పాటుకు ఇంకా ప్రతిపాదనలు రాలేదని న్యాయశాఖ మంత్రి ఫరూక్ చెప్పారు. ప్రస్తుతం 13 ఉమ్మడి జిల్లాలే జ్యుడీషియల్ జిల్లాలుగా ఉన్నాయని తెలిపారు. పాత 13 జిల్లాల్లోనే జిల్లా ప్రధాన, సెషన్స్ జడ్జి కోర్టులు పని చేస్తున్నాయన్నారు.

మండలి ప్రశ్నోత్తరాలు వాడివేడిగా.. !

శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడిగా చర్చ నడిచింది. సభ్యులు రోజుకు రెండు ప్రశ్నలే అడగాలని, అనుబంధంగా మూడు అంశాలతో ప్రశ్న క్లుప్తంగా ఉండేలా చూసుకోవాలని చైర్మన్ సూచించారు. ప్రశ్నలకు ఎక్కువ అనుబంధాలు వద్దన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలపై హోంమంత్రి అనిత సమాధానం ఇవ్వగా, వైసీపీ సభ్యురాలు కళ్యాణి మాట్లాడుతూ మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని, గంజాయి అదుపు కాలేదని చెప్పారు. దీనిపై ప్రభుత్వ చీఫ్‌విప్ అనురాధ జోక్యం చేసుకుని అబద్ధాలు, అసత్యాలు చెప్తున్నారని అన్నారు. వైసీపీ హయాంలో గంజాయి విచ్చలవిడిగా ఉందని, ఇప్పుడు సాగు ఆగిందని టీడీపీ సభ్యుడు శ్రీకాంత్ చెప్పారు. వీటిని శాంతిభద్రతలపై చర్చలో మాట్లాడాలని బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు సూచించారు.

దేవుడు క్షమించడు!



(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో కల్తీనెయ్యి, దాని అనంతర పరిణామాలపై సీఎం ప్రసంగించారు. ముఖ్యాంశాలివీ..

కల్తీ వెనక కుట్ర..

2019-24 మధ్య తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసేందుకు టెండర్ నిబంధనలు మార్చారు. నాణ్యతా ప్రమాణాలు తగ్గించారు. నెయ్యి సరఫరా చేసే సంస్థ నెలకు కనీసం 4 లక్షల లీటర్ల పాలు సేకరించాలన్న నిబంధన ఎత్తివేశారు. వార్షిక టర్నోవర్‌ను రూ.150 కోట్లకు కుదించారు. తాము అనుకున్న కంపెనీలకు టెండర్ కట్టబెట్టేందుకు ముందస్తు కుట్రను అమలు చేశారు. తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యిలో కల్తీ ఉందని 2022లోనే ఫిర్యాదులు వచ్చాయి. నెయ్యి శాంపిళ్లను సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌లో పరీక్షించగా కల్తీ ఉందని రిపోర్టు వచ్చింది. ఈ నివేదికను నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తొక్కిపెట్టారు. మా ప్రభుత్వం వచ్చాక తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యిపై ఫిర్యాదులు రావడంతో అప్పటి టీటీడీ ఈవో (శ్యామల రావు) నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ)-కాఫ్ ల్యాబ్‌లో 2024 జూలైలో రెండు దఫాలుగా పరీక్ష చేయించారు. నెయ్యి కల్తీతోపాటు జంతు మాంసం కొవ్వు అవశేషాలు ఉన్నాయని నివేదిక వచ్చింది. దీని ఆధారంగానే నేను ఎన్డీఏ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశాను. 2019-24 నడుమ తిరుమలకు సరఫరా అయిన నెయ్యిలో కల్తీ జరిగిందని.. రసాయనాలు కలిశాయనే సీబీఐ సిట్ కూడా తేల్చింది. కల్తీ ఘోరం నాటి టీటీడీ చైర్మన్, బోర్డుకు తెలిసే జరిగింది. అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న లంచాలు తీసుకున్నారని.. ఆయన ఖాతాలో రూ.4.5 కోట్లు వచ్చిపడ్డాయని సిట్ తేల్చింది. కల్తీ నెయ్యి సరఫరా చేసేందుకే నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకున్నారు. చుక్క పాలు సేకరించని కంపెనీలు వివిధ రసాయనాలతో కల్తీ నెయ్యిని తయారు చేశాయి. దీంతోనే లడ్డూలు, ఇతర ప్రసాదాలు తయారు చేసి ఘోరమైన అపచారం చేశారు. టీటీడీ సాంకేతిక నిపుణులకు ఖరీదైన ఫోన్లు, గిఫ్టులు ఇచ్చారు.

చార్జిషీటులో 35వ పేజీలో ఉంది కదా!

తిరుమలకు సరఫరా అయిన నెయ్యిలో రసాయనాల కల్తీతోపాటు, జంతువుల కొవ్వు కలిసిందని నిగ్గు తేల్చిందే ఎన్‌డీడీబీ-కాఫ్. అయినా జంతువుల కొవ్వు కలవలేదని, కల్తీనే లేదని వైసీపీ నేతలు, మరికొందరు అడ్డగోలుగా వాదిస్తున్నారు. సిట్ చార్జిషీటులో జంతువుల కొవ్వు అనే పదం స్పష్టంగా వాడారు. 35వ పేజీలో ఎన్‌డీడీబీ-కాఫ్ రిపోర్టు ప్రస్తావన ఉంది. దాని ఆధారంగానే నేను, పవన్ లడ్డూ కల్తీపై మాట్లాడాం. జగన్ హయాంలో 59.71 లక్షల కిలోల కల్తీ నెయ్యిని వినియోగించి 20.01 కోట్ల లడ్డూ ప్రసాదాలు తయారు చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక తిరుమలలో అన్యమత ప్రచారం జరిగింది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఆర్టీసీ బస్సు టికెట్లపై పవిత్ర జెరూసలెం యాత్ర అంటూ ముద్రించారు. లేని పింక్ డైమండ్ చోరీ చేశానని నాపైనే తప్పుడు ప్రచారం చేశారు. మేం 100 కోట్ల పరువునష్టం కేసు వేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ కేసు నుంచి టీటీడీ వెనక్కి తగ్గేలా చేసింది. జగన్ టీటీడీని రాజకీయ పునరావాసంగా మార్చారు. 85 మందితో జంబో పాలకమండలిని ఏర్పాటు చేశారు. హైకోర్టు తప్పుపట్టడంతో ఉత్తర్వులు మార్చారు. జగన్ హయాంలో హిందూమతంపై ప్రణాళిక ప్రకారమే దాడి జరిగింది. 2,032 దేవాలయాలపై దాడులు జరిగాయి. 32 విగ్రహాలను ధ్వంసం చేశారు. 59 విగ్రహాల చోరీ జరిగింది. అయినా నిందితులపై చర్యలు తీసుకోలేదు. మా హయంలో దేవాలయాలపై దాడులకు పాల్పడితే ఉపేక్షించం.

రాజశేఖరరెడ్డి జమానా నుంచే..

2005లో అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి జమానా నుంచే హిందువులపై దాడి మొదలైంది. తిరుమల రెండు కొండలేనంటూ 2005 సెప్టెంబరు 16న నాటి పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి శామ్యూల్ జీవో 338 ఇచ్చారు. దీనిపై హిందువుల తిరుగుబాటుతో తిరుమల ఏడు కొండలంటూ 2007 జూలై 2న జీవో 747 ఇచ్చింది. అధికారంలోకి వస్తే ఈ 747 జీవోను రద్దుచేస్తానని నేను చెప్పినట్లుగా జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నేను రద్దుచేస్తానన్నది జీవో 338నే. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు దేవ సంగీతం అనే వ్యక్తిని ఎస్వీ యూనివర్సిటీ వీసీగా నియమించారు. ఆయన వర్సిటీలో శ్రీవారి ఫొటోలను కూడా తొలగించారు. పద్మావతి వర్సిటీకి వీణా నోబుల్ దాస్ అనే క్రిస్టియన్ మహిళను వీసీగా నియమించారు. ఆమె హయాంలో బలవంతపు మత మార్పిళ్లు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. వైవీ సుబ్బారెడ్డి సతీమణి చేతిలో బైబిల్ పట్టుకుని తిరిగే వారు. భూమన కూతురు చర్చిలో క్రైస్తవ సంప్రదాయంలో వివాహం చేసుకున్నారు. ఇలాంటి వారిని టీటీడీ చైర్మన్లుగా ఎలా నియమిస్తారు? ఇకనైనా గత పాలకులు చేసిన తప్పులు ఒప్పుకోవాలి. హైందవ ధర్మంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నాను. ఇతర మతాలవారి మనోభావాలను దెబ్బతీసే అధికారం మరొకరికి లేదు.

నీతి, నిజాయితీతో హెరిటేజ్..

జగన్ హయాంలో ఆయన సొంత సంస్థ భారతి సిమెంట్స్‌కు లబ్ధి చేకూర్చారు. ప్రభుత్వ హౌసింగ్ పథకాలు, ఇతర స్కీములకు భారతి సిమెంట్స్‌కు ఆర్డర్లు ఇచ్చారు. హెరిటేజ్ మా కుటుంబ సంస్థ. ప్రభుత్వంలో ఎక్కడా దాని ఉత్పత్తులు సరఫరా చేయలేదు. మా సంస్థ నుంచి ఒక్క కేజీ నెయ్యిని కూడా ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేయలేదు. ప్రభుత్వ సహకారం లేకుండా నీతి, నిజాయితీతో హెరిటేజ్ నిలబడింది. పుణేలో ఉన్న ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్‌కు నెయ్యి విషయంలో ఏ సంబంధం లేదు. హెరిటేజ్ ఎప్పుడూ తప్పుడు పనులు చేయదు.

నిజం చెప్పినందుకు 'ఆంధ్రజ్యోతి'పై కేసు..

గత పాలకుల హయాంలో టీటీడీ వెబ్‌సైట్‌లో ఏసు ప్రభువు ఫొటో, శిలువ కూడా కనిపించింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' పత్రిక స్పందించి 'ఏసయ్య సేవలో టీటీడీ' అంటూ వార్తను ప్రచురించింది. జరిగిన తప్పును సరిదిద్దుకోకుండా ఆ పత్రికపై రూ.100 కోట్ల పరువునష్టం కేసు వేశారు. ఈ కేసును వాదించడానికి సుబ్రహ్మణ్యస్వామి లాంటి వాళ్లను పిలిపించారు. నిజం చెప్పినందుకు సరిదిద్దుకోకుండా.. పత్రికపై కేసులు పెడతారా?

టీటీడీ ప్రక్షాళన చేపట్టాం..

కూటమి ప్రభుత్వం వచ్చాక టీటీడీ ప్రక్షాళనకు చర్యలు చేపట్టాం. లడ్డూ ప్రసాదాల నాణ్యత పెంచాం. భారత ఆహార భద్రత-ప్రమాణాల సంస్థ ధ్రువీకరణ తర్వాతే లడ్డూ తయారీ పదార్థాలు కొనుగోలు చేస్తున్నాం. అన్నప్రసాదాల నాణ్యత పెంచాం. క్యూలైన్ల వద్ద 24గంటలూ పాలు అందించేందుకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశాం. భక్తుల రద్దీ నియంత్రణకు కమాండ్ కంట్రోల్ తీసుకొచ్చాం. 60 టీటీడీ దేవాలయాల్లో రూ.700 కోట్లతో అన్నదానం చేపడుతున్నాం. 3.5 ఎకరాల్లో దివ్య ఔషధ వనం ప్రాజెక్టు చేపట్టాం. దేశవ్యాప్తంగా 5వేల దేవాలయాలు నిర్మించాలన్నది ప్రణాళిక. దేశంలోని అన్ని ముఖ్యమైన నగరాల్లో ఆలయాలు నిర్మాణం చేపట్టాలని ఆలోచన. నన్ను అంతమొందించేందుకు అలిపిరి సమీపంలో నక్సల్స్ 23 క్లెమోర్‌మైన్స్ పేల్చినా బతికాను. వేంకటేశ్వరస్వామి పునర్జన్మ ఇచ్చారు. ఈ జీవితం ఆయనిచ్చిన కానుక. నేను బతికి ఉన్నంత వరకు ఆయన పవిత్రతను కాపాడతా. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తా. రోజూ 2నిమిషాలు స్వామిని తలచుకుంటా. ఏ కష్టం, బాధవచ్చినా ఆయన్ను తలచుకుని ముందుకెళ్తా. అదే నా శక్తి. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా క్యూలోనే వెళ్లి స్వామిని దర్శించుకుంటాను. ఎన్టీఆర్ అన్నదానం ప్రారంభిస్తే.. నేను ప్రాణదానం ప్రారంభించా.

రాష్ట్రంలో శాంతిభద్రతలు భేష్

» రప్పా అంటే తాటతీస్తాం: హోంమంత్రి అనిత

» శాసన మండలిలో శాంతిభద్రతలపై చర్చ రసాభాస



అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'చిన్నారులు, మహిళల జోలికి ఎవరొచ్చినా వారికి అదే ఆఖరి రోజు. శాంతి భద్రతల విషయంలో కూటమి ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదు' అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. శాసనమండలిలో శాంతి భద్రతలపై మంగళవారం జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నేరాలు 6శాతం తగ్గితే, మహిళలపై నేరాలు 4శాతం తగ్గాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి దీనావస్థలో ఉన్న పోలీసు శాఖను బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షన్నర సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రోన్లతో పోలీసు పెట్రోలింగ్ చేస్తూ ర్యాగింగ్ నుంచి పేకాట వరకూ, ట్రాఫిక్ నుంచి జాతర్ల బందోబస్తు వరకూ పర్యవేక్షిస్తున్నామని వివరించారు. మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యం, గంజాయి నిర్మూలన రెండో అంశంగా తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా ఆపేశామని, మహిళల జోలికి వచ్చిన వారు ఏడాదిన్నరలో 500మందికి పైగా శిక్షలు పడి జైలు పాలయ్యారని అన్నారు. ఆర్థిక మోసాలు తప్ప ఇతర అన్ని రకాల నేరాలు తగ్గాయని వివరించారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలపై శాసనమండలిలో వైసీపీ సభ్యులు కల్యాణి, మంగమ్మ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 'వైసీపీ నేతలకు ఒక్కటే చెబుతున్నా.. రప్పా రప్పా అంటే తప్పేముంది అని వెనకేసుకొచ్చేందుకు ముఖ్యమంత్రిగా ఉన్నది జగన్ కాదు. హద్దులు మీరిన వారి తాటతీసే చంద్రబాబు సీఎం.. గుర్తుపెట్టుకోండి' అంటూ హెచ్చరించారు. 7993485111 వాట్సాప్ నంబరు ద్వారా మహిళలకు ఏ ఆపద వచ్చినా పోలీసులకు తెలియజేస్తే సత్వర చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శాంతిభద్రతల్లో ఏపీ చివరిలో ఉందని జగన్ పత్రికలో తప్పుగా రాశారని మండిపడ్డారు. జనసేన సభ్యుడు నాగేంద్రబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ రాష్ట్రంలో 125 మంది అక్రమ వలసదారులు ఉన్నారని వెల్లడించారు. బీజేఎల్పీ నేత సోము వీర్రాజు మాట్లాడుతూ.. "అధికారంలోకి రాగానే ప్రజా వేదిక కూల్చిన వైసీపీ నేతలు స్థానిక సంస్థల నుంచి ఉప ఎన్నికల వరకూ అరాచకాలు సృష్టించి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారు. విజయనగరంలో రాములోరి విగ్రహ శిరచ్ఛేదం చేయడంతో పాటు తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న మహిళలపై దాడులు చేయించిన వీళ్లకు మాట్లాడే అర్హత ఉందా? దేశ ప్రధాని చిలకలూరిపేటలో సభకు హాజరైతే కనీస రక్షణ కల్పించలేని మీరా శాంతి భద్రతల గురించి మాట్లాడేది' అంటూ వైసీపీ సభ్యుల్ని నిలదీశారు. వైసీపీ సభ్యులు ఆయన మాట్లాడుతున్నంతసేపూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎవరి మెప్పు కోసం ఇలా మాట్లాడుతున్నారంటూ మండలి ప్రతపక్ష నేత బొత్స చేసిన వ్యాఖ్యలకు మంత్రి లోకేశ్ గట్టిగా బదులిచ్చారు. సీనియర్ సభ్యుడు వాస్తవాలు మాట్లాడుతుంటే రన్నింగ్ కామెంటరీతో ఎగతాళి చేయడమేంటని నిలదీశారు. వైసీపీ సభ్యులు మండలి నుంచి వాకౌట్ చేసి వెళ్లిపోవడంతో నిజాలు మాట్లాతామన్న భయంతో పారిపోయారని మంత్రి అనిత అన్నారు.

గత టీటీడీ పాలక మండలిని విచారించాలి: యార్లగడ్డ

లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వ్యవహారంలో గత టీటీడీ పాలక మండలి చైర్మన్‌తోపాటు సభ్యులనూ విచారణ చేయాలని టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. తిరుమలలో 1717లో లడ్డూ ప్రసాదాన్ని ప్రారంభించగా, అప్పటి నుంచి ఇప్పటివరకు మొఘలులు, బ్రిటిషువారు సహా పాలకులెవరూ ఇలా వైసీపీలా దుస్సాహం చేయలేదని మండిపడ్డారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా టీటీడీనే దేశవాళీ, ఒంగోలు జాతి ఆవులను సంరక్షిస్తూ.. వాటి పాలతో స్వచ్ఛమైన నెయ్యిని తయారు చేయాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యేల మృతికి సంతాపం

ఇటీవల మృతి చెందిన మాజీ సభ్యులు పిడతల రాంభూపాల్‌రెడ్డి, ఆసిఫ్ పాషా, గుంటి వెంకటేశ్వరప్రసాద్, గంటెల సుమన, గుండా అప్పల సూర్యనారాయణ, ఈలి వరలక్ష్మి, తడపట్ల రత్నాబాయిలకు శాసనసభ సంతాపం తెలిపింది. వారి సేవలను స్పీకర్ సభకు గుర్తు చేశారు.



శిక్ష పడాల్సిందే

పాలు లేకుండా నెయ్యి చేసిన ఘనత వైసీపీదే.. కెమికల్ నెయ్యి పాపం గత టీటీడీ పాలక మండలిదే

నాటి 'ముఖ్య నేత' కూడా బాధ్యుడే.. ఇస్లాం, క్రైస్తవ మతాల్లో ఇలా జరిగితే దేశం గగ్గోలు పెట్టేది

దోషులను కూటమి ప్రభుత్వం శిక్షిస్తుంది.. కల్తీ నెయ్యిపై సభలో మాట్లాడిన పవన్ కల్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తిరుమల లడ్డూ ప్రసాదంలో కెమికల్ నెయ్యి వాడటం అత్యంత తీవ్రమైన నేరం. ఈ నేరానికి పాల్పడిన బాధ్యులకు శిక్షపడాలి. దోషులను కూటమి ప్రభుత్వం కచ్చితంగా శిక్షిస్తుంది" అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కుట్ర జరిగిందని తెలిపారు. ఎన్‌డీడీబీ నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని చెబితే, సీబీఐ నేతృత్వంలోని సిట్ చేపట్టిన విచారణలో నెయ్యిలో అసలు నెయ్యే లేదని తేలిందన్నారు. అరాచకాల్లో నూతన ఆవిష్కరణలు చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. తిరుమలలో జరిగిన తప్పులకు గత టీటీడీ పాలక మండలిదే బాధ్యతనీ, అలాంటి వారిని వెనకేసుకొస్తున్న గత ప్రభుత్వంలోని ముఖ్యమైన వ్యక్తి కూడా బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీకి 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి వాడారని సిట్ విచారణలో తేలిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ఎన్డీఏ శాసనసభ్యుల సమావేశంలో సీఎం చంద్రబాబు గత ప్రభుత్వ అరాచకాలను వివరిస్తున్న క్రమంలో, కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రస్తావించారన్నారు. ఎన్‌డీడీబీ నివేదికను తాను కూడా చదివానని, అప్పటికే పలు సందర్భాల్లో భక్తులు లడ్డూలో నాణ్యత లేదని తనతో చెప్పారన్నారు. సున్నితమైన వ్యవహారంలో రాజకీయ ఆరోపణలు చేయకూడదని అనుకున్నామని తెలిపారు. అయితే, గత పాలకులు అసలు నెయ్యిలో కల్తీయే జరగలేదని చెబుతుండటంతో ఆ వ్యవహారంపై వివరణ ఇవ్వాలనిపించిందన్నారు. గతంలో తిరుమల వెళ్లిన సందర్భంలోనూ చాలామంది ప్రసాదం నాణ్యత అంశాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని, తప్పు జరిగిందని తెలిసీ దాన్ని సరిగా ముందుకు తీసుకువెళ్లకపోతే ఎలాగన్న పశ్చాత్తాపంతోనే దీక్ష చేశానని గుర్తుచేశారు. లడ్డూ కల్తీని గత ప్రభుత్వంలోని వ్యక్తులు చేశారని తామెక్కడా చెప్పలేదన్నారు. గత ప్రభుత్వం నియమించిన పాలక మండలి చేసిన తప్పునకు ఆ ప్రభుత్వంలోని వారే జవాబుదారీ అవుతారని మాత్రమే అన్నానని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

48.76 కోట్ల లడ్డూలు..

"2019-24 మధ్య సుమారు 11 కోట్ల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ కాలంలో 48.76 కోట్ల లడ్డూ ప్రసాదాలు విక్రయం జరగ్గా, అందులో సుమారు 20.10 కోట్ల లడ్డూలు నకిలీ నెయ్యితో తయారయ్యాయని టీటీడీ రికార్డులు చెబుతున్నాయి. ఇందులో నుంచే లక్ష లడ్డూలు అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా పంపిణీ చేశారు. మళ్లీ ఆ లడ్డూలు కల్తీ నెయ్యితో చేసినవి కాదు అంటారు. సిట్ రిపోర్టు నెయ్యిలో రసాయనాలు ఉన్నాయని స్పష్టంగా చెబుతోంది. వీళ్లేమో లడ్డూలో కల్తీ లేదంటున్నారు. సీబీఐ నేతృత్వంలోని సిట్ ఆ నెయ్యి తయారీకి ఒక్క లీటరు పాలు కూడా వినియోగించలేదని పేర్కొంది. పామాయిల్లో రసాయనాలు కలిపి తయారు చేసినట్లు చెప్పింది. ఈ కేసులో 36 మందిని నిందితులుగా తేల్చింది. తమకి నచ్చిన సంస్థలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు ఓ ప్రణాళిక ప్రకారం టెండర్ నిబంధనలు సవరించారు. ఇలాంటి ఘోర తప్పిదాలు ఇంకే మత ధర్మం విషయంలో జరిగినా ఈపాటికే దేశం మొత్తం గగ్గోలు పెట్టేసేవారు. ఇతర మతాల గురించి మాట్లాడితే ఓట్లు పోతాయని, హిందువుల గురించి మాట్లాడడం తేలిక అన్న పద్ధతిలో మార్పు రావాలి. దీనిని హిందువులూ గుర్తించాలి. సరైన సమయంలో సమాధానం చెప్పాలి."

'భగవంతుడి సేవలో వారుండకూడదు'

ఆముక్త మాల్యదలోని పద్యం వినిపించిన పవన్

శ్రీకృష్ణ దేవరాయలు రచించిన ఆముక్త మాల్యదలోని 218వ పద్యంలో రాజుకు కర్తవ్యాన్ని ఉపదేశిస్తూ.. ఉన్న పద్యాన్ని అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చదవి వినిపించారు. "రాజు కోసం పన్నులు వసూలు చేసే వారికి దేవాలయాలపై అధికారం ఇవ్వొద్దు. అలాంటి వారు డబ్బు మీద ఆశతో, రాజ్యానికి సంబంధించిన వసూళ్లలో నష్టం వచ్చినప్పుడల్లా దేవుడి ధనాన్ని రాజు ఖజానాకు చేర్చేస్తారు. అందువల్ల ఎలాంటి మమకారాలూ లేని ఒంటరి వ్యక్తే ఆలయ అధికారిగా ఉండాలి. ఒకవేళ ఆ వ్యక్తి దేవుడి సొత్తు తింటే, ఆ పాపానికి వాడే నాశనం అవుతాడు. అలా కాకుండా ఆ డబ్బు తెచ్చి రాజు ఖజానాకు చేర్చడం వల్ల రాజ్యమే నాశనం అవుతుంది" అని వివరించారు. గత ప్రభుత్వంలో అంతా ఇలానే జరిగిందన్నారు. భగవంతుడి డబ్బుని దోచుకునేవారు, వారి తరాలూ లేచిపోతాయని వ్యాఖ్యానించారు. కేసును సాగదీసే కొద్దీ వాళ్ల పాపమే పెరుగుతుందంటూ వైసీపీ నేతలను ఉద్దేశించిన పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

కల్తీ పాల ఘటన ప్రభుత్వ అసమర్థతే: బొత్స

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో వెలుగు చూసిన కల్తీ పాల ఘటన ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. కల్తీ పాలు తాగి ఐదుగురు చనిపోయినా ఇప్పటివరకు ఒక్కరిపైనైనా చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. తప్పు చేస్తే ప్రభుత్వం శిక్షిస్తుందన్న భయం లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. మంగళవారం ఆయన వైసీపీ ఎమ్మెల్సీలతో కలిసి అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. దోపిడీలు, దౌర్జన్యాలు, హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువైపోయాయని ఆరోపించారు.

వైసీపీ పాపాలను వైఎస్‌కు అంటగడతారా: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేసిన కల్తీ పనులను వైఎస్ రాజశేఖరరెడ్డికి అంటగడతారా అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లుగా కూటమి తీరు ఉందని మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తిరుమల పవిత్రతపై వైసీపీ చేసిన పాపాన్ని, మహానేత వైఎస్సార్‌కు అంటగట్టడం చంద్రబాబుకు భావ్యం కాదు. ఆయన ఆరోపణలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలి. దివంగత నేతకు చంద్రబాబు క్షమాణలు చెప్పాలి. వైఎస్సార్ ఏడు కొండలను రెండు కొండలను చేయాలని ఏనాడూ అనుకోలేదు. వైఎస్సార్‌ది సంక్షేమ పాలనైతే .. వైసీపీది దోచుకుతిన్న పాలన. వైసీపీ అరాచకాలతో వైఎస్సార్‌కు సంబంధం లేదు' అని స్పష్టంచేశారు.


తిప్పిరి తిరుపతి


మల్లా రాజిరెడ్డి


బడే చొక్కారావు


నూనె నర్సింహారెడ్డి

విప్లవ పోరుకు ముగింపు!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర కమిటీలో.. మిగిలిన అగ్ర నేతలు ఒక్కసారిగా లొంగిపోవడంతో కేంద్ర కమిటీ కుప్పకూలినట్లయింది. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. నలుగురు అగ్రనేతలు లొంగిపోవడం ద్వారా మావోయిస్టు పార్టీ అత్యున్నత సంస్థాగత నిర్మాణం పతనమైందన్నారు. తెలంగాణలో రూపుదిద్దుకున్న విప్లవ పోరాటానికి ఇక్కడే ముగింపు దొరకడం విశేషమన్నారు. వాస్తవానికి విప్లవోద్యమం శ్రీకాకుళంలో ప్రారంభమైంది. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థన మేరకు లొంగిపోతున్న మావోయిస్టుల పునరావాసానికి కట్టుబడి ఉంటామని, వారి ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డువేసి కాపాడుతామని డీజీపీ ప్రకటించారు.

తెలంగాణ ప్రభుత్వ పునరావాస చర్యల వల్లే..!

తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న పునరావాస చర్యలను గమనించి మావోయిస్టులు లొంగిపోతున్నారని డీజీపీ అన్నారు. గతేడాది నుంచి నేటి వరకు నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 26 మంది జిల్లా కమిటీల సభ్యులు, 85 మంది ఏరియా కమిటీ సభ్యులతోపాటు 460 మంది మావోయిస్టు పార్టీ కార్యకర్తలు కలిపి మొత్తం 591 మంది లొంగిపోయారని వెల్లడించారు. లొంగుబాటే కాకుండా తెలంగాణ ఎస్‌ఐబీ తీసుకున్న చర్యల వల్ల వీరు ఆయుధాలు కూడా అప్పగించారని, మొత్తం 142 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మావోయిస్టు పార్టీ సంస్థాగత నిర్మాణం కుప్పకూలే దిశగా సాగుతుందన్న విషయాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. వారికి మద్దతిచ్చే వర్గాలు క్షీణించడం, క్యాడర్ల కదలికలపై పరిమితులు పెరగడం, నిరంతర కూంబింగ్ చర్యలు, సిద్ధాంతపరమైన అసంతృప్తి నేపథ్యంలో.. మిగిలిన వారిలోనూ తీవ్రమైన అంతర్మథనం జరుగుతోందని అన్నారు. ఇంకా కేంద్ర కమిటీలో ముగ్గురు సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు, మిసిర్ బెస్రా, నరహరి ఉన్నారని డీజీపీ వెల్లడించారు. వీరిలో లక్ష్మణరావు అడవుల్లో లేరని, ఆయన వృద్ధాప్య సమస్యలతో ఎక్కడో చికిత్స పొందుతున్నట్లుగా సమాచారం ఉందని తెలిపారు. లక్ష్మణరావు, ఆయన భార్య జోడే బాయి కూడా ముందుకొచ్చి లొంగిపోతే వారికి మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందినవారు ఇంకా 11 మంది వివిధ క్యాడర్లలో పలు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారని, వారంతా కూడా త్వరగా వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా.. త్వరలో మావోయిస్టు పార్టీలోని వివిధ క్యాడర్లకు చెందిన 50 మందికి పైగా ఆయుధాలతో లొంగిపోనున్నట్లు సమాచారం. కాగా, లొంగిపోయిన నలుగురు మావోయిస్టు నేతలపై ఉన్న రివార్డు మొత్తాన్ని డీజీపీ శివధర్‌రెడ్డి వారికి అందజేశారు. తిరుపతి, రాజిరెడ్డికి ఒక్కొక్కరిపై రూ.25 లక్షల చొప్పున ఉన్న రివార్డును, చొక్కారావు, నర్సింహారెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున ఉన్న రివార్డును కలిపి మొత్తం రూ.90 లక్షలను వారికి అందజేశారు.

చంద్రబాబుపై దాడి కేసులో కీలకం..

మావోయిస్టు పార్టీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ అప్రకటిత కార్యదర్శిగా కొనసాగుతూ.. సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జ్‌గా, పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న కరీంనగర్ జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి లొంగుబాటు మావోయిస్టు ఉద్యమానికి పెద్ద షాక్‌గా ప్రజా సంఘాలు పేర్కొంటున్నాయి. 44 ఏళ్ల మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో కొనసాగిన తిరుపతి.. మిలిటరీ వ్యూహకర్త మాత్రమే కాకుండా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. అలిపిరిలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడిలో దేవ్‌జీ కీలకపాత్ర పోషించారు.

రాజకీయ జీవితం కొనసాగిస్తా: దేవ్‌జీ

అనారోగ్య సమస్యలతోనే తాము రహస్య జీవితాన్ని వదిలి వచ్చామని, వ్యక్తిగత జీవితం కోసం కాదని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అన్నారు. ప్రజా సమస్యలపై తమ పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. తాను రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తానని, నమ్మిన సిద్ధాంతాన్ని కాపాడుకుంటానని స్పష్టం చేశారు. చెప్పాల్సిన విషయాలు చాలా ఉన్నాయని, త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

మావోయిజానికి ముగింపు లేదు: రాజిరెడ్డి

మావోయిజానికి ఎప్పుడూ ముగింపు ఉండదని, పోరాట పద్ధతుల తీరు మాత్రమే మారుతుందని మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ అన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తున్నవారిని సంఘటితం చేసుకుంటూ తాను ప్రజాక్షేత్రంలోనే ఉంటానన్నారు.

నేపాల్‌లో గణపతి.. పోలీసుల అదుపులోకి!

మావోయిస్టు పార్టీ ప్రస్తుత కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితోపాటు ఆయన భార్య జోడే రత్నాబాయి అలియాస్ సుజాతను నేపాల్‌లో తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో వీరిద్దరిని సైతం మీడియా ముందు ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం.

'కల్తీ'పై చర్యలు తప్పవు

» అసెంబ్లీలో మంత్రి ఆనం ప్రకటన

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తిరుమల కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రమైన అంశంగా పరిగణిస్తోందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో కల్తీ నెయ్యి, లడ్డూ కల్తీ వ్యవహారంపై చేపట్టిన స్వల్ప కాలిక చర్చ సందర్భంగా ఆయన ప్రకటన చేశారు. తిరుమల లడ్డూ తయారీకి వాడే నెయ్యి కల్తీ వ్యవహారంలో మతపరమైన మనోభావాలు ఇమిడి ఉండటంతో అది ప్రజా ప్రాధాన్యం కలిగిన అంశంగా మారింది. అందువల్ల ప్రభుత్వం 2024 సెప్టెంబరులో సిట్ ఏర్పాటు చేసింది. అనంతరం సుప్రీంకోర్టు సూచనల మేరకు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్‌ను పునర్వ్యవస్థీకరించాం. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే సజావుగా కల్తీ నెయ్యి వ్యవహారం నడిచేందుకు వీలుగా నిబంధనలను సడలించింది. ఈ విషయం సిట్ విచారణలో వెల్లడైంది. మేం టీటీడీ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నాం" అని ఆనం తెలిపారు.

నెయ్యిని సృష్టించారు : జ్యోతుల నెహ్రూ

లడ్డూ తయారీలో ఉపయోగించింది అసలు నెయ్యే కాదని, ఒక పదార్థాన్ని సృష్టించి దానికి అనేక రకాల రసాయనాలను కలిపి నెయ్యిగా చూపించి లడ్డూలో ఉపయోగించారని జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు.

మహా ప్రసాదంలో దోచేశారు : ధూళిపాళ్ల

తిరుమలలో అన్యమత ప్రచారం, కల్తీ నెయ్యి వ్యవహారం కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశాయని పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. లడ్డూలో కల్తీ జరగకపోతే, కల్తీ నెయ్యి సరఫరా కాకపోతే అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీం కోర్టులో కేసులు ఎందుకు వేశారని ప్రశ్నించారు. తమ వ్యాపారాల కోసం ప్రైవేటు డెయిరీలకు అవకాశం కల్పించి మహాప్రసాదంలో దోపిడీకి తెర లేపారన్నారు.

వైఎస్ హయాం నుంచే...: కూన రవికుమార్

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠను దెబ్బతీయడం వైఎస్ రాజశేఖర్‌రెడ్డితోనే మొదలైందని ఆమదాలవలస టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. 2005 జీవో 338 విడుదల చేసి తిరుమల ఏడు కొండలు కాదు రెండు కొండలే అంటూ, వైఎస్ హిందువుల మనోభావాలు దెబ్బతీశారన్నారు.

హిందూధర్మంపై దాడి ఇది: కాలవ

శ్రీవారి లడ్డూ కల్తీని హిందూ ధర్మంపై జరుగుతున్న దాడిగా పరిగణించాలని రాయదుర్గం టీడీపీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. వైఎస్ హయాంలో 2006 - 08 మధ్య టీటీడీ చైర్మన్‌గా ఉన్న భూమన తన కూతురు పెళ్లి చర్చిలో చేశారని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తిని మళ్లీ 2023లో జగన్ టీటీడీ చైర్మన్‌గా నియమించారన్నారు.

పింక్ డైమండ్‌పై లోపల వేయాల్సింది: సోమిరెడ్డి

టీటీడీలో లేని పింక్ డైమండ్ పోయిందని, చంద్రబాబు ఇంట్లో ఉందంటూ ఆరోపణలు చేసినప్పుడే వైసీపీ నేతలను లోపల వేయాల్సిందని సర్వేపల్లి ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

బాధితుల రక్తంలో..

యూరియా, సీరమ్ క్రియాటినిన్

» అందుకే విషపూరిత ప్రభావం
» వైద్యఆరోగ్యశాఖ ప్రాథమిక నివేదిక
» ఆరుకు చేరిన కల్తీ పాల మృతులు


గణేష్

రాజమహేంద్రవరం, విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కల్తీపాల బాధితుల రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయిలు అధికంగా ఉండడం వల్లే విషపూరిత ప్రభావం ఉందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ ప్రాథమిక నివేదికలో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. ప్రాథమిక ఎపిడెమియాలజికల్ పరిశీలనలో కల్తీ పాల వినియోగమే దీనికి ప్రధాన కారణమని తేలిందన్నారు. కల్తీ పాల ఘటనలో 15 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఏడుగురు వెంటిలేటర్, డయాలిసిస్ సహాయంతో చికిత్స పొందుతున్నారని చెప్పారు. మిగిలిన వారికి ప్రాణాపాయం తప్పిందన్నారు. జిల్లా పర్యవేక్షణాధికారి, వైద్యనిపుణులు, శాస్త్రవేత్తలు, నెఫ్రాలజిస్టులతో కూడిన అధికారులతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. 14 ఫీల్డ్ సర్వేలెన్స్ బృందాలు 679 ఇళ్లను సందర్శించి 957 కుటుంబాలను స్ర్కీనింగ్ చేశాయని, 110 కుటుంబాల్లో 315 మంది రక్తనమూనాలు సేకరించాయని చెప్పారు. వాటిలో 313 సాధారణ పరిస్థితుల్లో ఉండగా రెండు నమూనాల్లో మాత్రం యూరియా, క్రియాటినిన్ స్థాయిలు పెరిగినట్లు తేలిందన్నారు. ఇప్పటికే వరలక్ష్మి మిల్క్‌డెయిరీలో తనిఖీలు చేసి పాలు, పన్నీర్, నెయ్యి, మంచినీరు, వెనిగర్ నమూనాలు సేకరించామని, ప్రభావిత ఇళ్ల నుంచి కూడా పాలు, పెరుగు నమూనాలు సేకరించామని తెలిపారు. వీటిని కాకినాడ జేఎన్‌టీయూ యూనివర్సిటీ, విమ్టా ల్యాబ్‌లకు పంపించామన్నారు. 41 పాల నమూనాలు, పశువులకు ఇచ్చే ఆహారం, నీటి నమూనాలు సేకరించి వెటర్నరీ బయలాజికల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు పంపినట్టు తెలిపారు.

విశాఖ కేజీహెచ్‌లో ఆరేళ్ల బాలుడి మృతి

కల్తీ పాలు తాగి అస్వస్థతకు గురైన రాజమహేంద్రవరానికి చెందిన ఆరేళ్ల బాలుడు మనోహర్ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మనోహర్‌కు మూత్రంలో ఇబ్బందులు, కిడ్నీ సంబంధిత సమస్య తలెత్తడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు కాకినాడ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి ఈ నెల 18న కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి బాలుడికి యూరిన్ రాకపోవడం, కిడ్నీ సమస్య తీవ్రం కావడంతో డయాలసిస్ చేస్తూ వచ్చారు. మంగళవారం ఉదయం నుంచి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో వెంటిలేటర్ అమర్చారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో మనోహర్ మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. కాగా, ఈ బాలుడి మృతితో కల్తీపాల మృతుల సంఖ్య ఆరుకు చేరింది.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

» చెన్నై, ముంబై నుంచి మందులు: వీరపాండియన్

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనకు సంబంధించి ఆస్పత్రిలో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ప్రస్తుతం 15 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా వారిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. ఏపీఐఐసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలలో యూరియా ఆనవాళ్ల గురించి ఇప్పటి వరకూ తమ దృష్టికి రాలేదని చెప్పారు. మంగళవారం కొత్త కేసులు నమోదు కాలేదన్నారు. పాలను శీతలీకరణ చేసే మిషన్లలో కూలెంటుగా ఉపయోగించే ఇథలిన్ గ్లైకాల్ లీక్ అయినట్లు పోలీసులు విచారణలో గుర్తించారన్నారు. చికిత్స పొందుతున్న వారి కోసం ఏపీలో అందుబాటులో లేని మందులను చెన్నై, ముంబై నుంచి తెప్పిస్తున్నామని వివరించారు.

కల్తీపాల కేసులో నిందితుడు గణేశ్ అరెస్ట్

కల్తీ పాల విక్రయం కేసులో నిందితుడు అడ్డాల గణేషను పోలీసులు అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండుకు తరలించారు. కోరుకొండ మండలం నరసాపురం గ్రామానికి చెందిన అడ్డాల గణేశ్వరరావు (గణేశ్) 11 ఏళ్లుగా తన గ్రామంలో వరలక్ష్మి డెయిరీ పేరుతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులూ లేకుండా పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. పాడి రైతుల నుంచి పాలు సేకరించి ఇళ్లకు వెళ్లి విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 15న ఫ్రిడ్జ్‌లోని పాలు చూడగా ఒక క్యాన్‌లో అడుగున గడ్డకట్టడం గమనించాడు. అప్పటికే పైన ఉన్న పాలను కొందరికి అమ్మగా.. అవి చేదుగా ఉన్నాయని గణేశ్‌కి వాళ్లు చెప్పారు. గణేష్ ఈ విషయాన్ని నరేంద్రపురంలోని తన బావ దేగల గంగాధర్‌కు తెలిపాడు. అయితే, వాటిని విక్రయించవద్దని గంగాధర్ చెప్పినా వినకుండా సుమారు 105 మందికి ఆ పాలను విక్రయించానని గణేశ్ మధ్యవర్తుల సమక్షంలో చెప్పాడని సమాచారం. కాగా, కల్తీ పాలు తాగి మృతి చెందిన నలుగురికి ఎక్స్‌గ్రేషియాను కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ మంగళవారం అందజేశారు. తాడి కృష్ణవేణి, తాడి రమణిల కుటుంబానికి రూ.20లక్షలు, నీలా శేషగిరిరావు కుటుంబానికి రూ.10లక్షల చెక్కు అందించారు.

కల్తీపాల ఘటన దురదృష్టకరం: పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కల్తీపాలు తాగి 15మంది అనారోగ్యం పాలవడం దురదృష్టకరం, బాధాకరమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణచౌదరితో కలిసి ఎంపీ పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, వారి వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని ఆమె మీడియాకు చెప్పారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లావ్యాప్తంగా పాలశీతలీకరణ యంత్రాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు.

కాటసానికి చుక్కెదురు

» భద్రత కల్పించాలన్న వైసీపీ నేత పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనకు భద్రత కల్పించాలన్న కాటసాని అభ్యర్థనను తోసిపుచ్చుతూ, ఆయన పిటిషన్‌పై విచారణను ముగించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ఎవరికి ఎంత భద్రత ఉండాలో? అసలు భద్రత ఉండాలా? వద్దా? అనే అంశాలను కోర్టులు నిర్దేశించలేవని స్పష్టం చేసింది. తనకు ఉన్న భద్రతను (2+2 పీఎస్‌వో) ఉద్దేశ పూర్వకంగానే తొలగించారంటూ ఈ నెల 4న రాంభూపాల్ రెడ్డి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. తనకు ప్రాణహాని ఉన్నందున, భద్రతను పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు డీజీపీ, సెక్యూరిటీ రివ్యూ కమిటీ, ఎస్పీలను ప్రతివాదులుగా చేర్చారు. ఆ పిటిషన్ మంగళవారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, రాంభూపాల్ రెడ్డికి ప్రాణహాని ఉన్నదని, గతంలో ఆయన తండ్రితోపాటు ఆరుగురు కుటుంబ సభ్యులు హత్యకు గురయ్యారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాటసానికి ప్రాణహాని ఉన్నదని గతంలో ఆయనను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారని, ఇప్పుడేమో ఎలాంటి ముప్పు లేదని చెబుతున్నారని అన్నారు. ప్రతిపక్ష నేతలకు భద్రతను తొలగించి, అధికార పార్టీ వారికి మాత్రం అవసరానికి మించిన భద్రత కల్పిస్తున్నారని తెలిపారు. ఒకే ప్రాంతంలో రెండు వర్గాలు ఉన్నప్పుడు, ఒక వర్గానికి పూర్తిస్థాయిలో భద్రతను కల్పించి, మరో వర్గానికి మాత్రం పూర్తిగా భద్రతను తొలగించడం సరికాదని వాదనలు వినిపించారు. భద్రత కల్పిస్తే ఆ ఖర్చులను పిటిషనరే భరిస్తారన్నారు. అయితే, ఎవరికి ఎంత భద్రత కల్పించాలనే అంశాన్ని కోర్టులు నిర్దేశించబోవని ధర్మాసనం తెలిపింది. "మీరు మాజీ ప్రజా ప్రతినిధి. ఇప్పుడు ఏ పదవిలోనూ లేరు. మీదగ్గర ధన బలం మాత్రమే ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రాణహాని ఉందని భావిస్తే ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా కూడా భద్రత కల్పించుకోవచ్చు. దానికి అడ్డం ఏమీ ఉండదు కదా?" అని సీజేఐ ప్రశ్నించారు. ప్రాణహాని అంచనా అనేది ఎప్పుడూ ఒకేలా ఉండదని, పరిస్థితులను బట్టి మారుతూ ఉంటుందంటూ, రాంభూపాల్ రెడ్డి పిటిషన్‌ను బెంచ్ పరిష్కరించింది.


రేపటిలోగా లొంగిపోండి

» మద్యం కేసులో ముప్పిడి అవినాశ్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో కీలకంగా భావిస్తున్న ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 26వ తేదీలోగా లొంగిపోవాలని, ఆ తర్వాతే రెగ్యులర్ బెయిల్ కోసం అభ్యర్థించాలని చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీల ధర్మాసనం తేల్చి చెప్పింది. ముప్పిడి అవినాశ్ రెడ్డి (ఏ7) ద్వారానే మద్యం స్కామ్‌లో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి అక్రమ కార్యకలాపాలు జరిపారని దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. రాజ్ కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడు అవినాశ్‌రెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నారని, అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తే నిజాలు తెలుస్తాయని దర్యాప్తు సంస్థ గతంలో సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న సుప్రీంకోర్టు.. ముందు లొంగిపోవాలని అవినాశ్ రెడ్డిని ఆదేశించింది.



మాజీ హోం మంత్రి తానేటి వనిత కారు, (ఇన్‌సెట్‌లో) ఎమ్మెల్యే స్టిక్కర్



మాజీ ఎంపీ భరత్‌రామ్ కారు, (ఇన్‌సెట్‌లో) ఎంపీ స్టిక్కర్



మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కారు, (ఇన్‌సెట్‌లో) ఎమ్మెల్యే స్టిక్కర్



మిగిలిన నాయకుల కార్లపై ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్లు

పదవులు పోయినా.. 'స్టిక్కర్' పోలా!

» ఓడిపోయినా అధికార దర్పం వీడని వైసీపీ నేతలు
» వాహనాలపై 'ఎమ్మెల్యే', 'ఎంపీ'.. స్టిక్కర్లతో హల్‌చల్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నాయకులు ఇంకా అధికార దర్పాన్ని వీడలేదు! ఓడిపోయినా 'ఎమ్మెల్యే'లం.. 'ఎంపీ'లం అంటూ కార్లకు బోర్డులు తగిలించుకుని మరీ హల్‌చల్ చేస్తున్నారు! తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆస్పత్రిలో కల్తీపాల బాధితులను పరామర్శించడానికి మంగళవారం వచ్చిన వైసీపీ నాయకుల వాహనాలపై ఎంపీ, ఎమ్మెల్యే స్టికర్లు దర్శనమివ్వడం విమర్శలకు దారితీసింది. వాస్తవానికి వైసీపీని జనం గద్దె దింపి రెండేళ్లు కావస్తోంది. అయినా వారు తమ వాహనాలపై అధికారిక స్టిక్కర్లు తొలగించలేదు. ఏపీ 39 ఆర్‌పీ 3591 కారుకు.. సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే, పలాస అని, మార్గాని భరత్‌రామ్‌కు చెందిన ఏపీ 40ఎఫ్‌జీ 0001 కారుకు పార్లమెంట్ ఆఫ్ ఇండియా, ఆర్ఎస్/ 222, ఎంపీ అని.. ఏపీ 40హెచ్‌ఏ 1122 కారుకు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే, రామచంద్రాపురం అని విండ్‌షీల్డ్‌పై అధికారికారంలో ఉన్నప్పుడు జారీ చేసిన స్టిక్కర్లు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కారుపై ఎమ్మెల్యే స్టిక్కరు, రాజానగరం నియోజకవర్గం అని ఉంది. ఇంకా, మాజీ మంత్రులు తానేటి వనిత, విడదల రజిని కార్లతోపాటు, స్థానికంగా మరికొందరు వైసీపీ నేతలు కూడా వారి వాహనాలపై ఎమ్మెల్యే, ఎంపీ స్టిక్కర్లు అతికించుకొని.. సైరన్లతో హల్‌చల్ చేస్తున్నా.. అడ్డుకొనేవారు లేకపోవడం గమనార్హం!

రఘురామ టార్చర్ కేసులో.. సునీల్ నాయక్‌ను కస్టడీలో విచారించాలి

» ఆయనపై నాన్‌బెయిలబుల్ వారెంటు ఇవ్వండి
» గుంటూరు కోర్టులో పోలీసుల పిటిషన్.. నేడు తీర్పు

గుంటూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత డిప్యూటీ స్పీకర్, నాటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన గదిలో ఐపీఎస్ సునీల్ కుమార్ నాయక్(ఏ-7)తో పాటు సీఐడీ అదనపు ఎస్పీ విజయ్ పాల్ కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో నాలుగో నిందితుడైన విజయ్‌పాల్ విచారణకు సహకరించలేదని.. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు ముందుకు సాగాలంటే సునీల్ నాయక్‌ను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేయాలని గుంటూరులోని మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం ప్రాసిక్యూషన్స్ జాయింట్ డైరెక్టర్ వీరగంధం రాజేంద్రప్రసాద్ కోర్టులో వాదనలు వినిపించారు. సునీల్ నాయక్‌ను సోమవారం పట్నాలో అరెస్టు చేసిన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను మేజిస్ట్రేట్‌కు వివరించారు. కేసులో విచారణకు రావాలంటూ ఇప్పటికి రెండుసార్లు నోటీసులు పంపినప్పటికీ నాయక్ నుంచి స్పందన లేదన్నారు. సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంటు జారీ చేయడంతో పాటు పట్నాలో ఆయనను అరెస్టు చేసే క్రమంలో ఏపీ పోలీసులకు సహకరించాలంటూ బిహార్ సీఎస్, డీజీపీ, హోం కార్యదర్శి, సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈ వ్యవహారంలో బుధవారం తగు ఆదేశాలు ఇస్తానని న్యాయాధికారి స్రవంతి ప్రకటించారు.

మద్యం కేసులో.. సత్యప్రసాద్ ముందస్తు బెయిల్‌పై

విచారణ 2కి వాయిదా

» చెవిరెడ్డి, సువర్ణరాజు అనుబంధ పిటిషన్లు కొట్టివేత
» వాటికి విచారణార్హత లేదని హైకోర్టు స్పష్టీకరణ
» వాసుదేవరెడ్డి అరెస్టయినందున ఆయన వ్యాజ్యాన్నీ విచారించనక్కర్లేదని వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితులైన ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి(ఏ-2), ఎక్సైజ్ శాఖ ప్రత్యేక అధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్(ఏ-3) వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లలో తమను ప్రతివాదులుగా చేర్చుకోలని సహ నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఏ-38), మరో థర్డ్‌పార్టీ సువర్ణరాజు వేసిన అనుబంధ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. వారి వ్యాజ్యాలకు విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. వాసుదేవరెడ్డిని ఇప్పటికే అరెస్టు చేసినందున ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ అవసరం లేదంటూ ఆయన వ్యాజ్యాన్నీ కొట్టివేసింది. సత్యప్రసాద్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను మార్చి 2కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ దశలో సత్యప్రసాద్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. తొందరపాటు చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలని కోరారు. సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది మను శర్మ జోక్యం చేసుకుని.. అరెస్టుపై ఆయనకు ఆందోళన అవసరం లేదని తెలిపారు. దీంతో సత్యప్రసాద్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు. కాగా,అప్రూవర్లుగా మారుతామంటూ వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ ముందస్తు బెయిల్ కోరుతున్నారని.. వారికి బెయిల్ మంజూరు చేయవద్దని చెవిరెడ్డి, థర్డ్ పార్టీ సువర్ణరాజు అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు.

వాసుదేవరెడ్డిని 5 రోజులు కస్టడీకి ఇవ్వండి

» ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్

విజయవాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రెండో నిందితుడిగా ఉన్న దొంతిరెడ్డి వాసుదేవరెడ్డిని ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. 21వ తేదీన ఆయన్ను అరెస్టు చేయడం.. రిమాండ్‌పై ప్రస్తుతం ఆయన గుంటూరు జిల్లా జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఆయన బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న సమయంలో జరిగిన కుంభకోణంలో మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆయన్ను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందని.. ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ కోర్టును అభ్యర్థించింది.

కాయ నిగనిగ.. ధర ధగధగ!



(మొదటి పేజీ తరువాయి)

చాలా బాగుంటోంది. అందువల్ల చాలా మంది రైతులు కవర్లు వాడటానికి ముందుకొస్తున్నారు. నిరుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి ధర పడిపోయి, రైతులు నష్టపోయారు. రైతులకు కిలో రూ.12 ధర వచ్చేలా, వ్యాపారులు రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4 భరించింది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో టన్ను తోతాపురి మామిడి రూ.లక్షపైగా పలకడం విశేషం.

ఎన్టీఆర్ జిల్లాలో ముందస్తు కోతలు

రాష్ట్రవ్యాప్తంగా 10లక్షల ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ఎన్టీఆర్ జిల్లాలో 57వేల ఎకరాల్లో బంగినపల్లి, తోతాపురి, రసాలు, సువర్ణరేఖ రకాల మామిడి తోటలున్నాయి. విజయవాడ రూరల్, విసన్నపేట, ఎ.కొండూరు, జి.కొండూరు, రెడ్డిగూడెం, మైలవరం, తిరువూరు, నూజివీడు, జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లో మామిడి సాగులో ఉంది. ఈ జిల్లా నుంచి ఏటా 2.30 లక్షల టన్నుల మామిడి ఉత్పత్తి అవుతోంది. రెడ్డిగూడెం మండల రైతుల సాగు విధానం ప్రత్యేకంగా ఉండడంతో ఏటా పూత, కాయ త్వరగా వస్తోంది. 20 రోజులుగా ఈ జిల్లాలోని మామిడి తోటల్లో రైతులు కాపుకొచ్చిన పండ్లను కోస్తున్నారు. పెద్ద సైజులో, నాణ్యంగా ఉన్న పండ్లను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మామిడి పచ్చళ్ల తయారీ కోసం ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులూ వచ్చి మంచి ధరకు కొనుగోలు చేస్తున్నారు. నున్న, రెడ్డిగూడెం, విసన్నపేట, ఎ.కొండూరు, మైలవరం ప్రైవేట్ మార్కెట్ల ద్వారా రైతులు విక్రయిస్తున్నారు.

కవర్ల తొడుగుతో నాణ్యత, ధరలో వ్యత్యాసం

కవర్లు కట్టిన మామిడి కాయలకు, కవర్లు లేకుండా పండించే కాయలకు నాణ్యతలో చాలా తేడా ఉంటోంది. ధర కూడా సగానికి సగం వ్యత్యాసం ఉంటోంది. కవర్ల వల్ల తెగుళ్లు, కోతలు, పక్షులు, ఇతర జంతువుల నుంచి రక్షణ లభిస్తుంది. చెట్లకు రసాయన మందులు పిచికారీ చేసినప్పుడు కాయలపై పడకుండా ఉంటాయి. కోత సమయంలో పండ్లు నేలపై పడినా దెబ్బతినకుండా ఉంటాయి. మంగు, మచ్చ, డాగు లేకుండా నిగనిగలాడుతూ నాణ్యతగా ఉంటాయి. మామిడి పండ్లకు తొడిగే కవర్లకు ఉద్యానశాఖ 50% రాయితీ ఇస్తోంది. కవరు కేవలం రూ.2 మాత్రమే. అయితే కవర్ తొడగటానికి కూలీలు కవరుకు రూపాయి తీసుకుంటున్నారని రైతులు చెప్తున్నారు. మామిడితో పాటు జామ, అరటి, దానిమ్మ వంటి పండ్ల రైతులకు కూడా ఉద్యానశాఖ రాయితీపై కవర్లను అందిస్తోంది. 2025-26లో పండ్ల కవర్ల బడ్జెట్‌ను రూ.10కోట్లనుంచి రూ.36కోట్లకు పెంచినట్లు ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. కాగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ప్రస్తుతం మామిడి తోటలకు తెగుళ్లు విజృంభించడంతో పూత నిలబడక, దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తల సిఫారసు మేరకు క్రిమి సంహారక మందులు పిచికారి చేయాలని, మామిడి పండ్లకు కవర్లు రక్షణగా నిలుస్తాయని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.